కండ్లకు రక్షణ కలిగించి వారి
అందమును ఇనుమడింపచేయును
దర్బార్ కాటుక
(రిజిష్టర్డు)
తయారుదారులు రాంబీర్ & కో., బొంబాయి - 4
దర్బార్ గంధం, కుంకుమ తయారుచేయువారు

VISALAANDHRA Phone 6376
ఉదయం
** Regd. No H. 203

విశాలాంధ్ర

70 2625
సంపుటి 17, సంచిక 143] విజయవాడ 2—9—1967 శనివారం [6 పేజీలు 12 పై.

నేడే ప్రారంభం
హోటల్ గౌరిశంకర్
(లోగడ బృందావన్ భవన్)
బీసెంటు రోడ్ - విజయవాడ - 2
అధునాతనమైన, రుచికరమైన, మాంసాహార, శాకాహార భోజనహోటల్
డిన్నరు పార్టీలకు ప్రత్యేక వసతులు
ఎయిర్ కండిషన్డు రూఫ్ గార్డెన్ కలదు

మున్సిపల్ ఎన్నికలలో వామపక్షప్రజాతంత్రశక్తులను గెలిపించండి

రాష్ట్ర ప్రజలకు ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శివర్గం విజ్ఞప్తి

సక్రమ పౌరపరిపాలనకై కాంగ్రెసు ఓటమి అత్యవసరమని ఉద్ఘాటన

శ్రీ కాకాని సలహాపై విమర్శ

ప్రత్యర్థివర్గ నాయకులు శ్రీ వెంగళరావు ప్రకటన

హైదరాబాద్ సెప్టెంబరు 1

తనకు ముఖ్యమంత్రిపదవి వ్యక్తిగతంగా ఎలాంటి వ్యతిరేకతాలేదనీ. అయితే మంత్రులు ఒక్కొక్కరి దుశ్చర్యలను వ్యతిరేకతను తెలియజేయడం తమ కర్తవ్యంగా భావిస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ అసమ్మతి వర్గీయుల నాయకుడు, శాసనసభ్యుడు శ్రీ జలగం వెంగళరావు నిన్న యిక్కడ విడుదలచేసిన ఒక పత్రికా ప్రకటనలో చెప్పారు.

ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కాకాని వెంకటరత్నం, విమర్శలు నిషిద్ధం యేమీ కాకపోయినా, ఆ పని పార్టీ అంతర్గతంగానే జరగాలంటూ యీ మధ్య చేసిన వ్యాఖ్యకు సమాధానంగా శ్రీ వెంగళరావు యీ ప్రకటన చేశారు.

శ్రీ కాకాని చెప్పినదాంట్లో క్రొత్తేమీలేదు. ఆయన చెప్పిన సూత్రమూ మంచిదే. అయితే ఆచరణ మాత్రంలేదు. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడైన ఆయనమీదే యిరు పక్షాలకు న్యాయం చేకూర్చే బాధ్యత, పార్టీలో క్రమశిక్షణను కాపాడే బాధ్యత వుంది. అధికార పక్షమే అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. మేము మొదటినుంచి శ్రీ బ్రహ్మానందరెడ్డితో పూర్తిగా సహకరిస్తూనే వచ్చాం, సంస్థలో ఐక్యతా సాధన కోసం కృషి చేస్తూ వచ్చాం, ఇందుకు ప్రతిక్రియగా వారు చేసింది నెలకు 20 రోజులు చొప్పున రాజధాని వెలుపల పర్యటనలు చేస్తూ, స్వప్రయోజనాల కోసం, ఎమ్మెల్యేలను మట్టుపెట్టేందుకోసం పని చేయటం అని శ్రీ వెంగళరావు చెప్పారు.

హైదరాబాద్ సెప్టెంబరు 1

రెండు దశాబ్దాల పరిపాలనలో ప్రజలను అష్టకష్టాల పాల్జేసిన కాంగ్రెస్ పార్టీని రానున్న మున్సిపల్ ఎన్నికలలో చావు దెబ్బగొట్టి, మున్సిపాలిటీలను సక్రమంగా నిర్వహించ డానికి వామపక్ష ప్రజాతంత్ర శక్తులను గెలిపించ వలసిందిగా రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శివర్గం నేడు రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేసింది

కాంగ్రెస్ అవకాశవాద వైఖరిని ఒకకంట కనిపెట్టి ఎన్నికలలో జాగ్రత్తగా మసలుకొనవలసిన ఆవశ్యకతను గూర్చి హెచ్చరిస్తూ కార్యదర్శివర్గం నేడొక ప్రకటన యిచ్చింది

కార్యదర్శివర్గం తన ప్రకటనలో యింకా యీ విధంగా తెలియజేసింది.

"ఈ మాసంలో అనేక పట్టణాలలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. మన రాష్ట్ర ప్రజలు నూతన మున్సిపల్ కౌన్సిళ్ళను ఎన్నుకోనున్నారు. అవినీతికి ఆలవాలమైన కాంగ్రెస్ పరిపాలనపట్ల తీవ్ర వ్యతిరేకతను, అసహ్యతను, ప్రదర్శించడానికి యీ సందర్భాన్ని ఉపయోగించ వలసిందిగా రాష్ట్ర ప్రజలను రాష్ట్ర కమ్యూనిస్టు సమితి విజ్ఞప్తి చేస్తున్నది.

కాంగ్రెసుపార్టీపై ఏ మాత్రం విశ్వాసం లేదని తీర్పు చెప్పవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నది.

కాంగ్రెసుపార్టీ పాలిత సంస్థలను అవినీతికి కూపాలుగా మార్చివేసింది ముఠాలయేర్పాటు మధ్య తంపులు పెట్టుచున్నది. అసమర్థతకు మారుపేరుగా తయారు చేసింది.

ప్రతి పట్టణంలోనూ మురికి విపరీతంగా పెరిగిపోతున్నది. మురుగునీటి పథకాలు దారుణంగా తయారయినవి. మంచినీటి సరఫరా లోపభూయిష్టంగా వుంది. పన్నులకు ఒక క్రమం అంటూ లేకుండా వుంది. మున్సిపల్ పరిపాలన కుళ్ళి కంపు కొడుతున్నది.

కాంగ్రెస్ పేరుతో మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేయగూడదన్న కాంగ్రెస్ నిర్ణయం తన ప్రతిష్టకు పోతున్నదనడానికి నిదర్శనం. ఇవి పరికించవలసిన యెత్తులు. ఎన్నికలు ముగిసిన తర్వాత తిరిగి కాంగ్రెస్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీని యేర్పాటు చేస్తుంది.

కాంగ్రెసువాదులు ఇండిపెండెంట్లుగా పోటీ చేయగలరు. ఒకరితో ఒకరు పోటీ చేస్తారు. తీరా గెలిచినవారితో కాంగ్రెస్ పార్టీ యేర్పాటుచేస్తారు. ఇది అవకాశం తప్ప మరేమికాదు.

రెండు దశాబ్దాలు పరిపాలించిన కాంగ్రెస్ విధానాలు వికటించిన ధరల పెరుగుదలను ఆహార కొరతను ఆర్థిక వ్యవస్థ సంక్షోభమును, వేతన స్తంభనను, పేదవారిపై హెచ్చించిన అధిక పన్నులను, అభివృద్ధి పథకాల పూర్తి కోతను ప్రతికలని ప్రజలు గుర్తిస్తున్న సమయంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి.

మున్సిపల్ పన్నులు పెంచడానికి పైగా మున్సిపాలిటీలకిచ్చే ఆర్థిక సహాయాన్ని కోతపెడుతున్నారు. పట్టణప్రాంతాల ప్రజలకి సౌకర్యాలు నిరాకరిస్తున్నారు.

"కాంగ్రెసును చిత్తుగా ఓడించండి" మున్సిపాలిటీలను నిర్వహించడానికి వామపక్ష ప్రజాతంత్ర శక్తులను గెలిపించండి."

సక్రమమైన మున్సిపల్ పరిపాలనకు, పేదలకు పన్ను తగ్గింపు, వున్నవారి నుండి పన్నులు వసూలు చెయ్యటం అన్న సూత్రంపై సహేతుకంగా పన్ను వసూలు చేసేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఎన్నుకోవాలి.

మంచి సౌకర్యాలు కలిగించడానికి నీటి సరఫరా చేసేందుకు మురుగునీరు తొలగించేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఎన్నిక చేయాలన్న నినాదంపై మున్సిపల్ ఎన్నికలలో పోటీచేయాలి.

మున్సిపాలిటీలను స్వాధీనం చేసుకొని ప్రజా సంక్షేమం కొరకు వాటిని నడిపించడానికి, పటిష్టమైన సంఘాలను యేర్పాటు చేయడానికి అన్ని వామపక్ష ప్రజాతంత్ర శక్తులను, నికాయితీ గలవారందరినీ ఐక్యత గావించడానికి కమ్యూనిస్టుపార్టీ సర్వవిధాలా పనిచేయడానికి తయారుగావుంది.

నెల్లూరు మున్సిపల్ ఎన్నికల్లో

కమ్యూనిస్టు మార్క్సిస్టుల మధ్య ఒప్పందం

పట్టణ కమ్యూనిస్టు కమిటీచే 11 మంది అభ్యర్థుల పోటీ

నెల్లూరు, సెప్టెంబర్ 1

సెప్టెంబర్ 24న జరుగనున్న నెల్లూరు మున్సిపల్ ఎన్నికలలో 9 వార్డుల నుండి 11 మంది అభ్యర్థులను పట్టణ కమ్యూనిస్టు కమిటీ పోటీ పెడుతున్నది. ఈ 11 మందిలో 7 గురు అభ్యర్థులు జనరల్ స్థానాలలోనూ, ఇద్దరు షెడ్యూలు కులాలలో స్థానాలలో ఒకరు షెడ్యూలు తెగల స్థానంలోనూ, యింకొకరు మహిళా స్థానం (రిజర్వుడు సీటు)లోనూ పోటీ చేస్తున్నారు.

నిన్న 9 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు వేశారు. మిగతా యిద్దరూ ఈరోజు నామినేషన్లు వేస్తారు. ఈ మొత్తంసభ్యులు ఒకే 'బ్లాక్' గా పోటీచేస్తున్నారు. అందరికీ ఒకే గుర్తు యివ్వబడుతుంది. గుర్తు నామినేషన్లు పరిశీలనానంతరం కేటాయించ బడుతుంది.

పోటీ చేస్తున్న అభ్యర్థులపేర్లు :

మొదటివార్డు జి. నేదు రామిరెడ్డి, రెండవ వార్డు వక్కీ హనుమంతరావు, మూడవ వార్డు పి. గోపాలరావు, ఐదవవార్డు పి. రామకోటయ్య, 11 వ వార్డు యస్. మురళీకృష్ణ (జనరల్) దేవరకొండ వెంకయ్య (షెడ్యూల్ జాతి) 13 వ వార్డు టి. రామన్న (షెడ్యూల్ కులం) 17 వ వార్డు (మహిళా రిజర్వుడు) వి. కామేశ్వరమ్మ, 21 వ వార్డు, సి. ఎ. సుబ్బరామయ్య, 29 వ వార్డునుండి, జనరల్, రిజర్వుడు స్థానాలకు ఎ. అనంతరామయ్య, పాపమ్మ.

ఈ ఎన్నికలలో అభ్యర్థులకు సంబంధించి కమ్యూనిస్టుపార్టీ మార్క్సిస్టు పార్టీలమధ్య ఒప్పందం కుదిరింది, ఎన్నికలయెడ్ల ప్రజలు ఉత్సాహం చూపిస్తున్నారు.

రక్తదాహం తీరని అమెరికా సెనేట్ ఉపసంఘం

వాషింగ్టన్, సెప్టెంబరు 1

ఉత్తర వియత్నాంపై అమెరికా బాంబుదాడులను ఉధృతం చేయాలని, హైఫాంగ్ రేవుపై యింకా తమ మారణకాండను తీవ్రతరం చేయాలని అమెరికా సెనేట్ ఉపసంఘం సిఫార్సు చేసింది.

వియత్నాంపై అమెరికా విమానదాడుల సమాచారంపై సెనేట్ ప్రకటించిన నివేదికలో నిన్న యీ విషయం తెలియచేసింది.

పైగా ఈ మారణకాండను ఉధృతంచేయాలన్న పథకంపై మూడు వారాలుగా మంతనాలు సాగించారట.

ఇజ్రాయిల్ దురాక్రమణ నిర్మూలనకు అరబ్ రాజ్యాల దీక్ష

ఆ ప్రాతిపదికపైననే రాజకీయ పరిష్కారం సాధ్యమని రాజ్యాధినేతల సభ తీర్మానం

కైరో, సెప్టెంబరు

పశ్చిమ ఆసియా సమస్యకు రాజకీయ పరిష్కారమేదైనా సరే అది అరబ్బు భూభాగాలపై ఇజ్రాయిల్ దురాక్రమణను నిర్మూలించేదిగా వుండాలి అని ఖార్టూమ్‌లో జరుగుతున్న అరబ్ రాజ్యాల శిఖరాగ్రసభ నేడు ఏకగ్రీవంగా తీర్మానించింది

ఈ విషయాన్ని కైరో అధికార పత్రిక అల్‌అహ్రాం ప్రకటించింది.

ఇలాంటి ఒప్పందం పాలస్తీనా అరబ్బుల హక్కులను మన్నించేదిగానూ జెరూసలెం నగరాన్ని అరబ్ భూభాగంగా గుర్తించేదిగానూ వుండాలని అసభ తీర్మానించింది.

ఈ మహాసభ జరిపిన సమావేశాల్లో రాజకీయ, సైనిక, ఆర్థిక సమస్యలకు సంబంధించిన మరికొన్ని తీర్మానాలు గూడా ఆమోదించారు.

ఫైజల్ రాజుకు నాజర్ ఆహ్వానం

ఈ మహాసభ సందర్భంలోనే నాజర్, సౌదీ అరేబియారాజు ఫైజల్‌ను కైరో సందర్శించవలసిందిగా ఆహ్వానించారు.

తమ దేశం సందర్శించ వలసిందిగా లెబనాన్ అధ్యక్షుడు చార్లెస్ యిచ్చిన ఆహ్వానాన్ని నాజర్ ఆమోదించారు.

అరబ్ ఇజ్రాయిల్ యుద్ధంలో జరిగిన నష్టాన్ని పూడ్చుకొనేందుకు అరబ్ రిపబ్లిక్, జోర్దాన్ దేశాలకు మిగతా అరబ్ దేశాలు 13½ కోట్ల పౌండ్ల డబ్బు యివ్వాలని అరబ్ శిఖరాగ్రసభ తీర్మానించినట్లు నేడు అధికార రీత్యా ప్రకటించారు.

నూనె పరిశ్రమవల్ల సంపన్న దేశాలైన కువాయిత్, సౌదీ అరేబియా, లిబియాదేశాలు యీ డబ్బుయిస్తాయని మహాసభవర్గాలద్వారా తెలియ వచ్చింది.

ఉథాంట్‌తో యుగోస్లావియా మంత్రి భేటీ

న్యూయార్క్, ఆగస్టు 31

యుగోస్లావియా విదేశాంగమంత్రి నికెజిక్ ఈరోజు ఐ. రా. స. ప్రధాన కార్యదర్శి ఉథాంట్‌ను కలుసుకొని పశ్చిమాసియా పరిస్థితి గురించి ఆయనతో గంటసేపు సంభాషణ జరిపారు. టిటో పంపిన సందేశాన్ని అందచేశారు.

ఉథాంట్‌తోనూ, అంతకు ముందు వాషింగ్టన్‌లో జాన్సన్, డీన్‌రస్కులతోనూ జరిపిన చర్చలు ప్రోత్సాహకరంగా వున్నాయని యుగోస్లావియా విదేశాంగ మంత్రి పత్రికల వారికి చెప్పారు.

అమెరికా అధ్యక్షుడు జాన్సన్‌కు కూడా మార్షల్ టిటో తమ విదేశాంగ మంత్రిద్వారా ఒక సందేశం పంపారు.

ఉథాంట్‌కు పంపిన సందేశం వంటి వాటినే సోవియట్, ఫ్రాన్స్, బ్రిటన్ భారత నాయకులకు టిటో పంపించారు.

ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షులుగా గాడ్గిల్ పదవీ స్వీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1

డా|| డి. ఆర్. గాడ్గిల్ నేడు ప్రణాళికా సంఘ ఉపాధ్యక్ష పదవి స్వీకరించారు. ఇంతవరకూ శ్రీ అశోక్ మెహతా ఈ పదవిలో వున్నారు. పరిపాలనా సంస్కరణ కమిటీ నివేదికను పురస్కరించుకొని యీ రోజునుంచి ప్రణాళికా సంఘాన్ని పునర్వ్యవస్థీకరించారు. గత పార్లమెంటు సమావేశంలో ప్రధాని ఇందిరాగాంధి ఒక ప్రకటనయిస్తూ తెలియచేసిన విషయం పాఠకులకు విదితమే.

శ్రీ గాడ్గిల్ గాక ప్రణాళికా సంఘంలో మరో నలుగురు సభ్యులుంటారు. మద్రాసు మాజీ పరిశ్రమల మంత్రి శ్రీ ఆర్. వెంకటరామన్ నలుగురు సభ్యులలో ఒకరుగా యిది వరకే పదవి స్వీకరించారు. మిగతా ముగ్గురి పేర్లు త్వరలో ప్రకటిస్తారు.

ప్రతిపక్షాల సహేతుక విజ్ఞప్తిని ఖాతరు చెయ్యని ప్రభుత్వం

సెప్టెంబరు 11 న శాసనసభ సమావేశం జరపాలన్న నిర్ణయంపై ప్రతిపక్ష నాయకుల తీవ్ర నిరసన

హైదరాబాద్, సెప్టెంబర్ 1

సెప్టెంబర్ 11న జరిగే రాష్ట్ర శాసనసభ సమావేశాన్ని ఈ నెల 24 వరకూ వాయిదా వెయ్యవలసిందిగా తమ సహేతుకమైన విజ్ఞప్తిని త్రోసిపుచ్చుతూ రాష్ట్ర శాసనసభ సమావేశం ఈ నెల 11ననే జరుగుతుందని ప్రకటించిన ప్రభుత్వ అనాగరిక వైఖరిని తీవ్ర నిరసన తెలియచేస్తూ ప్రతిపక్ష నాయకులు నేడొక ప్రకటన యిచ్చారు.

ఈ ప్రకటన యిచ్చినవారిలో శ్రీయుతులు సి. హెచ్. రాజేశ్వరరావు (యం.యల్.ఎ) వై. వి. కృష్ణారావు (యం. యల్. సి. కమ్యూనిస్టు), శ్రీ సత్య సతాపతి (ఎం.ఎల్.ఎ) వై. వెంకటరావు (డెమొక్రటిక్ ఫ్రంట్) టి. నాగిరెడ్డి [ఎం. ఎల్. ఎ] మార్క్సిస్టు శ్రీమతి జె. ఈశ్వరీబాయి (యం. ఎల్. ఎ.). శ్రీ వి రామారావు (యం. యల్. సి. జనసంఘ్) వున్నారు.

వారు తమ ప్రకటనలో యింకా యిలా అన్నారు.

ప్రభుత్వం అవలంబిస్తున్న యీ వైఖరి ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకం. మున్సిపల్ ఎన్నికలలో ప్రతిపక్ష నాయకులు పాల్గొనకుండా చేయడానికి చేసే రాజకీయ కుట్రయత్నం.

అదనపు భూమిశిస్తు బిల్లు సెలక్టు కమిటీ నివేదికలోని మార్పులను ప్రజలు, శాసన సభ్యులు అధ్యయనం చేయుడానికి అవకాశం కల్పించకుండా పబ్బం గడుపుకోవడానికే ప్రభుత్వం యీ విధంగా చేస్తున్నది.

అతి ప్రాముఖ్యమైన బిల్లును త్వరగా ఆమోదింపచేయుడానికి చేసే ప్రభుత్వ తొందరపాటు చర్యలపట్ల శాసనసభ్యులు ప్రజలు తీవ్ర నిరసన తెలియ చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

సెప్టెంబరు 11 న రాష్ట్ర శాసనసభ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబరు 1

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశం సెప్టెంబర్ 11 న పబ్లిక్ గార్డెన్‌లోని అసెంబ్లీ భవనంలో జరుగుతుందని రాష్ట్రశాసనసభ కార్యదర్శి ఒక ప్రకటన యిస్తూ తెలియజేశారు.

కరీంనగర్

అదనపు భూమిశిస్తు వ్యతిరేక ఆందోళనా సదస్సు

ఈ నెల 5 న కరీంనగర్‌లో

హైదరాబాద్, సెప్టెంబర్ 1

కరీంనగర్ అదనపు భూమిశిస్తు వ్యతిరేకాందోళనా సందర్భంలో జిల్లా అఖిలపక్ష సదస్సు ఈ నెల 5 వ తేదీన ఉదయం 11 గంటలకు కరీంనగర్‌లో జరుగుతుందని జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ సి. చొక్కారావు తెలుపుతున్నారు.

ప్రదేశ్ కమ్యూనిస్టు నాయకులు శాసనమండలి సభ్యులు శ్రీ వై. వి. కృష్ణారావు, యస్. యస్. పి. నాయకులు శ్రీ జొన్నలగడ్డ రామలింగయ్య, శాసనసభ్యులు, శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు ఇతర ప్రముఖులు ఈ సందర్భంలో హాజరవుతారు.

శాస్త్రీయ, ఆర్థిక విషయాలకు పత్రికలలో ప్రాధాన్యత

19 వ అ|| భా|| వార్తా పత్రికల మహాసభను ప్రారంభిస్తూ రాష్ట్రపతి సలహా

హైదరాబాద్, సెప్టెంబరు 1

శాస్త్రీయ, ఆర్థిక విషయాలకు వార్తా పత్రికలు ఇతోధిక ప్రాధాన్యత యివ్వాలని అఖిలభారత వార్తాపత్రికల 19 వ మహాసభను ప్రారంభించుతూ రాష్ట్రపతి డాక్టర్ జకీర్‌హుస్సేన్ ఈ రోజు విజ్ఞప్తి చేశారు

ప్రమాదకర ధోరణులను అరికట్టడానికి, కుటుంబ నియంత్రణ పథకాన్ని జాతీయ ఉద్యమంగా ముందుకు తీసుకు పోవటానికి వార్తా పత్రికలు సాధనాలుగా పని చేయాలని కోరారు.

రానున్న కొలది సంవత్సరాల్లో భారత దేశం తన కాళ్ళపై తను నిలబడగల్గిందిగా రూపొందటానికి పత్రికా సంపాదకులు, తమ పత్రికలద్వారా కృషి చేయాలని అన్నారు.

"మనదేశ వార్తా పత్రికల్లో రాజకీయాలకు ఇంకా ప్రాముఖ్యత వుంటున్నది. కానీ ప్రస్తుత పరిస్థితిలో ఆర్థిక శాస్త్రీయ విషయాలకు ప్రాముఖ్యతను యివ్వాలని నా నమ్మకం" అని చెప్పారు.

వార్తా పత్రికలు మూడు శాతం కంటే తక్కువ పేజీలను ఆర్థిక విషయాలకు యిస్తున్నవనీ, ఇది విచారకర విషయమని అన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధికి ప్రజాభిప్రాయానికి యిస్తున్న ప్రాముఖ్యతతో పోల్చితే ఇది చాలా అల్పమని అన్నారు.

ఇలాంటి మహాసభను జరుపుకొంటున్నందుకు అభినందనలు తెలియజేశారు.

మన దేశంలాంటి ప్రజాస్వామ్యదేశంలో పత్రికారంగం పత్రికా స్వాతంత్ర్యం గ్యారంటీ చేయకపోగా, యితర స్వార్థపర వర్గాల బెదిరింపులకు లోనుగాకుండా చూడటం అత్యవసరం అని ఆయన అన్నారు. [illegible] వాక్స్వాతంత్ర్యానికి భంగకరమని అన్నారు. మూడు మాసాలలో పత్రికా యజమానుల ప్రతినిధులు, సంపాదకులు, విలేకరులు, యితర పాత్రికేయులతో వార్తా పత్రికలకు సంబంధించిన వారితో రాష్ట్ర మహాసభ యేర్పాటు చేయాలని సంకల్పించారని అన్నారు. పత్రికలను సక్రమమైన మార్గంలో నడిపించడానికి వీలుగా ప్రభుత్వానికి యీ మహాసభ సిఫార్సులు చేయగలదని అన్నారు.

పత్రికలు పటిష్టం చేయడానికి, పత్రికలవారి సంక్షేమానికై పని చేయుడానికి ఒక స్థాయీసంఘాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం [illegible] అన్నారు.

[illegible] శ్రీమతి [illegible] అంతకముందు [illegible] దవివారు.

అధ్యక్ష ఉపన్యాసం

"దేశ స్వాతంత్ర్యం ఇప్పుడు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. 20 సంవత్సరాల అనంతర దేశపరిస్థితిని చూస్తే అంతా అల్లకల్లోలంగావున్నది పత్రికలు బాధ్యతాయుతమైన పాత్ర నిర్వహించాలని చెప్పేందుకు మాత్రం వీలులేదు" అని "మిరాప్"

(మిగతా 5వ పేజీలో)

కొండా లక్ష్మణ్ ప్రసంగం

[illegible] శ్రీ కొండా లక్ష్మణ్ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ [illegible]

ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ తోట వెంకటేశ్వర్లు అవినీతి చర్యలు

హైదరాబాద్ సెప్టెంబరు 1

ప్రాధమిక కళాశాలలో మొదటి సంవత్సరం బి యస్. సి తరగతిలో ఒక సీటు యిప్పించడానికి ఒక విద్యార్థినుంచి 300 రూపాయలు డిమాండ్ చేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ తోటవెంకటేశ్వర్లును అవినీతి నిరోధక బ్యూరో అధికారులు నిన్న పట్టుకొన్నారు.

ఐ.పి.సి. 161 సెక్షన్ క్రింద ఆయన్ను అరెస్టుచేసి జామీనుపైన విడుదల చేశారు.

ఈ కళాశాలలో సీటు తెచ్చుకోడంగురించి యీ విధంగా విద్యార్థులు [illegible] వస్తున్నది.

మైసూరులో మద్యనిషేధం రద్దు

బెంగుళూరు ఆగస్టు 31

[illegible] గెజిట్‌లో ప్రకటించ బడింది.

తెలుగు భాషా సంస్థకు పాఠ్యగ్రంథాల ప్రచురణ బాధ్యత

కేంద్రంచే కోటి రూపాయలు మంజూరు

హైదరాబాదు, ఆగస్టు 31

తెలుగులో పాఠ్యగ్రంథాలను రూపొందించే బాధ్యత తెలుగు భాషా సంస్థకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

భారత ప్రభుత్వం తెలుగులో పాఠ్యగ్రంథాల ప్రచురణకి కోటి రూపాయలనిధి మంజూరు చేసింది తెలుగుభాషాసంస్థ కార్యకలాపాలను నిర్వహించటానికి ఒక ప్రత్యేక అధికారి నియామకం జరిగింది. సంస్థను ఒక అద్దె ఇంట్లో ఏర్పాటుచేస్తున్నారు. అయితే సంస్థ పాలకమండలి మాత్రం ఇంకా నియుక్తం కాలేదు.

ఉస్మానియా విశ్వవిద్యాలయ [illegible] ఈ సంస్థను ప్రారంభించే విషయాన్ని గురించి సెప్టెంబరు 2 న విద్యాశాఖ అధికారి ఒకరు చర్చలు జరుపుతారు.

సెప్టెంబరు మొదటివారానికి ఈ పథకానికి ఒక రూపకల్పన చేయటం జరుగుతుంది. ఆ సమయంలో కేంద్ర విద్యామంత్రి హైదరాబాదు వస్తారు.

ఉప రాష్ట్రపతి మైసూరు పర్యటన

బెంగుళూరు, ఆగస్టు 31

ఉపరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి మైసూరులో 9 రోజులు పర్యటించే నిమిత్తం సెప్టెంబరు 2 వ తారీఖు నుండి మైసూరు చేరుకుంటారు.

సెప్టెంబరు 3 నుంచి 1 వరకు బెంగుళూరులో ఉండి వివిధమైన కార్యక్రమాలలో పాల్గొంటారు.

ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ కన్నుమూత

ప్రముఖ సోవియట్ రచయిత

మాస్కో, సెప్టెంబర్ 1

సోవియట్ యూనియన్‌కు చెందిన ప్రముఖ సాహిత్యకారుడు ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ గతమంగళవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు.

ఈ విషయం సోవియట్ రచయితల సంఘం అధికారయుతంగా నేడు ప్రకటించారు.

ఎహ్రెన్‌బర్గ్ వయస్సు 76 సంవత్సరాలు. మాస్కోలో ఆయన కన్నుమూశారు. ఆయనకు భార్య వున్నది.

కేరళ మంత్రుల శాఖల మార్పిడి

తిరువనంతపురం, ఆగస్టు 31

కేరళ ముఖ్యమంత్రి శ్రీ ఇ. యం. యస్. నంబూదిరిపాద్ నిర్వహిస్తున్న [illegible] 'గ్రామ కోర్టుల' శాఖలను [illegible] మంత్రి శ్రీ పి కె కుంజు (యస్. యస్. పి.) ఎం.ఎల్.ఎ. సాంఘిక అభివృద్ధి మంత్రి శ్రీ యం. పి. యం. మొహమ్మద్ కోయా (ముస్లింలీగ్) లకు బదిలీ చేశారు.

ఈ విషయాన్ని నేడిక్కడ అధికార యుతంగా ప్రకటించారు.

బీహార్ ఐక్యసంఘటనప్రభుత్వంపై కాంగ్రెసు అధిష్టానవర్గం కుట్ర

శోషిత్ దళ్‌తో చేతులు కలపవలసిందిగా రాష్ట్ర కాంగ్రెసుకు కామరాజ్ ఆదేశం

పాట్నా, ఆగస్టు 31

ఎస్. ఎస్. పి. నుంచి చీలిపోయి, మాజీ ఆరోగ్య మంత్రి శ్రీ మండల్ ఏర్పాటు చేసిన శోషిత్‌దళ్‌తో కలసి బీహార్‌లో ఐక్య సంఘటన ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నాలు సాగించవలసిందిగా బీహార్ శాసనసభలోని కాంగ్రెస్ పక్ష నాయకుడు శ్రీ మహేశ్ ప్రసాద్ సిన్హాకు కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ్ చెప్పారు.

ఈ విషయాన్ని బీహార్ శాసనసభ కాంగ్రెస్ పార్టీ చీఫ్‌విప్ శ్రీ కేదార్‌పాండే నేటి సాయంత్రం ఇక్కడ పత్రికా విలేకరులతో చెప్పారు.

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు శ్రీ మహేష్ ప్రసాద్ సిన్హా, ఢిల్లీలో కామరాజ్‌తో చర్చలు జరిపిన అనంతరం తనకు టెలిఫోను చేసి ఈ విషయాన్ని తెల్పారని శ్రీ కేదార్‌పాండే తెలియజేశారు.

బీహార్‌లో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ - శోషితదళ్ మిశ్రమ పక్షానికి అనుమతి ఇస్తూ కాంగ్రెస్ అధిష్టానవర్గం తీసుకొన్న నిర్ణయం 'సూత్ర రహిత అవకాశ వాదానికి పరాకాష్ట' అని వ్యాఖ్యానిస్తూ నేటి ఉదయం రెండు గంటలపాటు సమావేశమైన ఐక్య సంఘటన సమన్వయ కమిటీ ఒక పత్రికా ప్రకటన చేసింది.

ఐక్యసంఘటన సమన్వయకమిటీ సమావేశానికి ముఖ్యమంత్రి శ్రీ మహామాయ ప్రసాద్‌సిన్హా అధ్యక్షత వహించారు.

"హాస్యాస్పదంగా ఏర్పాటు చేయబడిన శోషిత్ దళ్‌కు ఒక విధానంగాని, ఒక కార్యక్రమంగాని, నిబంధనావళిగాని లేదు" అని ఐక్య సంఘటన సమన్వయకమిటీ తన పత్రికా ప్రకటనలో తెలియజేసింది.

శోషిత్‌దళ్ ముఖ్యుడుగా చెప్పబడుతున్న శ్రీ మండల్, శాసన సభలోని సభ్యుడుగా ఎన్నిక కాలేదు. ఆరుమాసాలు గడిచినందున ఆయన మంత్రిగా కూడా కొనసాగే హక్కు ఆయనకులేదు. ఇక ఆయనకు ప్రభుత్వాన్ని నిర్వహించగలనని చెప్పే హక్కు, రాజ్యాంగ ప్రతిపత్తి లేదు అని ఆ ప్రకటనలో తెలియజేశారు.

సమావేశానంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ మహామాయప్రసాద్‌సిన్హా పత్రికా విలేకరులతో మాట్లాడుతూ శాసనసభలో తనకు పూర్తి మెజారిటీ కలదని, ఏ సవాలునైనా ఎదుర్కోటానికి సంసిద్ధంగా వున్నానని అన్నారు.

'కుట్రను మొగ్గలోనే త్రుంచి వేసేందుకు, ప్రజాస్వామిక సూత్రాలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, కాంగ్రెస్ లోని అభ్యుదయ భావాలుగలవారు ఐక్య సంఘటన ప్రభుత్వానికి అండగా నిలబడాలని ఐక్యసంఘటన సమన్వయ కమిటీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

ఐక్య సంఘటన ప్రభుత్వం [illegible]

(మిగతా 5 వ పేజీలో)

విశాలాంధ్ర

అశోక్ మెహతా పథకానికి చెంపపెట్టు

కువాయిట్ నుంచి దిగుమతి చేసుకున్న అమోనియా ద్రవం వినియోగించే ఎరువుల కర్మాగార నిర్మాణానికి అనుమతించాలన్న అశోకమెహతా పథకాన్ని కేంద్ర మంత్రివర్గం నిరాకరించినట్లు ఢిల్లీ వార్తలు తెలుపుతున్నాయి దీనితో మన దేశంలో కెమికల్ ఎరువుల పరిశ్రమను ఎలా అభివృద్ధి చేయాలన్న సమస్యపై జరుగుతున్న తర్జన భర్జనలు ముగిసినట్లేనని కూడ చెప్పబడుతున్నది

వ్యవసాయ ఉత్పత్తులు పెరగాలన్నా. ఆహార ధాన్యాలలో స్వయం సమృద్ధిని సాధించుకోవాలన్నా శాస్త్రీయపద్ధతులను అనుసరించడమూ. కెమికల్ ఎరువులను విరివిగా వాడటమూ తప్పనిసరవుతుంది. అందుచేత కెమికల్ ఎరువుల పరిశ్రమను త్వరితగతిని అభివృద్ధిచేయడం అత్యంతావశ్యకమనడంలో సందేహంలేదు.

ఐతే ఈ చిక్కును ఆధారంగా చేసుకొని, అమెరికన్ గుత్త వ్యాపారులు, కెమికల్ ఎరువుల పరిశ్రమాధిపతులు భారతప్రభుత్వంపై అనేక ఒత్తిడిలు తెస్తున్నారు ఏడాదికి 10 లక్షలటన్నుల ఎరువులను ఉత్పత్తిచేసే ఐదారు ఫ్యాక్టరీలను నిర్మించేందుకు అమెరికన్ కెమికల్ కంపెనీల సమాఖ్యతో ఒప్పందం చేసుకోవలసిందిగా ప్రపంచబ్యాంకు సలహాదార్లు 1965 లోనే సిఫార్సు చేశారు పశ్చిమాసియాలో అమెరికన్ కంపెనీలు వుత్పత్తి చేసే అమ్మోనియాద్రవం దిగుమతులపై ఆధారపడేందుకుఅంగీకరిస్తేచౌకగా కెమికల్ ఎరువులను తయారుచేసే కర్మాగారాలను నిర్మించి పెడతామని బెక్‌టెల్ కంపెనీ బేరాలు సాగించింది.

కాని "లిక్విడ్ అమ్మోనియా" దిగుమతులపై ఆధారపడే ఎరువుల పరిశ్రమను నిర్మించుకోవడం మన దేశ ప్రయోజనాలకు అనుగుణం కాదు. భారత దేశ చమురు పెట్రోలియం పరిశ్రమలో వృథాగా మిగిలిపోతున్న మడ్డిని (నఫ్తాను) వినియోగించే ఎరువుల కర్మాగారాలను నిర్మించుకోవడం వల్ల మనకు ఉభయతా లాభసాటిగా వుంటుంది భారతప్రభుత్వ ఎరువుల కార్పొరేషన్ సాంకేతిక నిపుణులు ఈ విషయాన్ని ఏనాడో స్పష్టపరచారు పెట్రోలియం కెమికల్స్ మంత్రిత్వశాఖ కూడ అపుడదే అభిప్రాయాన్ని వ్యక్తపరచింది. అందుచేతనే బెక్‌టల్ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం లోగడ నిరాకరించింది

ఐతే అమెరికా గుత్తవ్యాపారులతో సంప్రదింపులు విఫలమవడం అప్పట్లో ప్లానింగ్ మంత్రిగావున్న శ్రీ అశోక మెహతాకు కంటగింపుగా తయారయింది అమెరికన్ల ఒత్తిడులకు తలవొంచి రూపాయి మారకం విలువను తగ్గించిన ఈ ప్రబుద్ధుడే ఎన్నికలనంతరం పెట్రోలియం కెమికల్స్ మంత్రిగా కూడ నియమితుడయ్యాడు తదనంతరం లిక్విడ్ అమోనియా దిగుమతులకు దొడ్డిదారిని అనుమతిని సంపాదించేందుకు అశోక్ మెహతా ప్రయత్నాలుసాగించాడు.

కువాయట్ కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ కంపెనితో బొంబాయిలోని ధర్మసీ ఫెర్టిలైజర్ కంపెనీ భారతదేశంలో ఎరువుల కర్మాగారాన్ని నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నదట. కువాయట్ కంపెనీలో అమెరికన్ గుత్త వ్యాపారులు భాగస్వాములుగా వున్నందున పరోక్షంగా యిది వాటితో ఒప్పందంగానే పరిగణించాలసి వుంటుంది పదేళ్లపాటు ముందుగానే నిర్ణయించిన ధర ప్రకారం లిక్విడ్ అమోనియాను దిగుమతి చేసుకుంటే ప్రతి ఏటా 20 లక్షల టన్నుల గంధకాన్ని కూడ కువాయట్-కంపెనీ సప్లయి చేస్తుందట గంధకం ప్రపంచ మార్కెటులో సులభంగా లభ్యం కావడం లేదు కాబట్టి. ఎరువుల పరిశ్రమకు అతి ముఖ్యం కాబట్టి ఈ ప్రతిపాదనను ఆమోదించాలని ప్రస్తుత పెట్రోలియం అండ్ కెమికల్స్ మంత్రిత్వశాఖ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

ఎరువుల కార్పొరేషన్ సాంకేతిక నిపుణుల సలహాను తోసిరాజని, ఈవిధంగా అమోనియా ద్రవం దిగుమతులపై ఆధారపడే ఎరువుల కర్మాగార నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం చేత ఒప్పించాలని పెట్రోలియం మంత్రి అశోకమెహతా తాపత్రయపడ్డాడు. భారత దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించే దౌర్భాగ్యస్థితికి అశోకమెహతా దిగజారాడు.

అమోనియా ద్రవం దిగుమతులపై ఆధారపడే ఎరువుల కర్మాగార నిర్మాణాన్ని కేంద్ర మంత్రివర్గం వ్యతిరేకించుటేగాక, పెట్రోలియం సరకుల ధరలు తగ్గుముఖం పడుతున్న సమయంలో పదేళ్ళవరకు యిపుడే ధర నిర్ణయించడాన్నికూడా ఆక్షేపించినట్లు తెలుస్తూంది గంధకం దిగుమతులకు వేరుమార్గాలను అన్వేషించాలని సూచించింది. ఈ విధంగా అశోక మెహతా తలపెట్టిన కుంభకోణం భగ్నమైనందుకు దేశశ్రేయస్సు కోరేవారందరూ హర్షించుతారు

ఐతేయింతటితో కేంద్రప్రభుత్వ బాధ్యత తీరలేదు అదివరకే నిర్ణయించిన విధానానికి విరుద్ధంగా "లిక్విడ్ అమోనియా" దిగుమతులపై ఆధారపడే కర్మాగార నిర్మాణానికి పెట్రోలియం మంత్రి స్వయంగా ఆమోదించడం క్షమించరాని నేరంగా ఎంచవలసివుంటుంది ఘోరమైన ఈ తప్పిదానికి అశోక మెహతాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయడం అవసరం

దేశంలో ఉన్న వనరులతోనే రెండు రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీలను నిర్మించవచ్చునని ఇదివరకే భారతీయ ఎరువుల కార్పొరేషన్ సూచించి ఉంది ఆ ప్రతిపాదనను ప్రభుత్వం లోగడ త్రోసిపుచ్చింది ప్రభుత్వం ఇప్పుడైనా ఆ ప్రతిపాదనను అంగీకరించి రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీల అభివృద్ధికి తోడ్పడుతుందా?

ఇండొనేషియాలో మరో మూడు బ్యాంకుల మూత

జకార్తా, ఆగస్టు 31

జకార్తాలోని మరో మూడు ప్రైవేటు బ్యాంకుల్ని మూసివేస్తూ ఇండొనేషియా సెంట్రల్ బ్యాంక్ ఈ రోజు ఉత్తర్వులు యిచ్చింది. దీనితో ఇండొనేషియాలో మూతబడిన బ్యాంకులసంఖ్య 118 చేరింది.

విదేశీ ద్రవ్యమారకం కొనుక్కునే ఖాతాదార్లకు పెద్దఎత్తున ఈ బ్యాంకులు బకాయిలు యిస్తున్నందున ఈ వుత్తర్వులు జారీ చేయవలసి వచ్చిందని సెంట్రల్‌బ్యాంక్ అధికారులు అన్నారు.

బ్యాంకులు మూసివేయటంతో ఇండొనేషియా ప్రజలలో భయాందోళనలు మొదలయ్యాయి, గత రెండురోజులుగా ధరలు అపారంగా పెరుగుతున్నాయి

మూసివేయబడిన బ్యాంకుల ప్రతినిధులకు - సెంట్రల్ బ్యాంక్ అధికారులకు మధ్య నిన్న, ఈరోజు చర్చలు జరుగుతున్నాయి.

'క్రియాశీలమైన విప్లవపార్టీని రూపొందించేందుకు కృషిచేయండి'

రాష్ట్రంలో పార్టీ మహాసభల కార్యక్రమాన్ని నిర్ణయిస్తూ ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి ఆదేశం

1968 ఫిబ్రవరి మొదటి వారంలో కమ్యూనిస్టుపార్టీ 8 వ మహాసభ బీహార్‌లో జరుగుతుంది కనుక రాష్ట్రంలో శాఖా సమావేశాలు అక్టోబర్ 15 లోగాను, పట్టణ తాలూకా మహాసభలు నవంబర్ 20 వ తేదీ లోగాను, జిల్లా మహాసభలు డిసెంబరు నెలలోనూ పూర్తిచేయాలని హైదరాబాద్‌లో ఆగస్టు 17-21 తేదీలలో జరిగిన ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి తీర్మానించింది ప్రదేశ్ మహాసభ జనవరి మూడవ వారంలో జరగవలెనని కూడా నిర్ణయించింది.

ఈదఫా జరిగే మహాసభలలో పార్టీ కార్యకలాపాలనూ, నిర్మాణాన్ని శక్తివంతం చేయటం మీద కేంద్రీకరించాలన్నీ. పార్టీలో ప్రవేశించినని స్తబ్ధతను తొలగించి క్రియాశీలమైన విప్లవపార్టీగా మనపార్టీని రూపొందించటానికి పూనుకోవాలనిప్రదేశ్‌సమితి ఆదేశించింది

ఈ సమస్యపై ప్రదేశ్ సమితి ఆమోదించిన తీర్మానం పూర్తి పాఠం దిగువ ప్రచురిస్తున్నాము

1968 ఫిబ్రవరి మొదటివారంలో 8 వ, పార్టీ మహాసభ బీహారులో జరుగుతుంది. ఈ లోపుగానే ప్రదేశ్ మహాసభ జరిగేటట్లుగా క్రింది మహాసభలు జరుపుటకు కార్యక్రమం వేసుకోవాలి.

1. శాఖా సమావేశాలు జరిపి, కార్యదర్శుల ఎన్నిక, అవసరమైన చోట కమిటీల ఎన్నిక అక్టోబరు 15 వ తేదీలోగా పూర్తి చెయ్యాలి.

(అ) ఈ సమావేశాలు మామూలుగా జరిగే వాటివలె కాక, మహాసభల వలె జరపాలి. అంటే గత పార్టీ మహాసభ కాలంనుండి నేటి వరకూ జరిగిన పార్టీ కార్యకలాపాలను సమీక్ష చేసుకోవటం, ప్రజల్లో ముఖ్యంగా కార్మికులు, వ్యవసాయ కార్మికులలో పార్టీ మరింత చొచ్చుకు పోవటానికి కావలసిన కార్యక్రమాలు వంటివి ఆ సమావేశాలలో చర్చనీయాంశాలుగా వుండాలి. పార్టీ పత్రిక వ్యాప్తికొరకు కార్యక్రమం వేసుకోవాలి. శాఖను సజీవంగా నడుపుటకు అవసరమైన నిర్ణయాలుచేయాలి. కార్యదర్శిని. అవసరమైతే సహాయ కార్యదర్శిని ఎన్నుకోవాలి. శాఖలో సభ్యుల సంఖ్య 25 కు మించితే 7 మందికి మించని కమిటీని కూడా ఎన్నుకోవాలి.

(ఆ) తాలూకా కమిటీలు వెంటనే సమావేశమై శాఖా సమావేశాలు జరుపుటకు ప్లాను వేసుకోవాలి. ప్రతి శాఖా సమావేశానికి ఒక తాలూకా కమిటీ సభ్యుడు తప్పక హాజరు కావాలి. తాలూకా కమిటీలు పని చేయకుండా వున్నచోట పై పని నెరవేర్చుటకు ఆ తాలూకా కార్యకర్తలను జిల్లా కమిటీలు నియమించాలి.

2. తాలూకా, పట్టణ మహాసభలు అక్టోబరు మొదటి వారంలో ప్రారంభం కావాలి. నవంబరు 20 వ తేదీ లోపల పూర్తికావాలి. (నవంబరు ఆఖరులో జరిగే జాతీయ సమితి సమావేశం లోపల పూర్తి కావాలి.) ఈ మహా సభలముందే శాఖా సమావేశాలు తప్పని సరిగా పూర్తి కావాలి.

(అ) మూడు వందలకన్న తక్కువ సభ్యులున్న తాలూకా పట్టణాలలో సర్వసభ్య సమావేశాలుగానే వీటిని జరుపవచ్చును. అంతకన్నా ఎక్కువ సభ్యత్వమున్న చోట 5 వందల వరకూ ఇద్దరికి ఒక ప్రతినిధిని చొప్పున, 500 లకు మించివున్న చోట ముగ్గురికి ఒకరి చొప్పున ఎన్నుకొని ప్రతినిధుల సభ జరపాలి,

(ఆ) ఆయా తాలూకా, పట్టణాలలో గత కాన్ఫరెన్సు తరువాత జరిగిన పార్టీ కార్యకలాపాల వ్రాత సమీక్షను ఆయా కమిటీలు ప్రవేశపెట్టాలి. కేవలం ఓరల్ (నోటిమాట) రిపోర్టు పనికిరాదు. రిపోర్టు తప్పనిసరిగా వ్రాతలో ఉండవలెను. కార్యదర్శి నివేదికగా కాక, కమిటీ ఉమ్మడి నివేదిక అయి ఉండవలెను. అంటేకమిటీ ఆ నివేదికను చర్చించి, ఆమోదించిన తర్వాతనే మహాసభ ప్రవేశించాలి. లేకపోతే కమిటి సభ్యులే రిపోర్టు మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేయడం జరుగుతుంది. ఏ విషయంతేల్చక. కాన్ఫరెన్సుఅసంపూర్తిగా ముగుస్తుంది. ఆ రిపోర్టులో పార్టీ నిర్మాణ పరిస్థితిని, ఆ ప్రదేశంలోని ప్రధానప్రజా సమస్యలను, రాజకీయ పరిస్థితులను కూడా పేర్కొనాలి. ఈ మహా సభలలో చర్చలు ప్రధానంగా రిపోర్టు ఆధారంగానే జరగాలి. యీ రిపోర్టులలో వివిధ రంగాలలో పార్టీ సాధించిన కార్యకలాపాలు పేర్కొనాలి. పార్టీ జరిపిన రాజకీయాందోళనా ప్రచార కార్యక్రమాలు చెప్పాలి. ఆతాలూకా, పట్టణాలలో ఉన్న ప్రజాసంఘాలు, వాటి సభ్యత్వం, ఆసంఘాలద్వారా జరిగిన పనులు తెలియజేయాలి. పార్టీ నిర్మాణ స్థితి గతులు ఆ రిపోర్టులో ఉండాలి. సభ్యత్వం, శాఖలు, అవి పనిచేస్తున్నాయా లేదా, సభ్యులలో శ్రమజీవుల శాతం వగైరా వివరాలు వుండాలి. సభ్యులకు రాజకీయ శిక్షణకొరకు జరిగిన కృషి, 'విశాలాంధ్ర' పత్రిక సర్క్యులేషను, దాన్ని పెంచుటకు పార్టీ సాహిత్యం అమ్ముటకు జరిపిన కృషి, తాలూకా కమిటీలు పనిచేసినతీరు, ఎన్నుకోబడిన తరువాత జరిగిన సమావేశాల సంఖ్య కమిటీ సభ్యులంతా హాజరగుచున్నారా, లేదా, నిర్ణయాలు అమలుజరుగుచున్నవా లేదా, ఆ ప్రదేశం ప్రజలెదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటి ఎడల మనవైఖరి, ఇతర రాజకీయ పార్టీలు వాటి కార్యకలాపాలు, ఐక్య ప్రజాతంత్ర ఉద్యమానికి మనం చేసిన కృషి, ఇంకా చేయవలసినది, పార్టీ నిర్మాణంలో క్రమశిక్షణ, చురుకుదనం ప్రవేశపెట్టుటకు అవసరమైనమార్పులు, కాడర్లు వారి సంరక్షణ, తర్ఫీదు, ప్రమోషనువంటి విషయాలు ఆ నివేదికలో ఉండాలి. ఏ ఒక్కరో ఆఖరునిముషంలో వ్రాసి ముక్కు తీర్చుకున్నట్లుగాక, మొత్తం కమిటీ చర్చించి ఉమ్మడిగానే రూపొందించాలి. కాన్ఫరెన్సులో కమిటీ రిపోర్టుగానే ప్రవేశపెట్టాలి. పార్టీ కార్యక్రమాలు మరింత చురుకుగా సాగించటం పార్టీకి శ్రమజీవులతో సంబంధాలు పెంచటం, చర్చల ప్రధాన లక్ష్యాలై ఉండాలి. తాలూకా మహాసభలలో వ్యవసాయ కార్మిక వర్గంలో పార్టీ నిర్వర్తించవలసిన కర్తవ్యంమీద ప్రత్యేకశ్రద్ధతో చర్చించాలి. కార్మికోద్యమాన్ని ఆర్థిక తత్వంనుండి మరలించి, కార్మికులలో రాజకీయ చైతన్యం కలిగించటం, పట్టణ మహాసభలలో ప్రత్యేక శ్రద్ధతో చర్చించాలి.

తాలూకా పట్టణమహాసభలు రెండురోజులు జరగవలెను.

(ఇ) ప్రతి తాలూకా పట్టణ మహాసభకు జిల్లా కార్యవర్గ సభ్యులు కనీసం ఒక్కరైనా హాజరై రాజకీయ రిపోర్టు ఇవ్వాలి. పెద్ద తాలూకా, పట్టణ మహాసభలకు జిల్లా కార్యదర్శులే హాజరు కావటం మంచిది. తాలూకా, పట్టణమహాసభలకు ప్రదేశ్ సెక్రటేరియట్ సభ్యులు హాజరు కావటం అసంభవం. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 120 తాలూకా యూనిట్లున్నాయి.

(ఈ) మహాసభలు తాలూకా, పట్టణ సమితిని, జిల్లా మహాసభలకు ప్రతినిధులను ఎన్నుకుంటాయి, ఎంత మంది ప్రతినిధులకు ఎంత మందిని ఎన్నుకోవలెనో ఆయా జిల్లా కార్యవర్గాలు నిర్ణయించాలి. చర్చలు ప్రయోజనకరంగా, తగుస్థాయిలో ఉండాలంటే ప్రతినిధుల సంఖ్య రెండు వందలకు తగ్గకుండా మూడు వందలకు మించకుండా ఉంటే బాగుంటుంది.

(ఉ) తాలూకా పట్టణ మహాసభల సందర్భంలో తప్పని సరిగా ప్రజా సమీకరణ చేసి బహిరంగ సభలు జరపాలి. పార్టీ పాలసీని వివరించాలి.

3. జిల్లా మహాసభలు డిశంబరు నెలలో పూర్తిచేయాలి. యీ మహాసభలు ప్రధానంగా చర్చించ వలసిన డాక్యుమెంట్లు మూడు.

(అ) ఆ జిల్లాలోని వివిధ ప్రజారంగాలలోనూ, రాజకీయాలలోనూ, పార్టీ కార్యకలాపాలు - గత కాన్ఫరెన్సు నుండి.

(ఆ) జిల్లాలలో నేటి ఆర్థిక రాజకీయ పరిస్థితి, వివిధ రంగాలలో మన కర్తవ్యాలు యీ సందర్భంగా వ్యవసాయ కార్మిక రంగంలో మన కర్తవ్యాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఇవ్వాలి.

(ఇ) పార్టీ నిర్మాణ పరిస్థితి ; యీ రిపోర్టు రచన, చర్చలు కూడా పార్టీని పునర్జీవింప చేయటానికి, అన్యవర్గ ధోరణులను కడిగివేసి, మిలిటెంటు పార్టీగా రూపొందటానికి తోడ్పడాలి. పార్టీ పత్రిక ఎడల మన బాధ్యత కూడా యీ సందర్భంలోనే చర్చించ బడాలి.

యీ డాక్యుమెంట్లను తయారు చేయుటకు జిల్లా సమితులు పూనుకోవాలి.

జిల్లా మహాసభలు జిల్లా సమితులను ఎన్నుకుంటాయి, ప్రదేశ్ మహాసభకు ప్రతినిధులను 50 మంది సభ్యులకు ఒకరు చొప్పున ఎన్నుకోవాలి. జిల్లా సమితి సభ్యుల సంఖ్యను జిల్లా మహాసభలే నిర్ణయించాలి. గతంలో కొన్ని జిల్లాలలో సమితులు మరీ పెద్దవైనవి. హాజరుకాని సభ్యుల సంఖ్య మరీ ఎక్కువగా వుంది. ఆసమితుల పనికి చాలా ఇబ్బంది కలిగించింది. యీ పరిస్థితి పునరావృతం కాకూడదు. రెండువేల సభ్యులకంటే తక్కువవున్న జిల్లాలలో సమితి సభ్యత్వం 50 కి మించరాదని మా సూచన. రెండువేల కన్నా ఎక్కువ సభ్యులున్న జిల్లాల్లో కూడా 60 కి మించడం ఉపయోగకరం కాదు. జిల్లా, తాలూకా సమితులు ఒక కార్యదర్శిని, ఒక సహాయ కార్యదర్శిని ఎన్నుకోవలెను. పార్టీ నిర్మాణ బాధ్యతలను ప్రత్యేకముగా నిర్వహించుటకు సహాయ కార్యదర్శి అవసరం.

4. పార్టీ మహా సభలు కేవలం లాంఛన ప్రాయంగా జరిపే తంతులాగా ఉండకూడదు. పార్టీ కార్యక్రమాలను సమీక్షించి, భవిష్యత్తుకు మార్గం చూపేవిగా ఉండాలి. మొత్తం పార్టీకి, ప్రజలకు ఉత్తేజం కలిగించేవిగా ఉండాలి. పార్టీ నిర్మాణం పటిష్టం చేసేవిగా ఉండాలి. పార్టీ ఏడవ మహాసభలో కార్యక్రమం రూపొందించబడింది. సిద్ధాంత సమస్యల మీద నిర్ణయాలు చేయబడినాయి. రాజకీయ విధానం మీద కూడా మునుపెన్నడూ లేనంత ఏకీభావం పార్టీలో నేడున్నది. గత మూడేండ్ల చరిత్ర స్థూలంగా 7 వ మహాసభ నిర్ణయాలను ధృవ పరిచింది.

అందుచేత యీదఫా జరిగే పార్టీ మహా సభలలో ప్రాథమిక (బేసిక్) విషయాల మీద కన్నా పార్టీ కార్యకలాపాలనూ, పార్టీ నిర్మాణాన్ని శక్తివంతంచేయటం మీద కేంద్రీకరించవలసి వుంటుంది. పార్టీలో ఉన్న స్తబ్ధతను తొలగించటానికి, క్రియాశీలమైన విప్లవ పార్టీగా మన పార్టీని రూపొందించటానికి, యీ సంవత్సరం మహాసభలు పూనుకోవాలి.

అన్ని స్థాయిల్లోనూ నూతన కమిటీలనూ, సమితులను, కార్యదర్శులనూ ఎన్నుకొనునపుడు, ప్రతివ్యక్తినీ సరైన మార్క్సిస్టు కొలబద్దతోనే కొలవాలి. ప్రతి వ్యక్తినీ అతని కార్యాచరణను బట్టి అంచనా వెయ్యాలి. నిత్యమూ ప్రజలతో సంబంధం ఉండేవారూ, ఉత్సాహంగా తాము కదలి యితరులను కదిలించేవారు, కార్యక్రమాలను పట్టుదలతో సాధించే క్రియాశీలురూ, స్వప్రయోజనంకంటే పార్టీ ప్రయోజనాన్ని మిన్నగా చూసేవారు ఎన్నుకోబడాలి. విప్లవోత్సాహం చచ్చి కదలనివారు, పట్టుదల లేనివారు, స్వార్థపరులూ పనికిరారు. విద్య, ఉపన్యాస ధోరణి, పాత చరిత్ర వంటివి చాలా వాంఛనీయమైన గుణాలు. కాని ఇవి మాత్రమేచూసి క్రియాశీలురు కానివారిని, కదలి పనిచెయ్యనివారిని ఎన్నుకోకూడదు. కమ్యూనిస్టుపార్టీ క్రియాశీలమైన పార్టీ. క్రియాశీలురే దీనికితగువైన నాయకులు.

శాఖా స్థాయినుండి పై గిటురాయి ఆధారంతో సరైన కార్యకర్తలు ఎన్నుకోబడితేనే పార్టీ శక్తివంతమైనదిగా రూపొందుతుంది.

ప్రదేశ్ పార్టీ మహాసభ

అఖిలభారత పార్టీమహాసభ ఫిబ్రవరిలో జరుగనున్నది. కావున మన ప్రదేశ్ మహాసభ జనవరి మూడవ వారంలో జరుపవలెను. మహాసభలో చర్చించవలసిన డాక్యుమెంట్లను తయారుచేయుటకు ఇప్పటినుండి పూనుకోవలెను. ఆ డాక్యుమెంట్లు ప్రదేశ్‌సమితి ఉమ్మడి కృషితోనే రూపొందించవలెను. గతంలోవలే ఏ నలుగురైదుగురికో అప్పగించి, ఆఖరుక్షణంలో హడావుడిగా తయారు చేయరాదు. మొత్తం సమితి యొక్క ఉమ్మడి అనుభవం, కృషి పొందుపరచిన రూపంలో డాక్యుమెంట్లువస్తే మహాసభలో చర్చలు చాలా లాభదాయకంగా ఉంటాయి ఆ డాక్యుమెంట్లకు మహాసభ తుదిరూపం ఇవ్వగలుగుతుంది.

యీ మహాసభలో చర్చించవలసినవిగా మూడు డాక్యుమెంట్లను కేంద్ర కార్యవర్గం సూచించింది.

1. గత మహాసభ తరువాత పార్టీరాజకీయరంగంలోనూ, ఇతర ప్రజారంగాలలోనూ సాగించిన కార్యకలాపాల నివేదిక, వివిధ ప్రజారంగాలలో కర్తవ్యాలు.

2. మన రాష్ట్రంలోని ఆర్థిక, రాజకీయ పరిస్థితి, మన రాజకీయ కర్తవ్యాలు.

.3. పార్టీ నిర్మాణ పరిస్థితి-కర్తవ్యాలు

పై మూడు డాక్యుమెంట్లను తయారు చేయుటకు యీ సమితి సమావేశంలోనే మూడు కమిటీలను నియమించింది.

మొదటి రిపోర్టు తయారు చేయుటకు కమిటీ

1. జి. ఎల్లమందారెడ్డి (కన్వీనరు)
2. వై. వి. కృష్ణారావు.
3. జోస్యభట్ల సత్యనారాయణ
4. యన్. సత్యనారాయణరెడ్డి
5. జి. వి. నారాయణ
6. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు
7. సుధాకరరెడ్డి
8. ఆరుట్ల కమలాదేవి

రెండవ కమిటీ

1. రాజబహదూర్ గౌర్ (కన్వీనర్)
2. మొహిత్ సేన్
3. వేములపల్లి శ్రీ కృష్ణ
4. జి. ఎల్లమందారెడ్డి
5. వై. వి. కృష్ణారావు
6. నీలం రాజశేఖర్‌రెడ్డి

మూడవ కమిటీ (పార్టీ నిర్మాణం)

1. రాజశేఖర్‌రెడ్డి (కన్వీనర్)
2. నల్లమల గిరిప్రసాదరావు
3. దాసరి నాగభూషణ రావు
4. వి.కె. ఆదినారాయణరెడ్డి
5. ఎ. వెంకట రామరాజు
6. యం. వి. యస్. కపర్ది
7. ఆరుట్ల రామచంద్రా రెడ్డి

పై కమిటీలు మూడూ త్వరలోనే సమావేశమై పని ప్రారంభం చేయాలి. వీరి ముసాయిదాలను చర్చించి తుదిరూప మిచ్చుటకు ప్రదేశ్ సమితి జనవరి మొదటి వారంలో సమావేశంకావలెను. సమితి ముసాయిదా తీర్మానాలుగా వీటిని ప్రతినిధులకు పది రోజులు ముందుగా పంపవలెను.

మహాసభకు ప్రతినిధులను 50 మంది సభ్యులకు ఒకరు చొప్పున ఎన్నుకోవాలి. మహాసభ ఆరురోజులు జరుగవలెను.

పార్టీలో చురుకుదనం, క్రమశిక్షణా ఉన్నతస్థాయికి పెంచి, పార్టీ నిర్మాణాన్ని పటిష్టంచేసి, మిలిటెంటు విప్లవపార్టీగా రూపొందించుట యీ మహాసభ ప్రధానలక్ష్యంగా ఉండవలెను.

అతిథుల కంట్రోల్!!

విందులలో వడ్డించే పదార్థాలను, వచ్చే అతిథుల సంఖ్యను కంట్రోల్ చేసే ప్రభుత్వ ఉత్తరువును సవరించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది ఇంతవరకు ప్రభుత్వ ఉత్తరువు అమలు కావడం లేదనీ ఉల్లంఘనే హెచ్చుగా జరుగుతోందని ప్రభుత్వమే మరో వైపున అంగీకరించుతున్నది ప్రస్తుతమున్న "తీవ్ర ఆహార కొరత" దృష్ట్యా యిక ముందయినా మంత్రులు ఉన్నతాధికారులు ప్రభుత్వ వుత్తర్వును పాటించాలని కేంద్ర మంత్రివర్గం కోరింది

విందులకు వచ్చే అతిథుల సంఖ్య 25 మందికి మించరాదట వడ్డించే వాటిలో తృణధాన్యాలతో చేసిన పదార్థాల ప్లేటులు మాంసాహార పదార్థాల ప్లేటులు ఒకటికి మించివుండరాదట ఇలాంటివే మరెన్నో పరిమితులు, మినహాయింపులు. ప్రభుత్వ ఉత్తరువులో వున్నాయి అందులో వుదహరించిన విభిన్నమైన పిండివంటలు. పానీయాలు వగైరా పేర్లు సైతం సామాన్యపౌరులకు తెలియనే తెలియవు

గతంలో ప్రభుత్వ ఉత్తరువును మంత్రులూ, ఉన్నతాధికారులు ఎన్నడూ ఖాతరు చేయలేదు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాధినేతలుగా వుంటున్న వారే వందలకొలది అతిథులతో అనేక భోజ్య పానీయాలతో విందులుచేస్తున్నారు భాగ్యవంతులు చేస్తున్న ఆడంబరాలకు విందులకు హాజరౌతున్నారు

ఈ మధ్య హైదరాబాద్‌లో మంత్రివర్యులు హాజరైన విందులో శాకాహార పదార్థాలు ఎన్నివున్నా, "మాంసాహార డిష్" లేనందుకు "వృథా ప్రయాస" అని మంత్రివర్యులే రిమార్కుచేశారట కొన్ని పత్రికలు ఆ సంగతినికూడ విందు విశేషంగా ప్రకటించాయి

ఇలాంటి అమలు జరగని ఉత్తరువుల వల్ల, వాటిని సవరించడంవల్ల ప్రభుత్వం నవ్వుల పాలౌతుందే గాని పరువు పెరగదు హుకుంలను జారీచేసేవారూ. ఉల్లంఘించేవారూ పరస్పరం తాదాత్మ్యం చెందుతున్నపుడు నిరోధించగలవారెవరు?

వియత్నాంలో అమెరికా గెలుపు కల్ల

వీర వియత్నాం ప్రజల 22 ఏండ్ల సమర చరిత్ర

జాతీయ స్వాతంత్ర్య పరిరక్షణకై, సామ్రాజ్యవాదుల వారి కీలు బొమ్మల అమానుష సైనికబలగాలను ఎదిరించి, వాసృష్టించినమారణయుద్ధాగ్నికి వారినే శలభాలను చేస్తున్న వీర వియత్నాం ప్రజానీకానికి జేజేలర్పిస్తూ, ఆదేశ స్వాతంత్ర్య దినోత్సవమైన సెప్టెంబరు 2 సందర్భంగా ఈవ్యాసం ప్రకటిస్తున్నాం.

సెప్టెంబరు 2 చిరస్మరణీయమైన దినం. వేడుకలు జరుపుకో వలసినదినం. స్వేచ్ఛా స్వాతంత్ర్యం కొరకు పోరాడుతున్న పీడిత ప్రజల చరిత్ర పుటలలో ఈ తేదీ ఎల్లప్పుడూ గౌరవించ బడుతుంది. ప్రేమించ బడుతుంది.

సువిశాలమైన ఆసియాఖండంలో ఆగ్నేయ భాగాన 3 కోట్ల 80 లక్షల ప్రజానీకంగల ఒక చిన్నదేశం. 22సంవత్సరాల క్రితంఇదే తేదీన వలసప్రభుత్వంబలాలనుండి విముక్తిచెంది స్వాతంత్ర్యాన్ని సముపార్జించు కున్నది. అదే వియత్నాం

వియత్నాం వేయి సంవత్సరాల క్రితం 938 సం॥లో చైనీస్ భూస్వామ్య సామ్రాజ్య వాద పాలనసుండి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నది. ఈ స్వాతంత్ర్య సాధనకు వేయి సంవత్సరాలపాటు నిర్విరామ పోరాటం సాగించిన వియత్నాం వీరప్రజ. 19 వ శతాబ్దం మధ్యకాలంలో ఫ్రెంచి పాలకులు బలవంతాన రుద్దిన వలసపాలనను సహించడం కానీ, దానికి లొంగడంకానీ జరగలేదు.

1905లో రష్యన్ జారిస్టులపై జపాన్ విజయం సాధించడంతోనూ, 1917 నవంబరు రష్యన్ సాయుధవిప్లవంతోనూ ప్రభావితు లయిన వియత్నాం దేశభక్తుడు ఎన్‌గుయెన్ అయి క్వోక్-(తదుపరిఅనుసేహోచిమిన్‌గా గణుతికెక్కారు) నాయకత్వం క్రింద స్వేచ్ఛా స్వాతంత్ర్యసముపార్జనకు సాహసోపేతంగా పోరాటంనడిపారు ఈపోరాటంలోవారుమూకుమ్మడి ఊచకోతలనూ, పాశవిక హత్యాకాండనూ, చీకటి కొట్లలో యావజ్జీవ శిక్షలకూ విదేశాలకు ప్రవాసం వెళ్ళడానికి తయారయ్యారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో సమైక్య జాతీయ సాయుధప్రతిఘటనోద్యమం అభివృద్ధిచెందింది. తిరిగివానికి హోచిమిన్ నాయకత్వం వహించారు.

ఫ్రెంచి వలస పాలనకు లొంగడానికి తిరస్కరించిన వియత్నామ్ ప్రజ జపాన్ ఆధిపత్యానికి లొంగడానికికూడా తిరస్కరించింది. జపాన్ వ్యతిరేక పోరాటంలో వియత్నాం, అమెరికా, బ్రిటన్, కొమింటాంగ్ చైనీస్ పాలనసుండి సైతం సహాయం పొందింది.

తప్పుడు ప్రచారం

1945 సెప్టెంబరు 2 వ తేదీన హనోయ్ బడ్డిక్ స్క్వేర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన వీరవియత్నాం స్వాతంత్ర్యం స్వదేశీయులు సాధించిన ఫలితమే. కాని వెలుపల నుండి ఎవరో ప్రసాదించినట్లు అమెరికా ప్రచారం చేస్తున్న తప్పుడు కారణంగా మరుగునబడ్డ వాస్తవాలన్నింటినీ తిరిగి స్ఫురణకు తెచ్చుకోవడం చాలా అవసరం. వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ ఏర్పడిన తదుపరి 4 సంవత్సరాల వరకూ వియత్నాం, చైనా సరిహద్దు సమీపంలో ఎక్కడా చైనా కమ్యూనిస్టుపార్టీ పరిపాలన లేదనేది కూడా జ్ఞప్తికి తెచ్చుకోవడం అవసరం. ఆ కాలంలో చైనా ప్రత్యేకించి దక్షిణ భాగం అమెరికాకు విశ్వాసపాత్రుడైన మిత్రుడు చాంగ్-కై-షేక్ అధీనంలో వుంది. వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ ఆవిర్భావం కమ్యూనిస్టు చైనా సృష్టిఅనీ, దాని కీలుబొమ్మఅనీ చేస్తున్న ప్రచారం ఊహాకందని విషయం

పశ్చిమంలో హిట్లర్ జర్మనీ, తూర్పున ఫాసిస్టు జపాన్‌లు పరాజయం పొందటంతో స్వాతంత్ర్యం కొరకు తమంతట తాముగా కృషిచేస్తున్న తూర్పు ప్రాంత ప్రజలపై తమ ఆధిపత్యం విధించడం ఎలా అనే బెంగ పశ్చిమ దేశాలకు పట్టుకున్నది.

పశ్చిమ దేశాలలో ఆర్థికంగా, సైనికంగా శక్తివంతమైన అమెరికా తూర్పు భాగంలో వలసఆధిపత్యాన్నిపునఃస్థాపించే కార్యక్రమాన్ని చేపట్టింది పాత వలస వాద శక్తులయిన బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలను చిన్న చిన్న భాగస్వాములుగా చేసుకొని వాటి సహాయాన్ని వినియోగించుకున్నది.

తూర్పులో పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని, యావత్తు ప్రపంచంపై అమెరికా ఆధిపత్యాన్ని నెలకొల్పటకు జరుగుతున్న యత్నానికి సోవియట్ యూనియన్ అడ్డంకి అని అమెరికా తెలుసుకున్నది.

ఈ రెండు శక్తులను అణచివేయాలనే దుష్ప్రవృత్తితో ద్వితీయ ప్రపంచ సంగ్రామం ముగుస్తున్న దశలో అమెరికా జపాన్‌పై అటంబాంబులు వేసింది. సోవియట్‌పై ప్రచ్ఛన్న యుద్ధాన్ని, ఆగ్నేయాసియా తూర్పు ఆసియాలలోని జాతీయ విముక్తి పోరాటాలపై యుద్ధాన్ని ప్రారంభించింది.

కమ్యూనిస్టు వ్యతిరేక ముసుగు

యుద్ధానంతర సంవత్సరాలలో అమెరికా దాని అనుగ్రహ రాజ్యాలు సోవియట్ కమ్యూనిజం బూచిని చూపించే విషయాన్నికూడా తిరిగిప్రస్తావించడం అవసరం. సోవియట్ కమ్యూనిజాన్నుంచి తమకున్న ప్రమాదమే ఇందుకు కారణమని ఫ్రెంచి, బ్రిటన్‌లు అమెరికా మద్దతుతో 1945 ఆగస్టు అనంతరం అగ్నేయాసియాలోని ఇండోనీషియా వియత్నాం, తదితర దేశాలపై తిరిగి వలసపాలనను బలవంతానరుద్దేందుకు తీవ్రంగా యత్నించాయి.

తమ దుష్టచేష్టలను కప్పిపుచ్చుకొనేందుకు, వాస్తవాలను మసిపూసి మారేడుకాయ చేసేందుకు "సోవియట్ కమ్యూనిజం ప్రమాదం" అనే ప్రచారాన్ని సామ్రాజ్య వాదులూ, వారితొత్తులూ మిక్కుటంగా సాగించారు.

తమ జాతీయ స్వాతంత్ర్యం కొరకు వియత్నాం ప్రజ తమ స్వశక్తితో పోరాడింది స్వేచ్ఛా స్వాతంత్ర్యం కొరకుతమ మాతృభూమి సార్వభౌమాధిపత్యం, జాతీయ సమగ్రత కొరకు తమ స్వశక్తితో వంద సంవత్సరాల పాటు నిర్విరామంగా జరిపిన పోరాట ఫలితంగా 1945 సెప్టెంబరు 2 వ తేదీన తమ లక్ష్యాన్ని సాధించింది. ఏఒక్కరికీ దాసిగా వుండేందుకు వియత్నాం అంగీకరించదని నిరూపించిన ఈ పవిత్ర దినం భూత, వర్తమాన, వలస వాద శక్తులకు ఒక సవాల్.

వలస ఆధిపత్య పునరుద్ధరణ

అమెరికన్ పాలకులు గతంలో చూపిన సోవియట్ బూచి స్థానంలో తమ ఎత్తుగడల అనుసారంగా ప్రస్తుతం చైనా బూచిని చూపెడుతున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదులు మొట్టమొదటినుండీ ద్వితీయప్రపంచ సంగ్రామంలో సైతం తూర్పు అగ్నేయ ఆసియాలపై తమ ఆధిపత్యానికి పథకాలు వేశారు చిన్న వలసవాద శక్తులు తమ స్వశక్తికే పరిమిత మౌతామని ఆయా ప్రాంతాలనుండి ఉపసంహరించుకోవాలని కోరిన వారు వలసవాద యుద్ధాలు కొనసాగించడానికి అమెరికానే కారణం. ఈ యుద్ధాలన్నింటికీ అది కమ్యూనిస్టు బూచిని సాకుగా చూపింది. ఆయా వలసవాద శక్తులకు ఆర్థికసహాయం ఇచ్చింది. వియత్నాంలో జరుగుతున్నదికూడా ఇదేనని మనం చూస్తున్నాం.

వియత్నాం ప్రజలపైన, వారి నూతన స్వతంత్ర రాజ్యంపైన సాగిన ఫ్రెంచి వలసవాద యుద్ధం అమెరికా ప్రేరణ ఆర్థిక తోడ్పాటు లేందే జరిగి వుండేది కాదు. ఒకవేళ జరిగినా అంత దీర్ఘకాలం (1945 నుండి 1954 వరకు) జరిగివుండేది కాదు. వియత్నాం స్వాతంత్ర్యాన్ని గుర్తించేందుకు, ఫ్రెంచి ప్రజలఅభీష్టానుసారం గౌరవప్రదంగా వియత్నాం నుండి వైదొలగేందుకు ఫ్రాన్సుకు వచ్చిన అనేక అవకాశాలు, కుదిరిన ఒప్పందాలు అమెరికా ఒత్తిడి మూలంగానే విఫలమయ్యాయి.

ఉదాహరణకు 1946లో అధ్యక్షుడు హోచిమిన్‌తో ఫ్రాన్సు కుదుర్చుకున్న ఒప్పందంలో ఇలా ప్రకటించ బడింది:-

"ఫ్రెంచి యూనియన్‌లోని ఇండో చైనా సమాఖ్యలో భాగంగా వియత్నాం రిపబ్లిక్ తనస్వంత ప్రభుత్వం, పార్లమెంటు, సైన్యం ఆర్థిక వనరులతో స్వతంత్ర రాజ్యంగా ఉండటాన్ని ఫ్రెంచిప్రభుత్వంగుర్తిస్తుంది."

శ్రీ
జియాషాల్ హాక్

అమెరికా ఒత్తిడి ఫలితంగా ఈఒప్పందం ఉల్లంఘించబడింది. తిరిగిపోరాటం ప్రారంభమయింది.

1954 నాటికి యుద్ధాన్ని కొనసాగించటం ఫ్రాన్సుకు అసాధ్యమయింది (ఫ్రెంచివారు పూర్తిగా చావ మోదబడ్డారు; దిన్‌బిన్‌ఫూలో ఘోర పరాజయాన్ని వరించారు. 1954 జూలై 4వ తేదీన న్యూయార్క్ టైమ్స్ ఇలా రాసింది: "వియత్నాం యుద్ధంలో ఫ్రెంచి యూనియన్‌కు అవుతున్న వ్యయంలో 78 శాతాన్ని అమెరికా ఈ సంవత్సరం భరించింది."

జెనీవా ఒప్పందం (1954 జూలై 21) జయప్రదంగా ముగిసిన ఫలితంగా యుద్ధం నుండి ఫ్రాన్సు వైదొలగింది. వియత్నాంలోని దక్షిణ భాగాన తమ వలసపాలనను వుంచేందుకు తమ కీలుబొమ్మల ద్వారా దక్షిణ వియత్నాంను పూర్తి అమెరికా వలసగా చేసేందుకు బాధ్యతను అమెరికా స్వీకరించింది. అక్కడ తమ కీలుబొమ్మ అయిన గోదిన్ దీమ్‌ను అధ్యక్షునిగా నెలకొల్పింది అతగాణ్ణి తమ ముసుగుగా వుంచుకుని జెనీవా ఒప్పందాన్ని పూర్తిగా ఉల్లంఘించేందుకు అమెరికా ఒడిగట్టింది.

జెనీవా ఒప్పందం

17 వ అక్షాంశ రేఖ తాత్కాలిక సైనిక సరిహద్దుగా వియత్నాం ఈ ఒప్పందం గుర్తించింది. ఉత్తరం, దక్షిణ వియత్నాంల పేరుతో రెండు దేశాలేర్పడ్డాయి. ఒక సంవత్సరం అంటే 1955 జూలై 20వ తేదీకల్లా పరస్పర సంప్రదింపులు జరుపుకొని 1956 జూలై 20 నాటికి సంయుక్తంగా దేశవ్యాపిత ఎన్నికలను నిర్వహించాలని ఈ ఒప్పందం కోరింది.

రాజకీయ కక్షల సాధనకు ఉపయోగించబడు ఎట్టి చర్యలకు దిగరాదని, విదేశాల నుండి ఆయుధాలను, సైనిక ప్రవీణులను అనుమతించ రాదని ఆ ఒప్పందంలో చెప్ప బడింది. జెనీవా ఒప్పందాన్ని ఉభయపక్షాలు అమలు జరపడాన్ని పర్యవేక్షించేందుకు భారత్ అధ్యక్షురాలిగా, పోలెండ్, కెనడాలు సభ్య దేశాలుగా అంతర్జాతీయ కంట్రోలు కమిషన్ నియమించబడింది.

తాను ఒప్పందంపై సంతకంచేయలేదనే సాకుతో దక్షిణ వియత్నాంలోని అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వం జెనీవా ఒప్పందాన్ని పూర్తిగా ఉల్లంఘించింది. జెనీవా ఒప్పందం ఫ్రాన్సుకు ఎలా వర్తిస్తుందో, ఆ విస్మృత అధికారం చేపట్టిన గోదిన్‌దీమ్‌కు, అతని అమెరికా దొరలకు అలాగే వర్తిస్తుంది.

స్వాతంత్ర్యంకొరకు పోరాడినవారిని, జెనీవాఒప్పందంఅమలుకునిలబడినవారిని చిత్రహింసల పాల్జేసే మారణకాండను దక్షిణవియత్నాంలోని అమెరికాకీలుబొమ్మ పాలకులు ప్రారంభించారు. దక్షిణ వియత్నాంలోని 'కమ్యూనిస్టులను అణచివేసేందుకూ తన పాలనను వ్యతిరేకించే వారిని పట్టుకొనూ, ఆ తరవాతివారిని చిత్రహింసల పాల్జేసేందుకూ, చంపేందుకూ, జైలులో పెట్టేందుకుఅతడుమారణకాండను ఉధృతం చేశాడు అన్ని విధాలా వారి నోళ్ళను నొక్కేయటకు ప్రయత్నించాడు.

అమెరికా యుద్ధ ప్రవేశం. అమెరికా సైనిక సలహామూకలూ, లక్షలాది టన్నుల ఆయుధ సామాగ్రి దక్షిణ వియత్నాంలోకి రావడం మొదలయింది.

ఘోరమైన ఉల్లంఘన

జెనీవా ఒప్పందాన్ని బహిరంగంగా, ఘాతుకంగా ఉల్లంఘించడమేగాక, వియత్నాం సమస్యలకు శాంతియుత పరిష్కారానికి [illegible] కల్పించటంలోను అమెరికా [illegible]. ప్రజలు కాంక్షించిన ప్రకారం జెనీవా ఒప్పందం వాగ్దానంచేసిన ప్రకారం, స్వతంత్ర ఐక్యవియత్నాం ఏర్పాటుకు ప్రతిబంధకంగా అమెరికా నిలచింది. ఈ పరిస్థితులలో సాయుధ పోరాటాన్ని పునరుద్ధరించటం తప్ప దక్షిణ వియత్నాం ప్రజలకు ప్రత్యామ్నాయం లేదు.

1959 చివరన, 1960 ప్రారంభంనాటికి దక్షిణాదివిప్లవోద్యమం ఉన్నత దశకు చేరింది. అమెరికా కీలుబొమ్మపాలన చాలా ప్రాంతాల్లో తొలగిపోయింది.

పరిపాలనా యంత్రాంగం పునాది కదిలింది. జనాభాలో 80 శాతం విముక్తి చేయబడ్డారు. 1960 డిసెంబరు20వ తేదీన జాతీయ విముక్తి సంఘటన రూపొందింది.

తదనంతరం కొంతకాలానికి అప్పుడు అమెరికా ఉపాధ్యక్షునిగావున్న లిండన్ జాన్సన్ దక్షిణ వియత్నాంను సందర్శించాడు. గోదిన్‌దీమ్‌తో ద్విపక్ష సైనిక ఒప్పందంపై సంతకం చేశాడు దక్షిణ వియత్నాం ప్రజలపై అమెరికా "అప్రకటిత యుద్ధం" మొదలయింది.

దక్షిణ వియత్నాంలో అమెరికా సాగిస్తున్న పాశవిక యుద్ధం 1962 చివరకు ఏ దశకు చేరిందో ప్రముఖ అమెరికా పత్రిక హెరాల్డ్ ట్రిబ్యూన్ ఇలా రాసింది :-

అమెరికా బహిరంగ యుద్ధం

"ఈ మహా రహస్య యుద్ధంలో అమెరికా తలమునకలైంది. అమెరికా చరిత్ర మొత్తంమీద ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఏంజరుగుతుందో ప్రజలకు తెలియకుండా రహస్యంగా అమెరికా సైనికులు ఇంతకు పూర్వం రణరంగంలో ఎప్పుడూ దిగటం జరగలేదు."

ఇలాటి పరిస్థితిలోకూడ "అమెరికావాళ్ళే పూర్తిగా యుద్ధం చేశాయి."

(సాటర్‌డే ఈవెనింగ్ పోస్టు)

దీనితో సాధించినదేమిటంటే "70 లక్షల మంది ప్రజలను నిర్బంధ శిబిరాలలో ఉంచారు. లక్ష 60 వేల మందిని చంపటం జరిగింది. 70 లక్షల మందిని నరకయాతనలకు గురిచేశారు. 16 వేల శిబిరాలలో 3 లక్షల 50 వేల మందికి వైకల్యం విధించారు. అయితే నాపాం బాంబు ప్రయోగాలు, విస్తృతమైన ప్రదేశాలలో విష రసాయనాలు జల్లటంలాంటి ఘోరకృత్యాలు ఇందులో చేర్చబడలేదు

ఇది అమెరికా సిద్ధకించిన గోదీమ్. అతని సోదరులు చేసిన 9 ఏళ్ళ పరిపాలన.

అయితే 1963 నవంబరు 1న దక్షిణ వియత్నాం అమెరికా కొంగునుండి పూర్తిగా జారిపోతుందనే తరుణం వచ్చేసరికి తప్పనిసరిగా ఈ రహస్యయుద్ధం బహిర్గతం గావించాల్సివచ్చింది.

దానితో జెనీవాఒప్పందాన్ని చించిపారేసి అంతర్జాతీయ న్యాయసూత్రాల్ని కాలరాచి, స్వతంత్ర పవిత్రతగ్గిన ఉత్తరవియత్నాంపై విమానదాడులను అమెరికా జరుపనారంభించింది.

విమానదాడులు ; యుద్ధ విస్తరణ

ఉత్తర వియత్నాం సైనికులపైనేగాక, వియత్నాం ప్రజలందర్నీ భయభ్రాంతుల్ని చేద్దామనే దురుద్దేశ్యంతో దేశం మొత్తంపై అమెరికా విమానదాడుల్ని విస్తరించింది.

అంతేకాదు అమెరికా పదాతిదళం పెద్దఎత్తున యుద్ధం ప్రారంభించింది అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ శ్వేత జాతి సైనిక దళాలు 5 లక్షల మంది దక్షిణ వియత్నాంలో కాపరంపెట్టారు. సప్తమ నౌకాదళం నుండి అమెరికా యుద్ధ విమానాలు బాంబులు వెయ్యటానికి బయల్దేరుతున్నాయి. మొత్తం

(మిగతా 6వ కాలంలో)

బ్రవో! హోచిమిన్ !

హోచిమిన్ ... అంటే వియత్నాం.

ఈ విలక్షణమైన అల్పకాయుడు అతి సౌమ్యంగా కనిపిస్తున్నప్పటికీ లక్ష్య సాధనలో వజ్ర సంకల్పుడు మూర్తీభవించిన ధైర్య సాహసాలతో బహుకాలాన నూతన దేశ ఆశయాలను ప్రతిబింబిస్తున్నాడు. ఆ నూతన రాజ్యాన్ని ఆయన రూపొందించి, ఘోర మారణ యుద్ధాల మధ్యగుండా సురక్షితంగా నడిపించి. దానికి పూర్ణ దర్శకత్వం వహిస్తాడు.

న్యూయార్క్ టైమ్స్
సెప్టెంబరు 21.1946

భీమవరం హైస్కూలులో ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాలు

భీమవరం, ఆగస్టు 31

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శ్రీ జూపూడి గంగయ్య మెమోరియల్ హైస్కూలులో మేనేజరు, కరస్పాండెంటు; పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన శ్రీ జూపూడి శివయ్య యజమాన్యాన ఉపాధ్యాయులకు తీవ్రమైన అక్రమాలు జరుగుతున్నాయి.

ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన జూలై నెల జీతములు 25.8.1967 వ తేదీని ఇచ్చారు. 67 సం॥ మార్చి నెల నుండి జూలై నెలాఖరు వరకు 10% చొప్పున మొత్తం జీతంలో విరగకోసుకొని, మిగతా సొమ్మునకు జీతాల రిజిష్టరులో సంతకాలు చేయించుకున్నారు.

ఉపాధ్యాయులకు 10% జీతము కోతపెట్టి ఇస్తున్నారు. ఇదేమిటని ఉపాధ్యాయులు అడగడం దానిపైన మేనేజిమెంటు హెడ్‌మాస్టరు ద్వారా "ప్రభుత్వం మాకు స్కూలు టీచింగ్ గ్రాంటులో 10% కట్ చేసి ఇచ్చింది కాబట్టి మీకు కూడా 10% కట్‌చేసి ఇస్తాంగానీ అదనంగా ఇవ్వ" అని సమాధానం ఇచ్చినారట

ప్రభుత్వం ఉత్తర్వు ప్రకారం 10% ఉపాధ్యాయులను రిట్రెంచిమెంటు చేయవద్దు అన్నా, ఈ స్కూలులో 4 సంవత్సరముల నుండి పనిచేయుచున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను ముగ్గురిని. ఒక బి. ఇ. డి. అసిస్టెంటును, ఒక సి.ఇ.టి.ని బర్తరఫ్ చేశారు. ఈస్కూలులోనిఒకఉపాధ్యాయునికి బి.ఇ.డి. ట్రెయినింగ్ అయిన పిరియడ్‌లో ప్రభుత్వం 5 నెలలకు జీతం ఇవ్వవలసిందిగా ఉత్తర్వు ఇచ్చియున్నా ఈ మేనేజ్‌మెంటు ఆ ఉపాధ్యాయునికి జీతం ఇంతవరకు ఇచ్చియుండలేదు.

1961 సం॥లో విద్యాశాఖ కార్యదర్శి స్కూలుకు షరతు పెడుతూ ప్రతీ నెలా మొదటివారంలో జీతం ఇవ్వక ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టినా, పాత బకాయిలు పెట్టినా, ప్రభుత్వ దృష్టికి తెచ్చియున్నట్లయితే స్కూలు రికగ్నైజేషన్‌ను రద్దుచేయగలమని ఉత్తర్వులిచ్చారు. ఈ 6 సం॥నుండి ప్రతి నెలా మొదటివారంలో జీతములు యివ్వ యుండలేదని తెలుస్తున్నది. 1964 లో పెంచిన కరువుభత్యం 9 మాసములకు; 66 లో పెంచిన కరువుభత్యం మూడు మాసములకు 67 సం॥లో పెంచిన కరువు భత్యం మూడు మాసములకు ఈ రోజు వరకు ఇచ్చియుండలేదు.

ప.గో.జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం తహసీల్దార్, మాజీ యమ్. యల్. ఎ. నాదు వెంకట్రామయ్య ఈ స్కూల్‌కి కమిటీ మెంబర్లు యున్నప్పటికీ స్కూలుయొక్క సమావేశాలకు హాజరై యుండలేదని తెలుస్తున్నది. 1961 లో ఈ స్కూలుకి తిరిగి రికగ్నేషన్ ఇచ్చిన సంవత్సరంలో కమిటీ సమావేశములకు ప్రభుత్వ ఆఫీసర్లు అయినవారు, విధిగా హాజరుకావలసి యున్నదని ఒక్కరైనా హాజరు విధిగా కావలసివున్నది. వీరు సమావేశములకు హాజరు కాకపోవటే మేనేజ్‌మెంటు తన ఇష్టానుసారం ఉపాధ్యాయులను పదవులనుండి తొలగించు చున్నది.

ఈ స్కూలునకు 20 ఎకరముల భూమి భీమవరం తాలూకా కాళ్ళ గ్రామంలో వున్నది, ఈ 20 ఎకరములపైన వచ్చే ఆదాయం వున్నా, ప్రభుత్వం యిచ్చే టీచింగ్ గ్రాంటు సక్రమంగా వస్తున్నా, ఈ మేనేజిమెంటు స్కూలును సక్రమమయిన పద్ధతుల్లో నిర్వహించలేక పోతున్నది.

కనుక ప్రభుత్వం, విద్యాశాఖ డైరెక్టరు ఈ స్కూలులో ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయములను అరికట్టడానికి వెంటనే చర్య తీసుకోవాలి. ఇంతకు ముందు అనేకసార్లు ఈ స్కూలు విషయమై దర్యాప్తులు జరిపిన గెజిటెడ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్సు శ్రీమతి ఇ.పద్మావతి ఉపాధ్యాయులనుండి సేకరించిన సమాధానాలు ఏమయ్యాయి? విద్యాశాఖ కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులు ఎంత వరకు అమలుజరిగినాయి. వెంటనే విద్యాశాఖవారు కదలి నిరంకుశంగా నిర్వహించుచున్న మేనేజ్‌మెంటును రద్దుచేసి ప్రభుత్వమే ఈ స్కూలును నడిపి. విద్యావ్యాప్తికి భీమవరంలో గట్టిగా కృషి చెయ్యాలని. ఉపాధ్యాయుల ఇబ్బందుల్ని వెంటనే పరిష్కరించాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు.

(వి. వి.)

వియత్నాం

(6 వ కాలం తరువాయి)

మీద సంవత్సరానికి 25 వేల కోట్ల డాలర్ల ధనం ఖర్చు పెడుతున్నా ఈ యుద్ధంలో ఏమాత్రం విజయాన్ని సాధించలేకపోయింది. ఇకముందుకూడా ఆ ఆశలేదు.

ఉత్తర దక్షిణ వియత్నాం ప్రజలు అనంతమైన పట్టుదలతో [illegible], ఎనలేని పరాక్రమం ప్రదర్శించారు, ప్రపంచం మొత్తం మీద కుబేర దేశమూ, పారిశ్రామికంగా అత్యధికాభివృద్ధిని సాధించిన దేశమైన అమెరికాతో యుద్ధంలో వియత్నాం దేశీయులు అద్భుతమైన సాహసాలు ప్రదర్శించారు.

టైమ్ పత్రిక ఈక్రింది విధంగా ప్రకటించింది.

ఉత్తర వియత్నాంపై యుద్ధంలో అమెరికా 2,200 విమానాలను కోల్పోయింది. క్రిందటి నెల దానాంగ్ స్థావరంపై వియత్‌కాంగ్ గెరిల్లాలు దాడిచేసి అమెరికాకు 850 కోట్ల డాలర్ల నష్టాన్ని కలుగ చేశారు. దక్షిణ వియత్నాంలో ఉన్న అమెరికా సైనికులలో 12,400 మంది సైనికులు మరణించారు."

కాని ఇది సరియైన అంచనా కాదు. నిజం చెప్పాలంటే దాదాపు 25 వేల మంది అమెరికా సైనికులు మరణించారు.

ఈ యుద్ధంవల్ల అమెరికా ప్రతిష్ఠపూర్తిగా దెబ్బతింది. 10 శాతం అదనపు పన్నులు ప్రజలపై వెయ్యటంవల్లా, ప్రభుత్వ విధానాలు అమెరికా ప్రజలకు నచ్చక పోవటంవల్లా ప్రజలలో జాన్సన్‌పై గౌరవం పూర్తిగా తరిగిపోయింది.

ఈ కష్టాలన్నిటి నుండి అమెరికా గట్టెక్కాలంటే ఒకే ఒక మార్గంవుంది. అది వియత్నాంపై దురాక్రమణను అమెరికా మానుకోవాలి. తన సైన్యాన్నంతటినీ వియత్నాంనుండి వెనక్కు మరల్చుకోవాలి. ఎట్టి షరతులూలేకుండా ఉత్తర వియత్నాంపై బాంబుదాడులను విరమించుకోవాలి. ఇదీ అమెరికా తీసుకోవాల్సిన ప్రథమ చర్య

అమెరికా ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభం

ఈ అమానుష, పాశవిక కృత్యాలను ఎంత ఉధృత పరచినా వియత్నాంలో తమకు విజయం చేకూరదన్న విషయం అమెరికన్లకు బాగా తెలుసు.

అమెరికా ఎంత విష ప్రచారం చేస్తున్నా "ఒక్కసారి ఉత్తర వియత్నాంపై బాంబుదాడుల్ని ఆపితే, సమస్యను శాంతియుత చర్చలద్వారా పరిష్కారం చేసుకోవచ్చు"నని అధ్యక్షుడు హోచిమిన్ చేసిన ప్రకటన ప్రజలందరికీ తెలుసు. ఈ విషయాన్ని ఐరాస ప్రధాన కార్యదర్శి శ్రీ ఉథాంట్ ఆగస్టు 22 ప్రకటనలో మరోసారి హెచ్చరించారు.. అమెరికా ప్రభుత్వం తన మూర్ఖత్వాన్ని తెలుసుకోనంతకాలం ఈ పాశవిక యుద్ధం కొనసాగుతుంది. దీనివల్ల అమెరికా [illegible] మరింత ఘోర పరాజయం మాత్రమే సిద్ధిస్తుంది.

12 ఏళ్ళక్రితమే 1956 జనవరి 1న హ్యూమానిటే పత్రికా విలేకరి ఇంటర్వ్యూలో అధ్యక్షుడు హోచిమిన్ ఈ విధంగా అన్నారు.

"ఎంతకష్టమైనాసరే మేము స్వాతంత్ర్యాన్ని, ఐక్యతను శాంతియుతంగా సాధించగలమని నిశ్చయంగా చెప్పగలం. ఎందుకంటే వియత్నాంలోని ప్రజలందరూ దాన్ని కోరుతున్నారు. వారు మాకు ఎప్పుడూ అండగానే ఉన్నారు.

"ఎవరూ ప్రకృతిసూత్రానికి వ్యతిరేకంగా నిలువలేరు. ఏ శక్తీ మారోద్యమం కాకుండా అడ్డగించలేదు."

అనేకమైన హత్యలతోను, దోపిడీలతోను సంబంధమున్న నవాబ్‌సింగ్ అతని అనుచరుడు బాబూసింగ్ కాల్చి వేయబడ్డారు.

రెడ్యాలలో రైతుసంఘ స్థాపన

మానుకోట, ఆగస్టు 31

వరంగల్‌జిల్లా మహబూబాబాద్ తాలూకా రెడ్యాల గ్రామ రైతులు, బొద్దుగొండ రైతులు ఈ నెల 27 న రెడ్యాలలో సమావేశమై జమీందారులు రైతులను పెడ్తున్న ఇబ్బందులను చర్చించారు. సమావేశానికి శ్రీ అయిలబోయిన చినసరసయ్య అధ్యక్షత వహించారు. తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ యం. వెంకటనర్సుహ్మారెడ్డి రైతుసంఘాల ప్రాముఖ్యతను వివరించారు.

తర్వాత శ్రీ అయిలబోయిన చిరవీరయ్య అధ్యక్షుడుగా, బొల్లి వెంకయ్య ఉపాధ్యక్షులుగా, శ్రీ వి. రాధాకృష్ణ కార్యదర్శిగా, శ్రీ నంతం పాపయ్య సహాయ కార్యదర్శిగా, శ్రీ గండికిరి మల్లయ్య కోశాధికారిగా, 25 మందితో వర్కింగుకమిటీని ఎన్నుకున్నారు. రైతులపై భూమిశిస్తు పెంచే ప్రయత్నాన్ని విరమించవలసిందిగా ప్రభుత్వాన్నికోరుతూ తీర్మానించారు.

పెద్దాపురంలో పంచదార, బియ్యం బ్లాక్ మార్కెట్

ఇద్దరు చిల్లర వర్తకులపట్టివేత

పెద్దాపురం, ఆగస్టు 31

తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో శ్రీ చెక్కా భాస్కర రామమూర్తి అనే చిల్లర వర్తకుడు పంచదార కిలో 1కి రూ 4 చొప్పున శ్రీపూరి సత్యనారాయణ అను మరొక వర్తకుడు [illegible] బియ్యం కిలోకి రు 1.25ల చొప్పున అమ్ముతుండగా కాకినాడ సి.బి.డి. ఇన్‌స్పెక్టరుతన సిబ్బందితో వచ్చి ఈ నెల 28న పట్టుకొని కేసు పెట్టారు.

పట్టణంలో పెద్ద వర్తకులు ఒకప్రక్కన బాహాటంగా దొంగ వ్యాపారం చేస్తున్నా వారిజోలికిపోక చిల్లర వర్తకులను పట్టుకోవటం కొరకే ఈ ప్రయత్నమని [illegible] ప్రజలు అనుకొంటున్నారు (వి. వి.)

వరంగల్ తాలూకాలో కమ్యూనిస్టు కార్యకర్తలపై గూండాల దాడులు

ప్రభుత్వం తక్షణం అరికట్టాలని డిమాండ్

వరంగల్, ఆగస్టు 31

వరంగల్ తాలూకా కొత్తూరు గ్రామంలో ఈనెల 26 వ తేదీన 50 మంది దుండగులు కర్రలతో సాయుధులై వరంగల్ తాలూకా కమ్యూనిస్టు కమిటీ సభ్యులు శ్రీయుతులు ఆజ్మీరా టూక్యాను గాండ్ల మల్లయ్యనూ తదితర కార్యకర్తలనూ తీవ్రంగా కొట్టారు ఈ గూండాలపై ప్రభుత్వం చర్యలు గైకొనాలని కమ్యూనిస్టుపార్టీ డిమాండ్ చేస్తున్నది

(ఈ వార్తను సంగ్రహంగా ఈ నెల 26 న ప్రకటించాం. వివరాలు నేడు ఇస్తున్నాం. సం)

ఈ దాడికిస్థానిక భూస్వామి శ్రీరంగరాజు గోపాల్‌రావు నాయకత్వం వహించారు. ; తాలూకా కమ్యూనిస్టు కమిటీ సభ్యుడు శ్రీ గాండ్ల మల్లయ్యను వరంగల్ తహసిల్ కచ్చేరిలో గుమస్తాగా పనిచేసే దేవులపల్లి కృష్ణన్‌రావు కొట్టాడు. ఈదాడిదార్లు శ్రీఅన్నె బత్తుల రత్తయ్య తల పగులకొట్టారు. గొట్టిముక్కల వెంకట సుబ్బయ్యకు తీవ్రంగా దెబ్బలు తగిలినవి. వీరి పరిస్థితి తీవ్రంగా వుంది.

వర్ధన్నపేట శాసన సభ్యుడు శ్రీ టి. పురుషోత్తమరావు, పంచాయితీ సమితి అధ్యక్షులు శ్రీ అచ్యుతరావు, వర్ధకొండ గ్రామ సర్పంచ్ వాసుదేవరెడ్డి, గొవర్ల సర్పంచ్ శ్రీ యాదగిరిరావు నల్లబెల్లి సర్పంచ్ శ్రీ దుగ్యాల రాంచంద్రం సమక్షంలోనే ఈ ఘాతుకమైన అత్యాచారంజరిగింది. ఈముఠా నంతా స్థానిక భూస్వామి రంగారాజు గోపాల్‌రావు కొత్తూరులో కొన్ని స్థానిక సమస్యల పరిష్కారం గురించి సమాలోచనలు జరపడానికి పిలిపించారు.

ఆదేరోజున కమ్యూనిస్టు నాయకులు ఆగ్రామంలో తమపార్టీకార్యకర్తలను కలుసుకొని సమావేశం జరపటానికై అక్కడ వున్నారు.

ఆ సందర్భంగాస్థానిక భూస్వామిగూండా ముఠా, పాకలి రామయ్య, అపుఘల లక్ష్మయ్య, పుట్ట పెద్దయ్య, రాజ్యాయ పోలీసుపటేల్ డి. లక్ష్మణరావు, తహసిల్ గుమాస్తా దేవులపల్లి కిషన్‌రావు, రంగరాజు గోపాలరావు, మేడ మల్లయ్య, మేడ కొమ్రయ్య, బుచారి బక్కయ్య, దొమ్మాటి అగమ్యులతోసహా దాదాపు 50 మంది రౌడీలు కర్రలతో కమ్యూనిస్టు కార్యకర్తలపై దాడిచేసి కొట్టారు.

నిర్బంధం

ఈముఠా మొత్తం స్థానిక శాసనసభ్యుడు శ్రీ టి. పురుషోత్తం గ్రూపుకు చెందినవారే. ఈ దాడిలో తలపగిలిన రత్తయ్యను పోలీసులకే రిపోర్టు చేయకుండానే ఈ ముఠా ఈనెల 28 వ తేదీవరకూ తనని నిర్బంధంలో వుంచుకొన్నారు.

కొండపాక కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తను ఈ శాసనసభ్యుని అనుయాయులే ఈనెల 23 వ తేదీ అవమానం చేసుకొన్నారు.

ఈ నియోజకవర్గంలో ఎన్నికల తర్వాత శాంతి భద్రతలు లేకుండా పోయాయి. ఈ గూండా ముఠా దౌర్జన్య కాండ పెచ్చు పెరిగిపోయింది. ఈ అమానుష దాడులను తట్టుకోలేక ప్రజానీకం ఈ ప్రాంతం వదలిపెట్టి వలస వెళ్ళుతున్నారు.

ప్రభుత్వంవెంటనే ఈనియోజకవర్గంలోని కొత్తూరు కొంపల్లి, కొండాపురం, పేర్కాలేడు, కొంకపాక, నల్లబెల్లి, కమ్మాల కిష్టాపురం మున్నగు గ్రామాల్లో జరుగుతున్న గూండా చర్యలను అదుపులోకి తెచ్చి, ఈ గూండాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ అజ్మీరా టూక్యా డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగుల సెప్టెంబరు ఆందోళన సన్నాహాలు

హైదరాబాద్, ఆగస్టు 31

కరువుభత్యం కోర్కెల సాధనకై కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య ఆదేశానుసారం సెప్టెంబరు 11 న ఒకరోజు నిరసనసమ్మె జరుపుటానికి హైదరాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్‌స్టోర్సు ఎంప్లాయీసు యూనియన్ సమ్మెనోటీసు ఇచ్చింది.

కడప ఎన్. జి. వో. ల సమావేశం

కడప ఎన్. జి. వో. లు ఈ నెల 20 న శ్రీ ఆర్. వి. రాఘవులు అధ్యక్షతన సమావేశమై హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ నిర్ణయాలను సమర్థించుతూ, ఏకవ్యక్తి పే కమిషన్ చేసిన సిఫారసులను నిరసించారు. [illegible] పద్ధతి తిరగవేయడానికి చేసే దుష్ట యత్నాన్ని ఈ సమావేశం నిరసించింది. ఈ పేకమిషన్ సిఫారసులకు వ్యతిరేకంగా సెప్టెంబరు 3 వ వారం నుండి దశలవారీగా జరగబోయే ఆందోళనా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సమావేశం నిర్ణయించింది.

శ్రీకాకుళం హైస్కూలు విద్యార్థుల సభ

శ్రీకాకుళం, ఆగస్టు 29

కృష్ణా విలా శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల "విద్యార్థి విద్యార్థుల వార్షిక సమావేశ ప్రారంభోత్సవం ఆగస్టు 23న శ్రీ ఎ. వైద్యనాథస్వామిచే జరుపబడింది.

హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎం. వి. కృష్ణారావు అధ్యక్షత వహించిరి పలువురు వక్తలు ప్రసంగించారు.

ప్రపంచ ప్రజలు - భాషలు

ప్రపంచంలో వున్న దేశాల సంఖ్యకంటే భాషల సంఖ్య అధికం. ఇటీవల సోవియట్ దేశంలో ప్రకటించబడిన ప్రపంచ ప్రజల అట్లాసులో ప్రపంచంలో 1,300 జాతుల ప్రజలూ 3 000 వివిధ భాషలు వున్నట్లు తెలియచేయబడినది.

ఉదాహరణకు బెల్జియంలో ఫ్లెమిష్ ఫ్రెంచి భాషలు మాట్లాడుతారు. సూడాన్‌లో 117 భాషలు మాట్లాడేవారు వున్నారు. కాంగోలో 500 భాషలు మాటాడేవారు వున్నారు. ఇండోనీషియాలో 250 భాషలు మాట్లాడేవారు వున్నారు. టోగోలోని 14 లక్షల మంది జనాభాలో 40 భాషలు మాట్లాడేవారు వున్నారు. పదిలక్షమంది జనాభాగల సోవియట్ ఆటానమస్ రిపబ్లిక్ అయిన దఘిస్తాన్‌లో 60 భాషలు మాట్లాడేవారు వున్నారు.

* *

ప్రతిరోజు మనం యెన్ని పదాలను ఉపయోగిస్తాము? ఈ విషయం మనిషి యొక్క స్వభావంమీద, అతని వృత్తిమీద, ఇతర అంశాలమీద ఆధారపడివుంటుంది. ఏమైనప్పటికీ రోజు3,000 పదాలు మాట్లాడుతాడని సగటున చెప్పవచ్చును. మనిషి ప్రతిరోజు మెలకువతో వున్న 16—18 గంటల కాలంలో 3. 3. గంటలసేపైనా మాట్లాడుతాడని భాషాతత్వ శాస్త్రజ్ఞులు మానసిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. మానవుడు నిముషానికి 150 పదాలు, గంటకు 9,000 పదాలు మాట్లాడుతాడు.

పే కమిషన్ సిఫార్సులకు విజయనగరం కాలేజీ సిబ్బంది తిరస్కృతి

విజయనగరం, ఆగస్టు 26

విజయనగరం లోని ప్రభుత్వ మహారాజా సంస్కృత కళాశాల ఉద్యోగులు ఉపాధ్యాయుల సమావేశమై కృష్ణారావు పే కమిటీ సిఫార్సులలోని ముఖ్యాంశాలపై చర్చ జరిపారు. ఈ సిఫార్సులు నిరాశా జనకంగాను అసంతృప్తి కరంగాను, నిర్దాక్షిణ్యంగాను, న్యాయ విరుద్ధంగాను ఉన్నందువల్ల వీటిని మొత్తంగా తిరస్కరిస్తూ తీర్మానించారు.

మంగళగిరి టి. బి. ఆస్పత్రి కార్మిక సమస్యల పరిష్కారం

మానేజిమెంటుకు. కార్మిక ప్రతినిధులకూ మధ్య రాజీ ఒప్పందం

మంగళగిరి ఆగస్టు 31

మంగళగిరి టి. బి. శానిటోరియం కార్మికుల కోర్కెల విషయంలో ఇటీవల మానేజిమెంటుకూ, కార్మిక ప్రతినిధులకూ మధ్య జరిగిన సంప్రదింపుల్లో రాజీ పరిష్కారం కుదిరినది.

కార్మికుల కోర్కెల సాధనకై మంగళగిరి బ్రాంచి మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జూన్ 26 న సమ్మెనోటీసు యిచ్చింది.

ఆస్పత్రి మేనేజిమెంటుకు, ఉద్యోగులప్రతినిధులకు ఈనెల 10వ తేదీన జరిగిన సంప్రదింపుల్లో పరిష్కారం కుదిరింది.

ఈ సంప్రదింపుల్లో ఆస్పత్రి మేనేజిమెంటు తరఫున టి. బి. ఆస్పత్రి సూపరింటెండెంటు డా॥ సి. ఆర్. రాజగోపాలన్ కార్మికుల తరఫున ప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ గురుమూర్తి, మంగళగిరి బ్రాంచి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీయుతులు యం జయరావు. ఎ. శివరామకృష్ణయ్య మధ్యవర్తులుగా తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీయుతులు పల్లాటి గంగాధరరావు, నాగళ్ళ రామకృష్ణయ్య పాల్గొన్నారు. ఈ పరిష్కారం దృష్ట్యా ఎంప్లాయీస్ యూనియన్ సమ్మెనోటీసును ఉపసంహరించుకొని ఆందోళనను విరమించుకొన్నది.

ఉద్యోగుల వద్ద నుండి రాబట్టిన రికవరీలను పునఃపరిశీలించడానికి, వైద్యశాఖ డైరెక్టరు వద్దనుండి మంజూరు సంపాదించి, ఆ ఆదేశాలనుబట్టి రికవరీలను తిరిగి చెల్లించడానికి ఆస్పత్రి మేనేజిమెంటు అంగీకరించింది.

అలాగే ఉద్యోగులపై విధించిన జరిమానాల విషయం పునఃపరిశీలించడానికి సమ్మతించింది.

ఈ ఆస్పత్రిలో పనిచేసే ఎం.ఎన్.వో శ్రీ కె. నాగభూషణంచేత 15 రోజులలో ఆస్పత్రి క్వార్టర్సు ఖాళీ చేయించి యివ్వడానికి ఎంప్లాయీస్ యూనియన్ అంగీకరించింది.

అలాగే శ్రీ నాగభూషణం సస్పెన్షన్‌కాలంలో అతనికి రావలసిన జీతం తదితర అలవెన్సులను ప్రభుత్వ నిబంధనల ననుసరించి, వాటి పరిధిలో తిరిగి చెల్లించడానికి మేనేజిమెంటు అంగీకరించింది.

ఆఫీసు అటెండర్‌గా వున్న పాల్‌ను తిరిగి పూర్వపు స్థానానికి బదిలీ చేయడానికి సమ్మతించింది.

సిబ్బంది శిక్షణ విషయంలో రూల్సును సరించి సీనియారిటీ ననుసరించి ఖచ్చితంగా పాటించడానికి అంగీకరించింది.

కార్మికులు సమ్మె నోటీసుఇచ్చినందుకు ఆఫీసు [illegible] జరుగుతున్న సందర్భంలో మేనేజిమెంటు తీసుకున్న చర్యను ఉపసంహరించుకొనడానికి అంగీకరించింది.

ఈ సందర్భంగా సస్పెండు చేయబడిన శ్రీమతి కె. పుష్పాబాయిను తన పూర్వపు ఉద్యోగంలో నియమించడానికి అంగీకరించింది

శ్రీ డి. జయరావును యం. ఎన్. ఓ.గా పూర్వపు ఉద్యోగంలో నియమించడానికి సమ్మతించింది.

ఉద్యోగులు మొత్తంగా ఆస్పత్రి క్వార్టర్సును ఖాళీచేయాలన్న ఉత్తర్వు ఉపసంహరించుకొని యథాతథ పరిస్థితి కొనసాగించడానికి మేనేజిమెంటు అంగీకరించింది.

నిబంధనల ననుసరించి ఉద్యోగుల కష్ట నిష్ఠురాల పరిశీలనకు గ్రీవెన్సు కమిటీ ఏర్పాటుకు మేనేజిమెంటు సమ్మతించింది.

అలాగే ఉద్యోగులు క్రమశిక్షణా నియమావళికి పూర్తిగా కట్టుబడి వుండడానికి. నిబంధనలకు విరుద్ధంగా ఎట్టి సమ్మె చేయకుండా వుండడానికి ఎంప్లాయీస్ యూనియన్ సమ్మతించింది.

ఈ ఒప్పందం ఈ నెల 10 వ తేదీని అమలులోకి వచ్చింది.

ఈ ఒప్పందంపై మేనేజిమెంటు, కార్మిక ప్రతినిధులతోపాటు సాక్ష్యంగా కమ్యూనిస్టు నాయకులు శ్రీయుతులు నాగళ్ళ రామకృష్ణయ్య, చిమ్మట నాగభూషణం సంతకాలు చేశారు.

ఉత్తర ప్రదేశ్ శాసనసభా కాంగ్రెసుపార్టీ నాయకులు శ్రీ సి. బి. గుప్తా ఇటీవల ప్రధానితో సంప్రదింపులు జరిపారు.

రేడియో

ఆదివారం — సెప్టెంబరు 3
శక 1889 ★ భాద్రపద 12

విజయవాడ

357.1 మీ. (840 కిలో సై.)

ఉదయం: 6.00 వందేమాతరం. శుభోదయం, ప్రసారవిశేషాలు; 6.10 భక్తిరంజని; 6.40 ఆం. వా; 6.45 సూక్తిముక్తావళి; 6.50 బజారుధరలు; 6.55 విరామ సంగీతం; 7.00 తె. వా; 7.15 సంగీత శిక్షణ - సిరియర్లకు; 7.30 'అమరవాణి'; 7.45 హిందీ పాఠము; 8.00 ఆం. వా; 8.15 హిం. వా; 8.30 'బొమ్మరిల్లు'; 9.15 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 కార్మికుల కార్యక్రమం; 1.00 హైదరాబాదు రిలే; 1.30 ఆం. వా; 1.40 హిం. వా; 1.50 తె. వా; 2.00 వాతావరణ సూచన - ప్రసార సమాప్తి.

3.00 హైదరాబాద్ వలె; 4.00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 స్థానిక ప్రకటనలు; 5.35 'వంటకథ'- ఎం. ఆదినారాయణ బృందం; 6.00 ఆం. వా; 6.05 ప్రాం. వా; 6.10 వాద్య బృందము; 6.25 ప్రకటింపబడును; 6.30 పంట సీమలు; 7.00 తె. వా; 7.15 తెలుగు పాట; 7.30 [illegible]; 7.45 మన సంస్కృతీ సంపద. ప్రసంగం; 7.50 చిత్ర తరంగిణి; 8.15 'మధువన్' హిందీనాటక కార్యక్రమం; 8.30 శకుంతలా ఆపంటరావు గాత్రం; 9.00 ఆం. వా; 9.15 ఢిల్లీ నుంచి రిలే; 9.30 ఆంగ్లముగా; 9.45 ఎమ్. ఎస్. గోపాలకృష్ణన్ - వయొలిన్; 10.30 ఆం. వా; 10.35 జన గణ మన - సమాప్తి.

హైద్రాబాద్ - (ఎ)

405.4 మీ. (740 కిలో సై.)

ఉదయం: 6.00 వందేమాతరం-మంగళధ్వని - కార్యక్రమ వివరణ; 6.10 భక్తిరంజని; 6.40 ఆం. వా; 6.45 సూక్తిముక్తావళి; 6.50 వాద్యగోష్ఠి; 7.00 తె. వా; 7.15 సంగీత శిక్షణ; 7.30 విజయవాడవలె; 7.45 సుగమ సంగీత్; 8.00 ఆం. వా; 8.15 హిం. వా; 8.30 ఎస్. గోపాలరత్నం - గాత్రం; 9.30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 కార్మికుల కార్యక్రమం; 1.00 రంగవల్లి; 1.30 ఆం. వా; 1.40 చిత్రసీమ; 1.50 తె. వా; 2.00 వాతావరణసూచన - లలిత సంగీతం; 2.15 బాలవినోదం; 3.00 'నవరంగం'- పంక్తి ప్రశబ్ద చిత్రం; 4.00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 స్థానిక ప్రకటనలు. 5.35 విజయవాడ వలె. 6.00 ఆం. వా; 6.05 ప్రాం. వా; 6.15 ప్రాం. వా. ఉర్దూ; (హైదరాబాద్ - కడపలు మాత్రమే) 6.25 ముఖ్య ప్రకటనలు; 6.30 వ్యావసాయిక విషయాలు; 7.00 తె. వా; 7.15 తెలుగు పాట. 7.30 విజయవాడ వలె; 7.45 స్వప్నములు మనవారి విశ్వాసము - ప్రసంగం. 7.55 విరామ సంగీతము; 8.00 ఆంగ్లం; 8.10 విరామ సంగీతము; 8.15 ఈ మాసపు పాట; 8.30 చిత్రసీమ; 9.00 ఆం. వా; 9.15 ఢిల్లీ నుండి రిలే; 9.30 ఆంగ్లం; 9.45 విజయవాడ వలె; 10.30 ఆం. వా; 10.35 హిం. వా; 10.40 వాతావరణసూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.

కడప

333.3 మీ. (900 కిలో సై)
సా॥ 5.30 నుండి రాత్రి 10.40 వరకు
శనివారములు మాత్రం
సా॥ 5.30 నుండి రా॥ 11.10 వరకు

విశాఖపట్నం

322.6 మీ. (930 కిలో సై.)
సా॥ 5.30 నుండి రా॥ 10.40 వరకు

హైద్రాబాద్ - (బి)

283 మీ. (1060 కిలో సై.)

మధ్యాహ్నం: 2.00 చిత్రపట్‌నే; 2.10 ఆం. వా; 2.20 సుగం సంగీత్; 2.30 బచ్చోం కేలియే; 3.00 ప్రసార సమాప్తి.

రాత్రి: 8.00 సర్గం; 8.31 బడే గులాం అలీఖాన్; 9.15 ఉ. వా; 9.30 ఉర్దూలో; 10.00 జన గణ మన - ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

211.3 మీ. (1420 కిలో సై.)

ఉదయం: 6.00 వందేమాతరం, మంగళగానం; 6.40 ఆం.వా; 6.45 వివిధసంగీతం 7.00 తె. వా; 7.15 అంజలి గీతం; 7.30 [illegible] 8.00 ఆం.వా; 8.15 సేలం ఎస్. జయలక్ష్మి గాత్రం; 8.30 ఆట విడుపు; 9.30 కళారంగం; 10.00 హాయిగా; 10.30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11.55 ప్రాంతీయ తెలుగు వార్తలు; 1.00 ఆంగ్లం; 1.30 ఆం. వా 1.40 హిం. వా; 1.50 తె. వా; 2.10 'అఖండ గౌరవము'- నాటిక; 3.00 ప్రసార సమాప్తి.

(సాయంత్రం 5.30 నుండి 6.45 వరకు 60.98 మీటర్లపై కూడా)

సాయంత్రం 5.30 ఆంగ్లం; 6.00 ఆం. వా; 6.05 ప్రాంతీయ తెలుగువార్తలు; 6.15 విరామ సంగీతం 6.20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు; వాణిజ్యవార్తలు, 6.45 గాత్రం; 7.00 తె. వా; 7.15 వాద్య సంగీతం; 7.30 గీత మాలిక, 8.00 తమిళ రూపకం; 8.30 ఇతర ప్రాంత సంగీతము; 8.45 వాద్య సంగీతం; 9.00 ఆం. వా; 9.15 ఢిల్లీ నుండి రిలే. 9.30 ఆంగ్లం; 10.30 ఆం.వా; 10.35 వాతావరణసూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.

పంచాయతీరాజ్ పెత్తనంనుండి పాఠశాలలను తొలగించాలి

కర్నూలు జిల్లా ప్రాథమికోపాధ్యాయ సమావేశం డిమాండ్

నంద్యాల, ఆగస్టు 31

పంచాయతీరాజ్ వ్యవస్థ పెత్తనంనుండి పాఠశాలలను వెంటనే తప్పించాలని ఈ నెల 27 న ఇక్కడ జరిగిన కర్నూలు జిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ విస్తృత సమావేశం డిమాండ్ చేసింది

కర్నూలు జిల్లా ప్రాథమికోపాధ్యాయ విస్తృత సమావేశం నంద్యాల మునిసిపల్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో ఈ నెల 27 న శాసనసభ్యులు శ్రీ వి. విజయరామరాజు అధ్యక్షతన జరిగినది.

హైస్కూలు టీచర్లు శ్రీ ఎ. వి. దాను, శ్రీ, వి. రామచంద్రారెడ్డి ఉపాధ్యాయుల సమైక్యతగురించి ఉపన్యసించారు. సమస్యల సాధనలో ఉపాధ్యాయులు ముందు రావలయునని సందేశమిచ్చారు. జిల్లా సంఘ అధ్యక్షులు శ్రీ యం. మద్దులేటి సభ్యులకు స్వాగతమిస్తూ జిల్లా ఉద్యమ నిర్మాణానికి అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి శ్రీ కె. వి. సుబ్బయ్య కార్యదర్శి నివేదికను జమా ఖర్చులను ప్రవేశపెట్టగా చర్చల అనంతరం ఆమోదించబడినది. శ్రీ విజయరామరాజు రాష్ట్ర ఫెడరేషన్ సాధించిన విజయాలను, భవిష్యత్ కర్తవ్యాలను జిల్లా ఉద్యమ నిర్మాణములో తీసుకొనవలసిన జాగ్రత్తలను వివరించారు.

8.10.67 తేదీన కర్నూలులో నూతన కౌన్సిలు సమావేశం జరిపి నూతన కార్యవర్గమును ఎన్నుకొనుటకు ఏకగ్రీవంగా తీర్మానించబడింది.

ఫెడరేషన్ ఉద్యమాన్ని బలపరచుటకు శ్రీయుతులు ఎ. వి. దాను, సి.వి. సుబ్బయ్య, వి. రామచంద్రారెడ్డి, వి. మాబుసాబు, ఎ వి. కొండారెడ్డి జిల్లాలో గల కొన్ని సమితుల బాధ్యతను తీసుకున్నారు, ఇతర కార్యకర్తలు కూడ కొన్ని సమితులను ఎన్నుకొని నిర్మాణమును సరిచేయుటకు బాధ్యతను తీసుకున్నారు. చర్చల అనంతరం ఈ క్రింది తీర్మానములు ఆమోదించబడ్డాయి.

తీర్మానాలు

పంచాయితీ వ్యవస్థ నుండి పాఠశాలలను తప్పించాలని కొఠారి కమిషన్ చేసిన సిఫారసును వెంటనే అమలుపరచి ఉపాధ్యాయులు, ప్రజలు, విద్యాధికారులు సమాన ప్రాతినిధ్యం గల విద్యాబోర్డుల ఆధ్వర్యము క్రిందకు పాఠశాలలను తీసుకరావాలని ప్రభుత్వాన్ని ఈ కౌన్సిలు అభ్యర్థించింది.

కొఠారి కమిషన్ సిఫారసుచేసిన స్కేళ్ళను ఉపాధ్యాయ సంఘాలు సూచించిన సవరణలతో వెంటనే అమలుపరచాలని ప్రభుత్వాన్ని ఈ కౌన్సిలు కోరింది.

కొఠారి కమిషన్ సిఫారసు చేసినవిధంగా, ఉపాధ్యాయులను సెలవుపెట్టి ఎన్నికల్లో పోటీ చేయుటకు ఎన్నికల ప్రచారములో పాల్గొనుటకు స్వేచ్ఛకల్గించి, భారత రాజ్యాంగం ప్రసాదించిన పౌరసత్వ హక్కులను ఉపాధ్యాయులకు కూడ కల్గించాలని కోరింది.

ఉపాధ్యాయులను అనవసర బదిలీలకు గురిచేయరాదని, వారికి ఇవ్వవలసిన వార్షిక ఇంక్రిమెంట్లను సకాలములో ఇవ్వాలని, ప్రావిడెంటుఫండు అకౌంట్సును ప్రతి సంవత్సరము పంపుచుండాలని, జీవిత భీమా ప్రతి నెల అడ్జెస్టు చేయాలని అన్ని పంచాయితీ సమితులను మునిసిపాలిటీలను, జిల్లా పరిషత్తును యీ కౌన్సిల్ డిమాండ్ చేసింది.

'అప్పర్ ప్రైమరీ పాఠశాలల హెడ్ మాష్టర్లకు బి. ఇడి. అయినా కాకపోయినా అనగా సెకండరీగ్రేడు అయినప్పటికీ రు. 15 ల డ్యూటీ అలవెన్సు ప్రతినెల ఇవ్వవలెనన్న ప్రభుత్వ ఉత్తర్వును అన్నిసమితుల బి.డి.ఓ. లు అనుసరించే సర్క్యులర్ తీసుకోవాలని డి. ఇ. ఓ ను అభ్యర్థించింది.

1964 పంచాయతీ ఎన్నికల్లో నిర్వహణోద్యోగులుగా పాల్గొన్నందుకుగాను, వారు అనుభవించవలసియుండి పోయిన సెలవు కాలపు దినాలను వారి క్రెడిట్ క్రింద ఎరండ్‌లీవ్‌ను సర్వీసు రిజిష్టరులో నమోదు చేయవలయునన్న ప్రభుత్వపు ఉత్తర్వును వెంటనే అమలు జరుపవలయునని అన్ని సమితుల బి. డి. ఓ లను జిల్లా పరిషత్తును ఈ కౌన్సిలు కోరింది.

టీచర్ల మరణానంతరము కనీసము 10 సంవత్సరాలవరకు కుటుంబ పెన్షన్ యిచ్చే పథకమును అమలుపరచాలని ప్రస్తుతమిస్తున్న పెన్షనుకు డి. ఎ. కలుపవలెనని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ఎఫిషియన్సీబార్ అన్న క్రొత్త సూత్రాన్ని ప్రవేశపెట్టాలని సిఫారసు చేసిన పేకమిషన్ నివేదికను నిరసిస్తూ యీ నివేదికను తిరస్కరించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్న రాష్ట్ర ఫెడరేషన్ సూచనను ఈ కౌన్సిలు బలపరుస్తూ యుంది.

10% కోత క్రింద ఏ ఒక్క టీచరును గూడ రిట్రెంచ్ చేయరాదని స్పష్టమైన ఉత్తర్వును అమలు జరిపించుటకు కార్యకర్తలను యీ కౌన్సిల్ అభ్యర్థిస్తూ యున్నది.

ఎంతో కాలము నుంచి ఉపాధ్యాయ వృత్తిలోనుండి అకస్మికముగా మరణించిన బి. అంకోజిరావు కుటుంబమునకు ఈ కౌన్సిల్ సంతాపమును తెలియజేయుచున్నది.

ఉపాధ్యాయులకు గూడ గృహవసతి ఏర్పాటు చేయవలయునని ప్రభుత్వమును యీ కౌన్సిలు అభ్యర్థిస్తూ యున్నది.

స్టేటు గ్రాంట్ క్రింద, నంద్యాల కర్నూలు, ద్రోణాచలం సమితుల అధికారులు ఐచ్చికం పేర ఉపాధ్యాయులనుండి ఏ సొమ్ము కూడా లేకుండా వసూలుచేయుచున్నారని ఈ కౌన్సిలు దృష్టికివచ్చినది. ఈవిధమైన వసూళ్ళను ఆపు చేయించాలని, ఆ యా సమితుల బి. డి. ఓ. లను ఈ కౌన్సిలు కోరుచున్నది.

నిరుపయోగమైన పేకమిషన్ రిపోర్టును తిరస్కరించాలి

కృష్ణా జిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ కౌన్సిల్ తీర్మానం

తేలప్రోలు, ఆగస్టు 31

“రెండు సంవత్సరముల 107 రోజులు పరిశ్రమించి తయారు చేయబడిన శ్రీ యస్. డి. కృష్ణారావు పే కమిషన్ నివేదిక రాష్ట్రములోని సామాన్య ఉద్యోగికి యెట్టి ప్రయోజనం కలిగించని విధంగా తయారు చేయబడిందని యీ సిఫారసులను జాగ్రత్తగా పరిశీలించిన పిదప యీ కౌన్సిలు అభిప్రాయ పడుతుంది. నిరుపయోగముగా తయారు చేయబడిన యీ రిపోర్టు అంగీకరించదగినది కాదని అందువలన మొత్తం రిపోర్టును యీ కౌన్సిలు తిరస్కరిస్తూంది. ఈ రిపోర్టును ప్రభుత్వం గూడా అంగీకరించరాదని, త్రోసిపేయాలని యీ కౌన్సిలు ప్రభుత్వాన్ని కోరుతూంది. ఈ కమిషన్ సిఫారసుచేసిన వేతనముల స్కేళ్ళస్థానంలో కొఠారి కమిషను సిఫారసు చేసిన వేతనముల స్కేళ్ళు ఉపాధ్యాయ ఫెడరేషన్ సవరణలతో అమలు జరపాలని యీ కౌన్సిలు ప్రభుత్వాన్ని కోరుతూంది” అని యీనెల 26, 27 తేదీలలో విజయవాడ ప్రదేశ్ ఫెడరేషను ఆఫీసులో జరిగిన కృష్ణా జిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ నూతన కౌన్సిలు సమావేశంలో యేకగ్రీవముగా తీర్మానించింది. సమావేశమునకు జిల్లాసంఘాధ్యక్షులు శ్రీ భీమాలసంజీవి అధ్యక్షత వహించారు, ప్రదేశ్ ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ వెన్నుపాటి లక్ష్మయ్య సమావేశాన్ని ప్రారంభించారు.

ఏ పరిస్థితులలోను విద్యారంగంలో రిట్రెంచిమెంటును తీసుకొనిరా రాదనియును రిట్రెంచిమెంటు ఆర్డరును ఉపసంహరించి ఉపాధ్యాయ-విద్యార్థుల నిష్పత్తి, సరాసరి వరుసగా 25, 20 గా మార్పుచేస్తూ తగు ఉత్తర్వులు జారీ చేయాలని మరియొక తీర్మానము గూడా సభలో ప్రతిపాదించి ఏకగ్రీవముగా సభ్యులు ఆమోదించారు. అంతేగాక సెప్టెంబరు 11 న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసనగా చేస్తున్న దేశవ్యాపిత సమ్మెను బలపరుస్తూ, తన సంఘీభావాన్ని వ్యక్తపరుస్తూ మరొక తీర్మానమును యీ కౌన్సిలు యేకగ్రీవముగా ఆమోదించింది.

ముస్లిం పాఠశాలలకు వారాంతపు సెలవు ఆదివారము గాకుండా, సాంప్రదాయకంగా వస్తున్న “శుక్రవారమునే” వుంచాలని, అప్పర్ ప్రైమరీ పాఠశాలలలో స్పెషల్ ఫీజులు వసూలుచేయరాదని, అక్రమ బదిలీలు చేసిన, చేస్తున్న అధికార్లపై, మేనేజిమెంట్లపై చర్య తీసుకొని, వాటిని ఆపుచేయుటకు కృషి చేయాలని, ఉపాధ్యాయుల ఇష్టంతోనే తప్ప, ఇష్టం లేకుండా వారిని మరొక సమితికి బదిలీలు చేయకుండా ట్రాన్స్‌ఫర్ల నిబంధనలకుసవరణ తయారు జారీచేయాలని ఎట్టి పరిస్థితులలోను, పంచాయితీ సమితి అధ్యక్షులకు తిరిగి, ఒక సమితినుండి మరొక సమితికి ట్రాన్స్‌ఫరు చేసే, అధికారమును దఖలుపర్చరాదని, ఉపాధ్యాయ సంఘాలు సూచించిన సవరణలతో కొఠారి కమిషన్ సిఫారసులన్నిటిని అమలు జరుపాలని, జిల్లాపరిషత్, పంచాయితీ సమితుల మేనేజిమెంట్ల నుండి పాఠశాలల పరిపాలనను తప్పించి, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖాధికారుల సమాన ప్రతినిధులతోగూడిన త్రివిధ కమిటీలకు యీ బడిపాలన అప్పగించుటకు తగు ఉత్తర్వులు జారీచేయాలనే తీర్మానములు గూడా చర్చానంతరం యీ కౌన్సిలు యేకగ్రీవముగా ఆమోదించింది.

అక్టోబరు నెల నుండి 1967 ఆగస్టు నెల వరకుగల కాలమునకు సంబంధించిన యీ జిల్లా సంఘ కృషిని వివరిస్తూ కార్యదర్శి నివేదికను సభలో ప్రవేశపెట్టారు.

సమావేశ చివరకు జరిగిన జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నికలలో జిల్లా సంఘానికి 21 మంది కార్యవర్గ సభ్యులు యేకగ్రీవముగా ఎన్నుకోబడ్డారు. అందులో శ్రీ కొండపాటి డేవిడ్ అధ్యక్షులు గాను, శ్రీయుతులు నలమోలు కోటయ్య కె, వ్యక్తి ఉపాధ్యక్షులు గాను, శ్రీ నాదెళ్ళ సీతారామారావు ప్రధాన కార్యదర్శిగాను, శ్రీయుతులు దాసరి రామయ్య, గణేశం, నాగేశ్వరరావు సహాయ కార్యదర్శులు గాను, మెంబర్లు కోశాధికారి గాను, ప్రదేశ్ ఫెడరేషను కౌన్సిలునకు శ్రీ కొండపాటి డేవిడ్, శ్రీ దాసరి రామయ్య, జనాబ్ సయ్యద్ సాహెబ్, శ్రీ కొఠారి ఆదిశేషయ్య యేకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

భీమవరం కళాశాల హాస్టలు ప్రారంభం

భీమవరం, ఆగస్టు 13

పశ్చిమగోదావరిజిల్లా భీమవరంలో శ్రీ దండు నారాయణరాజు కాలేజీ హాస్టలును ఈనెల 27 న శ్రీ టి. వి. రాఘవులు (సహాయ మంత్రి) ప్రారంభోత్సవం చేసినారు, సభకు కాలేజీ కమిటీ కరస్పాండెంట్ - శ్రీ గాదిరాజు జగన్నాథరాజు అధ్యక్షత వహించారు.

రాజమండ్రిని యాత్రా కేంద్రంగా అభివృద్ధి చేయాలి

హోటల్ యజమానుల సంఘం డిమాండ్

రాజమండ్రి, ఆగస్టు 28

రాజమండ్రి హోటల్ అసోసియేషన్ 10 వ వార్షిక సభ ఇటీవల హోటల్ అప్సర ఆడిటోరియంలో ప్రదేశ్ హోటల్ యజమానుల సంఘాధ్యక్షులు శ్రీ ఎస్. షెట్టిన్నయ్య అధ్యక్షతను జరిగింది.

పట్టణ హోటల్ యజమానుల సంఘాధ్యక్షులు శ్రీ వి. అప్పారావు స్వాగతం చెపుతూ, రాజమండ్రి పట్టణాన్ని టూరిస్టు సెంటరుగా ప్రభుత్వం అభివృద్ధి చేయాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ సమాచార, కార్మిక శాఖా మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ హోటల్ యజమానుల సంఘ చిహ్నాన్ని ఆవిష్కరించి సభను ప్రారంభించారు.

సంఘ కార్యదర్శి శ్రీ ఆర్. ఎస్. వలం కార్యదర్శి నివేదికను సమర్పించారు.

శ్రీ యస్. యస్. బాల పట్టణ సంఘం తరఫున మంత్రికి మెమోరాండం సమర్పిస్తూ చిరకాలంగా జనాముఖ క్షేత్రమైన రాజమండ్రి పట్టణంలో పారిశ్రామిక అభివృద్ధి సంబంధించినటువంటి తీర్పులు, రైల్వే నిర్మాణం వగైరా సౌకర్యాలను కల్పించడంతో పాటు రాజమండ్రి పట్టణాన్ని వెంటనే టూరిస్టు సెంటరుగా కేంద్రం ప్రకటించేలా మంత్రి తగుచర్యలు తీసుకోవాలన్నారు.

మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ ప్రసంగిస్తూ విదేశీయులకి అందరికీ యాత్రా కేంద్రాలుగా నాగార్జున సాగర్, హైదరాబాదులను చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ పథకాన్ని కేంద్రం బలపరచిందని. ఇవిగాక శ్రీశైలం, విజయవాడలను కూడా యాత్రా కేంద్రాలుగా తయారు చేయాలంటే కేంద్రం అనుమతించలేదని, అయితే రాజమండ్రి లాంటి కేంద్రాలను యాత్రా కేంద్రాలుగా తయారు చేయగలమేమోననే విషయాన్ని పరిశీలన చేస్తామని, రాకపోకల జరుగా వున్నచోట హోటల్ వ్యాపారం బాగా పెరుగుతుందని, అనేక హోటళ్ళలో ధరలు పెంచటానికి వీలు లేకపోతే సరుకుల సైజు తగ్గించటానికి వెనుదీయటం లేదని, ధరలు ఎక్కువైనాయనే ఆందోళనే కాని సైజు తగ్గిందనే ఆందోళన ఇంకా రాలేదని, ఎన్ని యిబ్బందులు వచ్చినా హోటల్ వ్యాపారం పెరుగుతూనే వుందని హోటల్ వారు సరుకుల ధరలు తగ్గాలని, వగైరా ఇబ్బందులుంటే నీతమైన పనులతో హోటళ్ళలో అమలుచేయడం జరుగుతున్నదని. వస్తువులు అందించేవారు వంట చేసే వారు వారిజీతాలు పెంచాలనే ఆందోళన చేస్తున్నారని, యజమానులు, పనివారు, ప్రజల మధ్య సత్సంబంధాలు వుండాలని అన్నారు.

శ్రీయుతులు వి. సుందరరావు రాష్ట్ర కార్యదర్శి ఎం. నాగభూషణం రాష్ట్ర సంఘ లీగల్ అడ్వైజరు కూడా సభలో ప్రసంగించారు.

శ్రీ ఏలూరి సూర్యారావు వందన సమర్పణ చేశారు.

బి. టి. సత్యవతి సభానంతరం భరత నాట్య ప్రదర్శన చేసింది. (వి. వి.)

లేఖలు



వృత్తి కోల్పోయిన స్వర్ణకారుల బిడ్డలకు విద్యా సౌకర్యం

ఆర్యా,

స్వర్ణనియంత్రణను ప్రభుత్వంగవర్నమెంటు వారు కొన్ని మార్పులను చేస్తున్నను పోయిన సంవత్సరం స్వర్ణకారోద్యమం వలన కలుగజేసెను. ఆయా నిబంధనల సడలింపుల వలన స్వర్ణకారులకు, వారి నిత్యజీవనానికి తగిన వనరులు కలుగలేదు. నిత్యము నిత్య జీవితము దుర్భరముగా గడుపుకొనుచూ పొట్ట నింపుకొనుచున్న, వృత్తిని కోల్పోయిన స్వర్ణకారులు, తమ బిడ్డలను ఏదో విధముగా విద్యావంతులను చేసికొనుటకు విద్యాలయములకు పంపుచున్నారు, కాని వారి బిడ్డలకు ఈ సంవత్సరము నుండి వివిధ జీతముల మినహాయింపుల ప్రభుత్వము వారు మంజూరు చేయలేదు. మంజూరు అయినట్లుగ ఏ విద్యాసంస్థలకును తెలుపలేదు. అందుచేత విద్యాసంస్థల అధికారులు, స్వర్ణకారులపిల్లలను విద్యాలయములలో జీతములు కట్టండనుచున్నారు. అంతేగాక స్వర్ణ నిబంధనల సడలింపు దృష్టియందుంచుకొని ఈ సంవత్సరమునుంచి ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలలో ఇదివరకున్న స్వర్ణకారుల బిడ్డలకు రిజర్వుడు సీట్లను తొలగించారు.

స్వర్ణకార వృత్తిని స్వేచ్ఛగా చేసుకొనుటకుగాని, వారి జీవనోపాధిని నిరాటంకముగా గడుపుకొనుటకుగాని వీలులేని నిబంధనల సడలింపులను ఆధారముగా గైకొని స్వర్ణకారుల బిడ్డలకు విద్యాలయములయందు జీతముల మినహాయింపులను మంజూరు చేయకపోవటమున్నను, సాంకేతిక విద్యా శాఖలలో రిజర్వుడ్ సీట్లను రద్దుపరచుటవలనను వారి బిడ్డల విద్యాభివృద్ధి కుంటుపడుచున్నదనుటకు యెంత మాత్రమును సందేహములేదు.

అందువలన ప్రభుత్వమువారు ఈ విషయమును అత్యవసర విషయముగా గైకొని, ఆర్థికముగా మిక్కిలి వెనుకబడియుండి అనేక ఇబ్బందులకు గురియగుచు, స్వర్ణనియంత్రణ వలన వృత్తిని కోల్పోయిన స్వర్ణకారుల బిడ్డలకు, లోగడ మాదిరిగనే విద్యాలయములయందు ట్యూషన్ ఫీజు మినహాయింపులను, సాంకేతిక విద్యా శాఖలలో రిజర్వుడ్ సీట్లను, ఆర్డర్లను మంజూరుచేసి వెంటనే విద్యాలయాధికారులకు పంపి, వారి విద్యాభివృద్ధికి తగినన్ని వనరులు కల్పించవలసినదిగా కోరుచున్నాను,

ఆర్. యోగయ్య,
ఒంగోలు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రభుత్వం చర్యలు

ఆర్యా,

గవర్నమెంటువారు కొత్తగా ప్యాసు చేసిన లేబరు యాక్టు ప్రకారము ఆదివారము రోజున మొత్తం వ్యాపార సంస్థలు సెలవు దినముగా ప్రకటన చేసిన విషయము అందరికి తెలిసినదే. ఏరోజు కారోజున వస్తువులు కొనుక్కొని జీవించు సాధారణ ప్రజలు, ఇతర ఉద్యోగులకు అందరకు ఆదివారమే సెలవు కనుక తీరుబడిగా వస్తువులు కొనుక్కొనుటకు వీలులేదు. ముఖ్యముగా సుస్తీచేసిన వారికి మందులు కావలసిన దొరకక ఏ విధముగా ఆ ప్రాణికి ఎంత నష్టము కలుగుతుందో చెప్పనవసరంలేదు. ఈలాంటి అవకతవక లేబరు యాక్టు ప్యాసుచేసి ప్రజలను ఇబ్బందిచేయుట గర్హనీయం. ఇంతకు ముందు ప్రతి యజమాని వారంలో ఏదోఒక రోజున షాపులను సెలవు దినముగా ప్రకటించి యున్నందువలన ప్రభుత్వంవారికి వచ్చిన నష్టమేమిటో తెలియుటలేదు. ప్రజలూ వర్తకులూ ఇబ్బంది పెట్టే ఈ లేబరు చట్టమును తిరిగి పరిశీలించి లోగడ మాదిరిగా ఉంచవలసినదిగా ప్రభుత్వమువారిని కోరుతున్నాను. లేనిచో ఆదివారంరోజున కొన్ని దుకాణములు, బుధవారంరోజున కొన్ని దుకాణములు తెరుచుకొని వ్యాపారము జరుగుటకు అయినా సరే. ప్రభుత్వమువారు మార్పు చేసిన యెడల ఇటు ప్రజలకు, వ్యాపార రంగమునకు ఎంతో మేలు చేసినవారగుదురని తెలియజేస్తున్నాను.

వి. రాఘవరావు, కార్యదర్శి
ఫ్యాన్సీ, స్టేషనరీ, జనరల్ మర్చంట్స్
అసోసియేషన్, గుంటూరు.

సాలూరునుండి అనకాపల్లి మీదుగా విశాఖకు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలి

ఆర్యా,

శ్రీకాకుళంజిల్లా సాలూరుపట్టణము 35000 జనాభాగల మంచి వ్యాపారస్థలం. ఇక్కడ నుండి అనేకమంది విశాఖపట్నం అనకాపల్లి ఆపై పట్టణాలకు ప్రయాణం చేయుటం నాటికి ఎక్కువయింది. ఇంకా (ఒరిస్సా) కోరాపుట్ జిల్లా అయిన సునాబెడ హిందూస్తాన్ ఏరోనాటిక్ ప్రాజెక్ట్ నుండి అనేకమంది ప్రయాణీకులు విశాఖపట్నం అనకాపల్లి ఆపైకిపోవు మీదుగా వెళ్ళుట ఎక్కువయింది.

సాలూరు నుంచి విశాఖపట్నం, అనకాపల్లి ఆపైకి సరాసరి వెళ్ళ రైళ్ళు, బస్సులు లేక ప్రయాణీకులు చాలా అవస్థపడుచున్నారు. సాలూరు నుంచి విశాఖపట్నం అనకాపల్లి వెళ్ళే ప్రయాణీకులు విజయనగరం వరకు ఒక బస్సులో వెళ్ళి విజయనగరంలో తిరిగివేరేబస్సులోకి మారాలి. అప్పటునుంచివెళ్ళే బస్సులు ఖాళీలేకో, టిక్కట్లు దొరక్కో ప్రయాణీకులునిత్యంబస్‌స్టాండు గోడీకాపులు కాస్తూ అనేక కష్టనష్టాలకు గురికాబడుచున్నారు. సరికదా రైలులు వెళదామనుకుంటే రైలు సాలూరునుంచి బొబ్బిలివరకే వున్నది. అక్కడనుంచితిరిగి వేరే రైలు ఎక్కాల్సి ఉంటుంది. సరాసరి బస్సు లేనందున పై ఇబ్బందుల వలన ప్రయాణం చేయుచున్న ఒంటరిస్త్రీలు, వృద్ధులు, పిల్లలతో వెళ్ళేవాళ్ళు, విశాఖపట్నంపైగా పోవలసిన మధ్య స్టేషన్లలో పడికాపులుకాని, నానా కష్టనష్టములకు గురికాబడుట సంభవించుచున్నది. సరాసరి రైలుబండి సౌకర్యములు ఉన్న పార్వతీపురం, బొబ్బిలినుంచి విశాఖపట్నం, కాకినాడ ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుచున్నారు. కాని ప్రయాణీకులకు సరియైన రవాణా సౌకర్యములు లేని సాలూరు నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎందుకు నడవలేదో ఆశ్చర్యముగా ఉన్నది. స్థానిక బస్సుల యజమానుల వత్తిడివలన ఇక్కడనుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులు నడవలేదని ఇక్కడి కొంతమంది భావించుచున్నారు. కాబట్టి ప్రజలలో అటువంటి అపోహలకు తావివ్వకుండా వెంటనే సాలూరు నుంచి, అనకాపల్లిమీదుగా విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలి. లేదా పాచిపెంట నుంచి విశాఖపట్నం వరకు అయినా ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపిన మంచిదని కోరుచున్నాను.

ఇట్లు
యం. యర్రన్న, సాలూరు.

ఎస్. పి. యింటిముందు పోలీసు అఘాయిత్యం

ఆర్యా!

ఖమ్మం శ్రీనివాస్ ఫోటోస్టూడియోలో అసిస్టెంటుగా పనిచేస్తున్న శ్రీ యాసా కృష్ణమూర్తి ఈ నెల 23 వ తేదీన సైకిల్ పైన ఎస్. పి. యింటిముందు నుండి వెళ్తుండగా అక్కడవున్న పోలీస్ కానిస్టేబుల్ వీరి సైకిలును ఆపి “నీవు ఎస్. పి. దొరగారి యింటిపైపు ఎందుకు పోతావు? అంతకో సరాకి” యని బూతులు తిడుతూ విపరీతంగా కొట్టాడు. ఈ అఘాయిత్యాన్ని త్రోవ పోయే ప్రజలు చూసి నిరసించారు.

తనకు జరిగిన ఈ అఘాయిత్యాన్ని గురించి శ్రీ కృష్ణమూర్తి స్థానిక పోలీసు అధికారులకు, ఐ. జి. హోంమినిస్టరుకు ఫిర్యాదులు పంపుకున్నారు.

ఎస్. పి. యింటిముందు ఏకారణం లేకుండా పోలీసు కానిస్టేబుల్ జరిపిన ఈ అఘాయిత్యం గురించి పట్టణంలో ఆందోళన వ్యాపించినది.

ఇట్లు,
జి. రామనయ్య.

పశ్చిమ గోదావరి లైబ్రరీ ఉద్యోగుల సమావేశం

చింతలపూడి, ఆగస్టు 28

పశ్చిమగోదావరిజిల్లా లోకల్‌లైబ్రరీ అథారిటీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఇటీవల ఏలూరు పట్టణములో జిల్లా కేంద్ర గ్రంథాలయమువద్ద జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీ కార్యదర్శి శ్రీ వి. మనోరంజన్ రెడ్డి పర్యవేక్షణలో ప్రారంభించబడినది. సమావేశములో జిల్లాలోని అన్నితరగతుల గ్రంథాలయాధికారులు. గుమాస్తా, టైపిస్టులు. అటెండర్లు. బంట్రోతులు. డెలివరీ స్టేషను ఏజెంట్లు పాల్గొన్నారు. జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీ అధ్యక్షులు శ్రీ జవ్వాది లక్ష్మయ్యనాయుడు ప్రారంభోపన్యాసముతో సభ ప్రారంభమయినది.

పిమ్మట జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘమునకు అధ్యక్షులుగా కొవ్వూరు లైబ్రేరియన్ షేక్ లాల్ అహ్మద్, కార్యదర్శిగా జిల్లా కేంద్ర గ్రంథాలయాధికారిణి కుమారి వి. ఎస్. జి. ఐరియమ్మ, కోశాధికారిగా శ్రీ తోట శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవముగా ఎన్నుకొనినారు.

1. ఆంధ్రప్రదేశ్‌లోగల లోకల్‌లైబ్రరీ అథారిటీల యాజమాన్యమున పౌర గ్రంథాలయములలో పనిచేయు వివిధ తరగతుల సిబ్బందికంతటికి (అనగా జిల్లా కేంద్ర గ్రంథాలయాధికారుల స్థాయినుండి పరిగణించి. పెన్షను, ప్రావిడెంటుఫండు గ్రాట్యుటీ వైద్యసహాయం పిల్లలకు ఎడ్యుకేషనల్ మినహాయింపులు వగైరా అన్ని సౌకర్యములు కలుగ చేయుచున్నట్లు తగు ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా ప్రభుత్వమును కోరుతూ తీర్మానించటమైనది.

పై తీర్మానమును లోకల్ లైబ్రరీ అథారిటీ కమిటీ ఆమోదమునకు పెట్టవలసినదిగా జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీ కార్యదర్శిని కోరుతూ తీర్మానించారు.

డెలివరీ స్టేషను ఏజెంట్ల ఉద్యోగనిర్వహణకు అవసరమగు సౌకర్యములను కలిగించవలసినదిగా కోరారు. (వి.వి.)

చేనేత ఉద్యమానికి చేనేత కాంగ్రెస్ నాయకుల ద్రోహం

తూర్పు గోదావరిజిల్లా అఖిలపక్ష కార్యాచరణ కమిటీ కార్యదర్శి ఖండన

ద్రాక్షారామం, ఆగస్టు 31

ఆంధ్రలో చేనేత ఉద్యమానికి చేనేత కాంగ్రెస్ నాయకత్వం చేస్తున్న ద్రోహాన్ని నిరసిస్తూ తూర్పుగోదావరి జిల్లా అఖిల పక్ష కార్యాచరణ కమిటి కార్యదర్శి శ్రీ అల్లక తాతాచార్యులు ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు.

రేపల్లె చేనేత సత్యాగ్రహం అనేక ప్రాంతాలకు విస్తరించుచున్న ఉద్వేగ పరిణామంలో, చేనేత కాంగ్రెసు నాయకత్వం శ్రీ ప్రగడ కోటయ్య ద్వారా రేపల్లె చేనేత సత్యాగ్రహాన్ని విరమింపచేసి, తన సంకుచిత రాజకీయ పంథాను అనుసరించింది మరోవైపు, రాష్ట్ర వ్యాపిత సత్యాగ్రహ సన్నాహాలు నిర్మాణాత్మకంగా సమీక్షితం కానందున ఆయా సత్యాగ్రహ కేంద్రాలు తాత్కాలికంగా వాయిదా వేసుకున్నాయి. తిరిగి ప్రస్తుతం వివిధ జిల్లాల్లో సత్యాగ్రహ సమర సన్నాహాలు జరుగుతున్న వాతావరణం స్పష్టంగానే కనుపిస్తోంది.

ఈ దశలో చేనేత కాంగ్రెసునాయకత్వం మరోసారి చేనేత ఉద్యమానికి వెన్నుపోటు పొడిచి సత్యాగ్రహాన్ని వాయిదా వేసినట్టు ప్రకటించింది. ఈ ప్రకటనలోని అంతర్యాన్ని పరిశీలిస్తే చేనేత ఉద్యమ ద్రోహులుగా వీరి పాత్ర నగ్నంగా వెల్లడి కాగలదు.

రేపల్లె సత్యాగ్రహం లక్ష్యం రాష్ట్రవ్యాపిత (రిబేటు) ప్రయోజనాలను సాధించడమే తక్షణ కర్తవ్యంగానూ, చేనేతకు సుస్థిర రక్షణ కల్పించక తప్పదనే కాంక్షను ప్రస్ఫుటం చేసేదిగానూ వుంది ఈ ద్విముఖ లక్ష్య సాధన పోరాటాన్ని ఏదో విధంగా అణచివేయాలని ప్రభుత్వం భావించింది. ఈ అభిప్రాయానికి ఎరోక్కంగా తమ రాజకీయ క్రమశిక్షణకు (కాంగ్రెసు హైకమాండుకు) తలవంచి రేపల్లె ప్రాంతానికి తాత్కాలిక సదుపాయాలు కల్పించే వాగ్దానాలు అధికార్లచే చేయించడం ద్వారా ఆ సత్యాగ్రహాన్ని విరమింపచేయుటానికి చేనేత కాంగ్రెసు నాయకులు ఢిల్లీనుంచి హైదరాబాద్ వరకూ ఎంతగానో సాగించి చివరకు సఫలీకృతులయ్యారు.

ఇందువల్ల ఈ నాయకత్వం పై ఆరిని ఆంధ్ర ప్రదేశ్ చేనేత ఉద్యమం సహజం గానే తీవ్రంగా విమర్శించింది. ఈ నిరసనను గమనించిన చేనేత కాంగ్రెసు నాయకత్వం తిరిగి తన యధాస్థానాన్ని నిల్పుకోవడానికి ఎత్తుగడగా సెప్టెంబరు 2 వ తేదీ నుంచి ప్రభుత్వ కార్యాలయాలవద్ద చేనేత కాంగ్రెసు పికెటింగు చేయవలయునున్నట్లు, ఆగస్టు 19 వ తేదీన బెంగుళూరులో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం చేనేత సమస్యల పరిష్కారానికి దోహదం కల్పించని యెడల తమ పికెటింగ్ తప్పనట్లు చేనేత ఉద్యమానికి హామీగా ప్రకటించారు.

ఇందుకు అనుగుణ్యంగానే, ఆంధ్ర ప్రదేశ్ చేనేత సంఘం - తూ॥గో॥జిల్లా అఖిలపక్ష చేనేత ఉద్యమ కమిటీ కూడా రాష్ట్ర వ్యాపిత సత్యాగ్రహోద్యమం సమిష్టి కార్యాచరణ ద్వారా దీర్ఘకాల పోరాటానికి సమాయత్తం కావాలనే అభిప్రాయాన్ని ప్రకటిస్తూ చేనేత కాంగ్రెసువారితో సహా అన్ని చేనేత పక్షాలూ సమైక్యం కావాలని, అందుకు ఐక్య కృషికి పూనుకున్నాయి.

ఈ కృషిలో ఎక్కడ చూసినా, అన్ని పక్షాలకుపైకి, కార్యాచరణ ఆవశ్యకతను ఉత్సాహంతో గుర్తిస్తున్న వాతావరణం కనుపిస్తోంది. కోనసీమ చేనేత కార్మికులలో వెల్లడైన ఉత్సాహం ఆ విషయాన్ని రుజువు చేసింది. అంతేగాకుండా: తూ॥ గో॥ జిల్లాలోనే చేనేత కాంగ్రెసు కార్యకర్తల ఐక్యతాభావం, సమిష్టి కార్యాచరణ వేదికపట్ల వ్యక్తపర్చుతను నిర్వహించగలవనే ఆశాభావం ద్యోతకమవుతున్నది. ఇట్టి ప్రోత్సాహకరంగా సత్యాగ్రహ సన్నాహక సందర్భం ప్రారంభమవుతున్న పరిస్థితుల్లోనే, చేనేత కాంగ్రెసు అగ్రనాయకులు శ్రీ ప్రగడ కోటయ్య పత్రికా ప్రకటన చేస్తూ, దక్షిణాది ముఖ్యమంత్రుల సమావేశం వాయిదా పడిన విషయాన్ని గమనించి, చేనేత సమస్యల పరిష్కారానికి సకల యత్నాలూ విఫలమైనందున సెప్టెంబరు 2 వ తేదీ నుంచి సత్యాగ్రహం తప్పదని విస్పష్టంగా ప్రకటించారు. కాని, రాష్ట్ర చేనేత కాంగ్రెస్ కార్యవర్గం సమావేశానికి ముందు రోజునే శ్రీ కోటయ్య చేసిన ప్రకటనకూ, సత్యాగ్రహం వాయిదావేసినటు కార్యవర్గం తరఫున తిరిగి తానే, ఆగస్టు 28 వ తేదీన చేసిన ప్రకటన పూర్తిగా విరుద్ధంగావుంది. పైగా దక్షిణాది ముఖ్యమంత్రుల సమావేశం వాయిదా పడటంవల్ల తమ సత్యాగ్రహాన్నికూడా వాయిదా వేసుకున్నారట! ఇది చాలా విడ్డూరంగావుంది. ఎందుచేతనంటే.

ముఖ్యమంత్రుల సమావేశం వాయిదాపడి, చేనేత కాంగ్రెసు సకల యత్నాలూ విఫలమైన తరువాతనే కదా సత్యాగ్రహం తప్పదని శ్రీ కోటయ్య ప్రకటన చేశారు! మరి ముఖ్యమంత్రుల సభ వాయిదాతో ప్రస్తుతం వారి సత్యాగ్రహ వాయిదాకు పొంతనలేదు కదా! ఇందువల్ల వారి రేపల్లె సత్యాగ్రహ విరమణ ప్రయత్నం తరువాత కాంగ్రెసు పార్టీ రాజకీయ కుంభకోణంతో తమనాయకుల పాత్ర మేరకు ఇపుడు మళ్ళీ సత్యాగ్రహాన్ని వాయిదావేసినట్లు సునాయాసనే ఊహించవచ్చు. లేకపోతే, చేనేత కాంగ్రెసు కార్యవర్గం తరఫున శ్రీ కోటయ్య విడుదలచేసిన ప్రకటనలో అంతకుముందే తాను చేసిన ప్రకటనకూ - కార్యవర్గ నిర్ణయానికి తనకు సంబంధం లేదనలేదుకదా! ఒకవేళ తన ప్రకటన ఊహాజనితమయినదైతే, కార్యవర్గ నిర్ణయంలో ఆ ప్రస్తావన ఎందుకు లేదు! పైగా - ముఖ్యమంత్రులు తిరిగి సమావేశమై ఏదో ఉపశమించనున్నట్లు చేనేత కార్మికులకు కార్యకర్తలకూ భ్రమలు కల్పించే క్రియాశూన్యతతో సత్యాగ్రహాన్ని వాయిదా వేయటాన్ని సమర్థించుకోవడమంటే ఉద్యమానికి వారి ద్రోహం బాహాటంగానే వెల్లడైంది. చేనేత ఉద్యమ చరిత్రలోనే ఈ చేనేత కాంగ్రెసు నాయకత్వం మొక్కుబడి. ఆర్థిక ప్రయోజనాల సమున్నతగల నిర్మాణవ్యవస్థలుగావున్న సహకారకేంద్రాలు (మార్కెటింగు.సేల్‌సొసైటీ) లో తమ అధికార పీఠాలను పదిల పర్చుకోవటం మేరకు సహకారోద్యమంలో వారి ఏజెంట్లను తయారు చేసుకుని మనగల్గుతున్నారనే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

అందుచేత: చేనేత కార్మికులూ - ఇంత వరకూ చేనేత కాంగ్రెసును అభిమానిస్తూ మోస్తున్న కార్యకర్తలూ, చేనేత కాంగ్రెసు నాయకత్వ ద్రోహాన్ని గమనించి. నిస్వార్థ - రాజకీయ విభేదాలకు అతీతంగా సమైక్యతను పటుతర మొనర్చి కొంత ఆలస్యమైనప్పటికీ, దీర్ఘకాల పోరాట సన్నాహాలకు ఉపక్రమించి, సత్యాగ్రహ సమరపీకను శకవం తీసుకుంటారని ఆశిస్తున్నాను, చేనేత కాంగ్రెసు నాయకులకు ఆర్థపరిశోధనలేదని - వారికి కావలసింది అధికారం - ఆర్థిక దుర్మోహం తప్ప మరో లక్ష్యం లేదని తేలిగా మెలగుదాం!

ఆళ్ళగడ్డలో బంకు వర్తకుల సంఘం ఏర్పాటు

ఆళ్ళగడ్డ, ఆగస్టు 30

కర్నూలుజిల్లా ఆళ్ళగడ్డలో ఈనెల 25న పట్టణ యువజన సంఘ కార్యదర్శి శ్రీ పి.ఎల్.వరదయ్య అధ్యక్షతన బంకు వర్తకుల సమావేశము జరిగెను. సమావేశానికి 70 మంది హాజరయ్యారు. బంకు వర్తకులు ఎదుర్కొంటున్న యిబ్బందులనుగూర్చి చర్చ జరిగిన అనంతరము 'బంకు వర్తకుల సంఘం ఆళ్ళగడ్డ' అను పేరుతో ఒక సంఘం స్థాపించుటకు నిర్ణయించడమైనది. 1967 వ సంవత్సరమునకు ఈ క్రింది సభ్యులతో కూడిన కమిటీ ఎన్నికయినది.

అధ్యక్షులు: శ్రీ కాము పోలు బాలవీరప్ప. ఉపాధ్యక్షులు: శ్రీ బాబుల్లా, కార్యదర్శి: శ్రీ పి. కృష్ణయ్య, కార్యవర్గసభ్యులు: శ్రీయుతులు ఎస్. నన్నేసాహెబ్, లింగమూర్తి, తురగల్లు పుల్లయ్య, కన్నా పాములేటి, కేశవర్లపల్లె బాలయ్య.

వ్యవసాయ వస్తువుల ధరలు

విజయవాడ, ఆగస్టు 31

విజయవాడ రీజనల్ అసిస్టెంటు మార్కెటింగ్ డైరెక్టరు నేను అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేసిన 31.8.67 నాటి టోకుధరలు (ఒక క్వింటాల్ 100 కిలో గ్రాములు లేక 220½ పౌనులు.)

		కొత్తవి	
ధాన్యం		75 కి.	100
సంబల్లు :	విజయవాడ రు.	37.13	49.50
కిచిడి :	కాకినాడ	37.13	49.50
జి ఇ.బి.24 :	చిత్తూరు	37.13	49.50
అక్కుళ్ళు :	విజయవాడ	31.13	41.50
„	తాడేపల్లిగూడెం	31.13	41.50
„	కాకినాడ	31.13	41.50
„	ఆముదాలవలస	31.13	41.50
సన్న కృష్ణకాటుకలు :			
	తాడేపల్లిగూడెం	34.13	45.50
„	కాకినాడ	34.13	45.50
సన్నాలు :	ఆముదాలవలస	31.13	45.50
మొలకొలుకులు :	నెల్లూరు	37.13	49.50
మిల్లు బియ్యం			100 కి.
జి. ఇ. బి. - 24			78.02
సంబల్లు :	విజయవాడ		78.02
కిచిడి :	కాకినాడ		78.02
అక్కుళ్ళు :	విజయవాడ కొత్తవి		66.50
„	తాడేపల్లి గూడెం		66.50
„	కాకినాడ		66.50
„	ఆముదాల వలస		66.50
సన్న కృష్ణకాటుకలు :			
„	తాడేపల్లిగూడెం		71.03
సంబల్లు :	చిత్తూరు		78.00
సన్నాలు :	ఆముదాలవలస		78.02
మొలకొలుకులు :	నెల్లూరు		78.02

వేరుశనగ

కాయలు	విజయవాడ	103.69
„	నంద్యాల	112.0
„	ఆదోని	
„	విజయనగరం	103.50
పప్పు	విజయవాడ	182.50
„	నంద్యాల	182.00
„	ఆదోని	145.00
„	విజయనగరం	144.00
నూనె	విజయవాడ	283.20
„	నంద్యాల	300.00
„	ఆదోని	275.00
„	విజయనగరం	298.00

అపరాలు

కందులు :	విజయవాడ	126.00
„	గుంటూరు	140.00
„	ఆముదాలవలస	178.00
మినుములు :	విజయవాడ	180.00
„	గుంటూరు	180.00
„	ఆముదాలవలస	170.00
„	విశాఖపట్నం	145.00
పెసలు	విజయవాడ	101.00
„	గుంటూరు	145.00
„	ఆముదాలవలస	130.00
శనగలు :	విజయవాడ	175.00
„	గుంటూరు	165.00
„	ఆముదాలవలస	130.00

ప్రత్తి

		పాతం	లక్ష్మి
పామ్మూరు	(ప్రత్తి)	218.00	185.00
ఆదోని	(ప్రత్తి)	152.00	186.0
„	(దూది)	365.00	411.00

చింతపండు

చిత్తూరు	1 వ రకం	300.00
	2 వ రకం	

జొన్నలు

అనంతపురం	తెల్లవి	58.50
నంద్యాల	పచ్చవి	51.50

బెల్లం

హిందూపురంలో	1 వ రకం	215.00
„	2 వ రకం	195.00
„	3 వ రకం	180.00
చిత్తూరులో	1 వ రకం	197.50
„	2 వ రకం	172.50
„	3 వ రకం	165.00
అనకాపల్లిలో	1 వ రకం	217.50
„	2 వ రకం	185.50
„	3 వ రకం	175.00
తాడేపల్లిగూడెం	1 వ రకం	204.00
	2 వ రకం	180.00

జీడిపప్పు

వేటపాలెం	అమెరికన్ రకం	860.84
„	ఇండియన్	790.90
„	బద్దలు	750.00
„	ముక్కలు	613.44

మిర్చి

జి. 2. ఒకటవ రకం గుంటూరు	265.00
జి. రెండవ రకం „	230.00
జి. 2వ రకం 2. చర్త	300.00
హిందూపురం 1 వ రకం	325.0
2 వ రకం	330.00

నెయ్యి

	వల్లారు	రేకలా
గుంటూరు	970.00	1060.00
ఒంగోలు	900.00	

కొబ్బరికాయలు

(వెయ్యింటికి ధరలు)	కొత్తవి :	పాతవి
విజయవాడ :	390.00	430.00
రాజమండ్రి	400.00	375.00
పాలకొల్లు :	370.00	390.00

పసుపు

దుగ్గిరాలలో.	కొమ్ములు	198.75
„	కాప్పురు	223.00
„	దుంపలు	198.00
కడపలో.	కొమ్ములు	213.00
„	దుంపలు	228.00

జనపనార

విజయనగరం :	మొదటి రకం	92.43
	రెండవ రకం	86.08
	మూడవ రకం	83.06
ఆముదాలవలసలో :		
	మొదటి రకం	88.33
	రెండవ రకం	87.34
	మూడవ రకం	80.00

విజయవాడ థర్మల్ పవర్ హౌస్‌లో 26 మంది కార్మికులకు ఉద్వాసన

బోర్డు నిరంకుశ విధానాన్ని ఎదుర్కోవాలని యూనియన్ అధ్యక్షుని విజ్ఞప్తి

విజయవాడ ఆగస్టు 31

ప్రభుత్వ విద్యుచ్ఛక్తి శాఖకు చెందిన విజయవాడ థర్మల్ పవర్‌హౌస్‌లో అనేక సంవత్సరాల నుండి పనిచేయుచున్న 26 మంది కార్మికులను పనులనుండి తొలగిస్తూ ఒక మాసం నోటీసు జారీచేశారు ఇందులో 6 నుండి 11 సం॥ వరకు సర్వీసు గల కార్మికులున్నారు.

ఆంధ్ర రాష్ట్ర విద్యుచ్ఛక్తి పనివారల సంఘం, కృష్ణాజిల్లా అధ్యక్షులు శ్రీ ఎం. వి. సుబ్బయ్య ఇంకా ఇలా ప్రకటిస్తున్నారు:

వీరితోపాటు ఇంకా కొందరిని నిరుద్యోగం పాల్జేసేందుకు ఈ మాదిరి నోటీసులు తయారు చేస్తున్నది. 6 సం॥ నుండి 25 సం॥ వరకు సర్వీసు కలిగిన కార్మికులను రిట్రెంచిమెంటు మహామారికి గురిచేయాలని బోర్డువారు నిర్ణయించుకున్నారు. ఇది చాలా అన్యాయం, అక్రమం.

1966 మే, జూన్ మాసాలలో జారీ చేసిన ఉత్తర్వులపైన 5 సం॥ ల సర్వీసుగల కార్మికులకు రిట్రెంచిమెంటు నుండి భద్రత కలిగించబడింది.

అయితే బోర్డువారు ప్రభుత్వ ఉత్తర్వును, తమ ఉత్తర్వును కూడా లక్ష్యపెట్టకుండా కార్మికులకు పూర్తిగా హానిచేయ సంకల్పించారు.

చాలీ చాలని వేతనాలతో బాధపడుతున్న ఈ పరిస్థితులలో కార్మికులను నిరుద్యోగం పాల్జేయజూస్తున్న బోర్డు నిరంకుశ విధానాన్ని కార్మిక సోదరులందరూ ఎదుర్కొనవలసిందిగా ఆయన విజ్ఞప్తిచేశారు.

స్టేట్ బ్యాంక్ సూపర్‌వైజర్ల మూకుమ్మడి సెలవు

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, సెప్టెంబరు 1

పని గంటలను నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ నేడిక్కడ స్టేట్ బ్యాంకు సూపర్వయిజరీ సిబ్బంది సామూహికంగా క్యాజువల్ సెలవు దినాన్ని పాటించారు.

అఖిల భారత స్టేట్‌బ్యాంకు సూపర్వయిజరీ స్టాఫ్ అసోషియేషన్ యిచ్చిన పిలుపు ననుసరించి విజయవాడలోని సూపర్వయిజరీ సిబ్బంది క్యాజువల్ సెలవుపెట్టి తమ పనులు మానివేశారు.

సూపర్వయిజరీ సిబ్బందికి చెందిన బ్యాంకు ఏజంటు, హెడ్‌కాషియర్, అకౌంటెంటులు తప్ప మిగతా 25 మంది పనులు మానివేశారు. పై ముగ్గురికి సెలవుపెట్టవద్దని అసోషియేషన్ మినహాయించింది.

కరువు భత్యాన్ని జీవనవ్యయసూచీతో కలపాలని, స్టేట్ బ్యాంకులలో ఇతర ఉద్యోగులకు యిస్తున్నమాదిరిగానే బోనసు యివ్వాలని, డిసెంబరు 31 న, మార్చి 31 న క్లోజింగు అలవెన్సు యిచ్చే పద్ధతిని నెలకొల్పాలని సూపర్వయిజరీ ఉద్యోగులు కోరుతున్నారు.

సూపర్వయిజరీ ఉద్యోగికన్నా 3వ తరగతి ఉద్యోగికి ముట్టే మొత్తాలు ఎక్కువగా ఉన్నాయని, అందువలన తమ వేతనాలను పునర్వ్యవస్థీకరించాలని కూడా ఈ ఉద్యోగులు కోరుతున్నారు.

బ్యాంకు మేనేజిమెంటు తమ సమస్యలను పరిష్కరించని ఎడల అక్టోబరు 3వ తేదీన సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఆ సమ్మెలో ఏజంటు, హెడ్ కాషియర్, అకౌంటెంటు కూడ చేరుతారని అసోసియేషన్ ప్రతినిధి ఒకరు తెలియజేశారు.

మహారాష్ట్రలో సినిమాలు బంద్

వినోదపుపన్ను పెంపుకు అసమ్మతిగా

బొంబాయి, ఆగస్టు 3

రాష్ట్ర ప్రభుత్వం వినోదం పన్నును పెంచినందుకు నిరసనగా రేపటి నుండి బొంబాయి నగరంతో సహా యావత్ మహారాష్ట్రలోని సినిమా హాళ్ళను మూసివేస్తున్నారు

బొంబాయి నగరంలోని 82 తో సహా మహారాష్ట్రలో మొత్తం 726 సినిమా హాళ్ళు వున్నాయి

రాష్ట్ర ప్రభుత్వ చిత్రపరిశ్రమ, కేంద్ర సమాచార ప్రసార మంత్రితోజరిపిన చర్చలు విఫలమయిన ఫలితంగా చిత్ర ప్రదర్శకులు నిర్వహిస్తున్న ఈ సమ్మె కార్యరూపం ధరించింది.

పెంపుచేసిన వినోదపుపన్నును 6 మాసాలపాటు చెల్లించనివ్వాలని ప్రభుత్వం కోరింది. అయినా మొత్తం చిత్రపరిశ్రమ సర్వనాశనమయ్యేందుకే దారితీస్తుందని ఆ ప్రతిపాదనను చిత్రప్రదర్శకులు త్రోసిపుచ్చారు.

బీహార్ వరదల మూలంగా 9 లక్షల మందికి నిర్వాసం

90 లక్షల రూపాయల పంట నష్టం

భాగల్పూర్, ఆగస్టు 30

బీహార్ రాష్ట్రంలోని పూర్నియా, సహర్సా, మోంఘిర్ జిల్లాలలో ఈ సంవత్సరం వరదల మూలంగా 1426 గ్రామాలకు చెందిన 9 లక్షల ప్రజలు నిర్వాసితులయ్యారు.

ఈ విషయం భాగల్పూర్ డివిజనల్ కార్యాలయానికి అందిన అధికార ప్రకటనల మూలంగా తెలుస్తోంది.

సాగుచేసిన 60 వేల ఎకరాల జొన్న పంట దెబ్బతిన్నది.

వరదలు అతి ఉధృతంగా ఉన్న పూర్నియా జిల్లాలో 1126 గృహాలు నాశనం కావటమో లేక దెబ్బతినటమో జరిగింది. ఒక్క పూర్నియా జిల్లాలోనే పంటకు నష్టం 90 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా.

మిగతా జిల్లాలలోని పంట నష్టం ఎంతో వివరాలు అందలేదు. నిర్వాసితులకు పూర్నియా జిల్లాలో 102, మోంఘిర్ జిల్లాలో 133 సహాయక శిబిరాలు ఏర్పాటుచేశారు.

భోపాల్‌లో వర్షాలు

భోపాల్, ఆగస్టు 31

భోపాల్‌లో వర్షాలు ఉధృతంగా పడటం మూలంగా రవాణాకు ఇబ్బంది కల్గింది. పట్టణంలో టెలికమ్యూనికేషన్, టెలిఫోన్ సౌకర్యాలకు అంతరాయం కల్గింది.

పదునాలుగు గంటలపాటు కురిసిన వర్షం ఫలితంగా పట్టణంలోని పల్లపు ప్రాంతాలు మునిగిపోయాయి. ఇండూర్ సాగర్, రేవాల నుంచి రావల్సిన బస్సులు ఆగిపోయాయి. ఐనా పట్టణ మంచినీటి పథకాలకు ఈ పడిన వర్షం చాలదని తెలుస్తోంది.

అశోకా హోటల్ నిర్వహణ లోపాలు

విచారణకు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 31

పార్లమెంటు సభ్యుడు శ్రీ ఎ. కె. గోపాలన్ నాయకత్వాన అశోకాహోటల్స్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎ. ఐ. టి. యు. సి.) ప్రతినిధివర్గం ఒకటి వర్క్స్, హౌసింగ్ వ్యవహారాల మంత్రి శ్రీ జగన్నాథరావును ఈ రోజు కలుసుకొని ఒక నివేదిక సమర్పించారు. అందులో అశోకా హోటల్ వ్యవహారాల్ని గురించి దర్యాప్తు జరిపించవలసిందిగా కోరారు.

ఈ ప్రతినిధివర్గంలో అశోకా హోటల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎమ్. ఎమ్ గోపె, సహాయ కార్యదర్శులు శ్రీ వి. వి. వి. రావు, శ్రీ సురేందర్ దాలి, ఎ. ఐ. టి. యు. సి కార్యదర్శి శ్రీ ఎం అచ్యుతన్‌లు వున్నారు.

యాజమాన్యంలో గల కొన్ని శక్తులు కొన్ని ప్రైవేట్ హోటళ్ళ యజమానులతో లాలూచీపడి ప్రభుత్వ యాజమాన్యంలోగల అశోకా హోటల్ వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నాయని వారు మంత్రితో జరిగిన సంభాషణలో తెలియజేశారు. పై శక్తులను, వారు చేస్తున్న అక్రమాలను బహిరంగ పర్చటంలో నాయకత్వం వహించిన ఎ. ఐ. టి. యు. సి కార్యకర్తలు తీవ్రమైన బాధలకు గురిచేయబడ్డారని, ఇవంతా పని వారికి యజమానులకు గల సంబంధాలను దిగజార్చటానికి దారితీసిందని పేర్కొన్నారు.

అశోకా హోటల్ వ్యవహారాలను ఇప్పటికే ఒక పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు చేస్తూందని, ఈ కమిటీ నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని వర్క్స్ హౌసింగు వ్యవహారాల మంత్రి ఈ ప్రతినిధి వర్గానికి తెలియజేశారు. ఈ లోపున యూనియన్ డిమాండ్లు గురించి పరిశీలన జరుపుతాననీ, తగిన చర్యలను తీసుకుంటానని మంత్రి హామి యిచ్చారు. ఈ చర్చలు జరుగుతున్నప్పుడు అశోకా హోటల్ మానేజింగ్ డైరెక్టర్ అయిన శ్రీ ఎస్.సి. దూబే అక్కడే వున్నారు.

వర్క్స్, హౌసింగ్ వ్యవహారాల మంత్రి ఇచ్చిన హామీలను పురస్కరించుకుని గతంలో సెప్టెంబరు రెండు మూడు తారీఖులలో చేయ తలపెట్టిన నిరాహార దీక్షను వాయిదా వేసుకోటానికి యూనియన్ నిర్ణయించింది.

రాష్ట్రపతి సలహా

(1 వ పేజీ తరువాయి)

దినపత్రిక (ఢిల్లీ) ఎడిటర్ శ్రీ రణబీర్‌సింగ్ నేడిక్కడ పత్రికా సంపాదకుల 19 వ వార్షిక సమావేశంలో అధ్యక్ష స్థానం నుండి ప్రసంగిస్తూ అన్నారు.

పత్రికలు తమ పాత్రను సక్రమంగా నిర్వహించి వున్నట్లయితే, దేశంలోని రాజకీయ పరిస్థితి వాతావరణం చాలా మెరుగ్గా వుండేది అని ఆయన అన్నారు.

పత్రికా సంపాదకుల వార్షిక సమావేశం నేడిక్కడ 'రవీంద్ర భారతి' భవనంలో ప్రారంభమైంది.

శ్రీ రణబీర్‌సింగ్ స్వాతంత్ర్య పోరాట యోధులలో ఒకరు. ఆయనకు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఉరిశిక్ష విధించారు. అయితే హైకోర్టు ఆ ఉత్తర్వులను రద్దు చేసింది.

శ్రీ రణబీర్‌సింగ్ తన ప్రసంగంలో పత్రికా స్వాతంత్ర్య సాధనలో సాగిన ప్రగతిని వివరించారు.

"మరఫిరంగులను ఎదుర్కోవలసివస్తే విల్లంబులనో కత్తినో ధరించకు. ఒక పత్రికను వెలువరించు" అని ఒక ప్రముఖ ఉర్దూకవి చెప్పినమాటలను హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ సైన్య చీఫ్‌కమాండర్ శ్రీ చంద్రశేఖర్ అజాద్ చెప్తూండేవారని శ్రీ సింగ్ అన్నారు.

నేటి సంపాదకులు పూర్వపుసంపాదకుల నిస్వార్థసేవా నిరతిని అలవరచుకున్నారని అన్నారు. వర్తమాన సంపాదకులను, ప్రభావితులకావించిన పూర్వ సంపాదకులకు జోహార్లర్పించారు.

ఇప్పుడు సంపాదకులుగా వుండటంలో గతంలో ఉన్నంతగా కష్టనష్టాలు లేవని ఆయన అన్నారు. భారతజాతీయ స్వాతంత్ర్య పోరాటంలో పత్రికలు, సంపాదకులు గణ

(మిగతా 6వ పేజీలో)

విశాఖ షిప్‌యార్డ్ లేబర్ యూనియన్ ఎన్నికలలో ఐ.ఎన్.టి.యు.సి.పరాజయం

ఐక్య కార్మిక సమితి అభ్యర్థుల ఘన విజయం

విశాఖపట్నం, ఆగస్టు 31

హిందూస్థాన్ షిప్‌యార్డు లేబరు యూనియన్ ఆఫీస్ బేరర్ల ఎన్నికల్లో ఐ. ఎన్. టి. యు. సి. కి చెందిన అభ్యర్థులపై షిప్‌యార్డ్ ఐక్య కార్మికసమితి అభ్యర్థులు ఘన విజయం సాధించారు

ప్రస్తుతం యూనియన్ నాయకత్వ స్థానంలోవున్న ఐ.ఎన్.టి.యు.సి. నాయకులకు ఐక్య కార్మికసమితి అభ్యర్థులకు మధ్య ప్రధానంగా పోటీ జరిగింది. ఐ. ఎన్. టి. యు.సి. అభ్యర్థులయిన శ్రీ పేముల జగన్నాథరావు, శ్రీ సి. మనవాళ్ళయ్యనాయుడు ఎన్నికల్లో ఓడిపోయారు.

శ్రీ జగన్నాధరావు, శ్రీ సి. మనవాళ్ళయ్య నాయుడుకు 750 ఓట్లు రాగా, ఎన్నికల్లో గెలుపొందిన ఐక్య కార్మిక సమితి అభ్యర్థులకు యీ దిగువ విధంగా ఓట్లు వచ్చాయి.

అధ్యక్షులు శ్రీ జె. వి. యస్. యస్. నవాజులు 1021, ఉపాధ్యక్షులు శ్రీ వై. ములయ్య రెడ్డికి 1015, గౌరవ కార్యదర్శి శ్రీ తోటకూర అప్పారావు 1011, అడిషనల్ కార్యదర్శి ఎ. సత్యనారాయణ 977, సహాయ కార్యదర్శి శ్రీ డి. రాజారావు 989, కోశాధికారి శ్రీ కె. పురంధర్1013 ఓట్లులభించాయి.

కాంగ్రెస్సు వ్యతిరేకించే అన్ని గ్రూపులు ఐక్యకార్మిక సమితిలో వున్నాయి.

అశోక్ మెహతాకు వీడ్కోలు విందు

న్యూఢిల్లీ సెప్టెంబరు 1

3½ సంవత్సరాలుగా ప్రణాళికా సంఘానికి ఉపాధ్యక్షులుగా ఉంటున్న శ్రీ అశోక్ మెహతా పదవీ విరమణ సందర్భంగా ప్రణాళికా సంఘ సభ్యులు, అధికారులు ఇతర సిబ్బంది ఆయనకు వీడ్కోలు విందు యిచ్చారు.

శ్రీ మెహతా అధికార్లకు, సిబ్బందికి తన కృతజ్ఞతలు అందజేశారు.

జపాన్‌లో అంతమయిన గత ఆర్థిక సంవత్సరంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ 21.5 కోట్ల డాలర్ల రుణంగా భారతదేశానికి యిచ్చింది.

వియత్కాంగ్ సేనల విజృంభణ

హనోయ్, ఆగస్టు 31

ఉత్తర వియత్నాంపై బాంబులవర్షం కురిపించ వచ్చిన అమెరికన్ యుద్ధవిమానాలు తొమ్మిదింటిని కూల్చివేసినట్లు ఉత్తర వియత్నాం వార్తాసంస్థ నేడు ప్రకటించింది.

ఒక హెలికాప్టర్‌తోసహా 9 విమానాలను హైఫాంగ్ రేవుపైన కూల్చివేసినట్లు, హనోయ్‌పైన మిగతా వాటిని ధ్వంసంచేసి క్రిందకు పడగొట్టినట్లు ఆ వార్తాసంస్థ తెలిపింది.

వీటితో ఉత్తర వియత్నాంచే కూల్చివేయబడిన అమెరికా విమానాల సంఖ్య 2,249 కి చేరిందని ప్రకటించింది.

సాహిత్య గోష్ఠి

2-9-67 వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు విశాలాంధ్ర ప్రచురణాలయంలో జరిగే సాహిత్య గోష్ఠి సమావేశంలో శ్రీ "చంద్రమౌళి" తమ కథలను చదివి వినిపిస్తారు.

ప్రతిపక్షాలపట్ల ఆకాశవాణి వివక్ష

మైసూర్ కమ్యూనిస్టు శాసన సభ్యుని ప్రసంగం త్రొక్కిపట్టిన తీరు

బెంగుళూరు, సెప్టెంబరు 1

ప్రతిపక్షాలపట్ల ఆల్ ఇండియా రేడియో వివక్షకు మరో ఉదాహరణ నిన్న యిక్కడ వెల్లడైంది.

(ఈ సంవత్సరం మే దినోత్సవం సందర్భంలో పశ్చిమ బెంగాల్ ఐక్య సంఘటన ప్రభుత్వ కార్మికమంత్రి ప్రసంగాన్ని వారు త్రొక్కిపెట్టిన ఉదంతమూ, దానిపై జరిగిన పరిణామాలూ పాఠకులకు తెలిసినవే)

ఆకాశవాణి బెంగుళూరు కేంద్రం వారు మైసూరు రాష్ట్ర శాసనసభలోని కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ యం. యస్. కృష్ణన్ ప్రసంగాన్ని ముందుగా రికార్డు చేసికొని దానిని ప్రసారం చేయకుండా నిలిపివేశారు.

శ్రీ కృష్ణన్ నిన్న యిక్కడ పత్రికల వారితో మాట్లాడుతూ యీ విషయాన్ని వెల్లడించారు.

స్థానిక రేడియో కేంద్రం అధికారులు అంతకుముందే రికార్డు చేసుకున్న తన ప్రసంగంపాఠంగురించి చర్చించేందుకు, అది ప్రసారం కావలసిన నిర్ణీత తేదీకి రెండు రోజులుముందు తనను పిలిపించుకొని మాట్లాడారని ఆయన చెప్పారు.

శ్రీ కృష్ణన్ ప్రసంగం యింకా పరిశీలనలో వుంది' అని ఆ స్టేషన్ అధికారి ఒకరు పత్రికల వారితో చెప్పారు.

రేడియో అధికారులు అభ్యంతర పెట్టిన మాటలివి.

4 వ ప్రణాళిక విషయంలో ప్రభుత్వం "విరామారోపు" విధానం అవలంబిస్తున్నది. "నెహ్రూ బ్రతికివుంటే బహుశా ప్రణాళిక ఎన్నికలకు ముందే వెలువడి ఉండేది" "అమెరికా ఆర్థిక ఒత్తిడి ఫలితంగా ప్రజల పరిస్థితి దిగజారిపోతున్నది." "టాటా బిర్లాలు పరిశ్రమలపై గుత్తాధిపత్యం వహిస్తున్నారు."

ఇట్టి సామాన్య విమర్శలు చేయటానికి రేడియో అంగీకరించక పోవటంలోనే ప్రభుత్వ నిరంకుశ ధోరణి వ్యక్తమౌతున్నది అని శ్రీ కృష్ణన్ తన గోష్ఠిలో వివరించారు.

అలెప్పీలో 60 బస్తాల దొంగ ధాన్యం స్వాధీనం

అలెప్పీ సెప్టెంబరు 1

ఒక వ్యాపార సంస్థలో దొంగతనంగా నిల్వ వుంచబడిన 60 బస్తాల ధాన్యాన్ని బుధవారంనాడు సివిల్ సరఫరా అధికారులు పట్టుకున్నారు.

అధిష్ఠాన వర్గం కుట్ర

(1 వ పేజీ తరువాయి)

కర చర్యలను ముఖ్యంగా, కాంగ్రెస్ మంత్రుల, అధికారుల అవినీతి చర్యలను బహిర్గతంచేసి, తగు చర్యలు తీసుకొనేందుకు ప్రయత్నించటం, దొంగ నిల్వదారులకు, అధిక లాభార్జనాపరులకు వ్యతిరేకంగా చర్యలు గైకొనటం వంటి కార్యక్రమానికి తలపడటంతో మాజీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలకు చెందిన నిందితులు ఐక్య సంఘటన ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెండవ దఫా పెద్ద ఎత్తున దాడి ప్రారంభించారని ఆ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరోగ్యమంత్రి శ్రీ మండల్ తన మంత్రి పదవికి సమర్పించిన రాజీనామాను రాష్ట్రగవర్నర్ శ్రీ అనంతశయనంఅయ్యంగార్ ఆమోదించారని ఈ పదవీ విరమణ ఆగస్టు 27 సాయంత్రం నుండి అమలులోకి వచ్చిందని నేడిక్కడ అధికార ప్రకటన వెలువడింది.

ఐక్యసంఘటన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కేంద్రం ఏదైనా 'బుద్ధిపూర్వక నిర్ణయాన్ని' తీసుకుంటే, బీహార్‌లో మధ్యంతర ఎన్నికలు జరపవలసిందిగా రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ మహామాయాప్రసాద్ సిన్హా డిమాండ్ చేయవచ్చునని ఎస్. ఎస్. పి నాయకులు శ్రీ లోహియా నిన్న ఇక్కడ పత్రికాగోష్ఠిలో చేసిన సూచనపట్ల అయిదుగురు కాంగ్రెస్ శాసనసభ్యులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ పత్రికా ప్రకటన చేశారు.

మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షోభ సమయంలో ఇందుకు పూర్తి విరుద్ధ వైఖరిని శ్రీ లోహియా అవలంబించారని వారు తమ ప్రకటనలో విమర్శించారు.

ఐక్యసంఘటనలో భాగస్వామియైన ఎస్.ఎస్.పి. నుండి శోషిత్‌దళ్‌లోని కొంతమంది శాసన సభ్యులు వెళ్ళినందువల్ల ఏర్పడిన పరిస్థితి నేడిక్కడ సమావేశమైన ఐక్య సంఘటన సమన్వయ కమిటీ సమీక్షించింది

సమావేశానంతరం సమన్వయ కమిటీ ప్రతినిధి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ శాసనసభలో ఐక్యసంఘటన పక్షానికి పూర్తి మెజారిటీ ఉన్నదని, ఐక్యసంఘటన ప్రభుత్వాన్ని కూల్చివేసే యత్నాలు తప్పక విఫలం కాగలవని భావిస్తున్నామని తెలిపారు.

శాసనసభలో కాంగ్రెస్ - శోషిత్‌దళ్ మిశ్రమ పక్షానికి మెజారిటీ ఉన్నదనటం పచ్చి బుకాయింపు మాత్రమేనని ఆయన చెప్పారు.

ఎస్. ఎస్. పి. సభ్యులు పలువురు తమకు శోషిత్‌దళ్‌తో సంబంధంలేదని యిప్పటికే ప్రకటిస్తున్నప్పటికీ, వారి పేర్లను ప్రత్యర్థి వర్గం రాజకీయ బేరాలకు ఉపయోగించుకుంటున్నారని చెప్పారు.

శోషిత్‌దళ్‌తో కలిసి ఐక్య సంఘటన ప్రభుత్వాన్ని కూలద్రోసేందుకు కాంగ్రెస్ పక్షానికి శ్రీ కామరాజ్ అనుమతి ఇస్తూ తీసుకొన్న నిర్ణయంపట్ల శోషిత్‌దళ్ నాయకుడు శ్రీ మండల్ హర్షాన్ని ప్రకటించారు. శ్రీ కామరాజ్ నిర్ణయం శోషిత్‌దళ్ బలాన్ని పెంచగలదనే ఆశాభావాన్ని ప్రకటించారు. ఈ నిర్ణయం తర్వాత ఐక్య సంఘటన ప్రభుత్వాన్ని కూల్చేందుకు, శోషిత్‌దళ్ మరింత మంది సభ్యులను కూడగట్టేందుకు ప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నామని ఆయన చెప్పారు.

ప్రస్తుత ప్రభుత్వానికి శాసనసభలో మెజారిటీ లేదని, కనుక మంత్రివర్గాన్ని విస్తరింపజేసేందుకు ముఖ్యమంత్రి తీసుకొనే చర్యలను అనుమతించరాదని కోరుతూ గవర్నర్‌కు లేఖ వ్రాశానని చెప్పారు.

కాకినాడలో

2 వేల మంది రిక్షా కార్మిక సమ్మె

కాకినాడ, సెప్టెంబరు 1

కాకినాడ రిక్షా కార్మికులు తమ కోర్కెలకై ఈనెల 27 నుండి ప్రారంభించిన సమ్మెను ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు.

ప్రతిదినం సుమారు 2 వేల కార్మికులు ఊరేగింపులు, బహిరంగ సభలు జరుపుతున్నారు. నేటి ఊరేగింపుకు శ్రీ చింతపల్లి అప్పారావు శ్రీ కొప్పర్తి వీరభద్రరావు డాక్టర్ హుస్సేన్ నాయకత్వం వహించి నడిపారు. ఊరేగింపుగా వెళ్ళి ఉదయం 11 గంటలకు రెవిన్యూ డివిజనల్ ఆఫీసరును కార్మిక ప్రతినిధులు కలుసుకుని సంప్రదించారు. రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు యజమానుల సంఘానికి కబురుచేయగా వారి ప్రతినిధులూ వచ్చారు. తాము ఆలోచించుకొనుటకు వ్యవధిని కోరారు. నేటి సాయంత్రం 4 గంటలకు తాలూకా తహసీలు దారువద్ద పరిష్కారం చేసుకోడానికి నిర్ణయించారు. సమ్మె త్వరలో పరిష్కారం కాకపోతే యితర కార్మిక సంఘాలు కూడా సానుభూతి చర్యను తీసుకోడానికి ఆలోచిస్తున్నారు. కార్మిక నాయకులు శ్రీ పి. యస్. శర్మ సవ్యమైన పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

ఇజ్రాయిల్‌కు ఆంగ్లో-అమెరికన్ ఆయుధ సరఫరా పునరుద్ధరణ

లండన్, ఆగస్టు 31

ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సప్లయి చేయటానికి బ్రిటన్, అమెరికాలు నిర్ణయించుకున్నాయని దౌత్యవర్గాల వారిద్వారా నేడిక్కడ విశ్వసనీయంగా తెలిసింది.

జోర్డాన్‌కు నామమాత్రంగా కొన్ని జెట్ విమానాలు ముందు యిచ్చి ఆ తర్వాత ఇజ్రాయిల్‌కు టాంకులు యివ్వటానికి బ్రిటన్ అంగీకరించింది. అమెరికా కూడా ఇలాగే నిర్ణయించుకున్నది.

పశ్చిమాసియా దేశాలకు ఆయుధాల సరఫరాపై నిషేధం విధించే విషయమై సోవియట్ యూనియన్ తనతో కలిసిరానందున తామీపనికి పూనుకోవలసి వస్తున్నదని పశ్చిమ రాజ్యాల వారంటున్నారు.

కాంటన్ చే పెకింగ్ రేడియో ప్రసారాల రిలే విరమణ

హాంగ్‌కాంగ్, సెప్టెంబరు 1

కాంటన్ రేడియో గత రాత్రి నుండి పెకింగ్ రేడియో కార్యక్రమాలను రిలే చేయడాన్ని విరమించింది తన స్వంత వార్తా ప్రసారాలను ప్రసారం చేసింది. ఆగస్టు 10 అనంతరం తిరిగి ఈ విధంగా చేయడం ఇదే ప్రథమం

సాయుధ పోరాటాన్ని ఆపమని ప్రధాని చౌ-ఎన్-లై ఉత్తర్వు చేసినప్పటికీ దక్షిణ చైనాలోని కాంటన్‌లో ప్రత్యర్థి వర్గాల మధ్య పోరాటం కొనసాగుతున్నట్లు చైనా నుండి ఇక్కడకు వచ్చినవారు చెబుతున్నారు

పోరాటాన్ని విరమించాలని, శాంతియుతంగా వివాదాలను తాము పరిష్కరించుకోవాలని, లేని పక్షంలో పట్టి శిక్షింపబడతారని చౌ-ఎన్-లై పంపిన ఉత్తర్వు పోస్టర్లను అంటించారు

తుంకూరులో ఆంధ్ర విద్యార్థులపై కన్నడులదాడి

తగినరక్షణలేక స్వగృహాలకు 100 మందికి పైగా ఆంధ్ర విద్యార్థులరాక

['విశాలాంధ్ర' విలేకరి]

విజయవాడ, ఆగస్టు 31

బెంగుళూరుకు 40 మైళ్ళ దూరంలో గల తుంకూరులో ఆంధ్ర వ్యతిరేకత విజృంభించటంతో, అక్కడ చదువుకుంటున్న ఆంధ్ర విద్యార్థులు 100 మందికి పైగా, కట్టుబట్టలతో, అరచేత ప్రాణాలు పెట్టుకొని, స్వగృహాలకు పారిపోయి వచ్చారు.

ఈనెల 27 వ తేదీన ఒక ఆంధ్రా విద్యార్థి, మైసూరులోని ప్రయివేటు బస్సుల ఒక యజమాని కుమారునికి మధ్య ప్రారంభమైన సంఘర్షణ రెండురోజుల్లో తీవ్రరూపం ధరించిందని, విజయవాడ చేరుకున్న విద్యార్థులు చెప్పారు.

28, 29 తేదీలలో ఆంధ్ర విద్యార్థులపై జరిగిన దాడులలో 2 వేల మంది కన్నడులు పాల్గొన్నారని, పట్టణంలోని అన్ని వర్గాలకు చెందినవారు, ఆంధ్ర వ్యతిరేకతతో పెచ్చరిల్లి ప్రవర్తించారని చెప్పుతున్నారు.

మొన్న సాయంత్రం వందల సంఖ్యలో కన్నడులు ఆంధ్ర విద్యార్థులకు చెందిన మెస్‌లను తగులబెట్టారని, ఈ దాడిలో 30కి పైగా సైకిళ్ళు కొన్ని ట్రాన్సిస్టర్లు ధ్వంసమైపోయాయని చెప్తున్నారు. ఆంధ్ర విద్యార్థులపై బహిరంగంగా ఇలాంటి దాడి పెద్ద ఎత్తున సాగుతున్నా పోలీసు అధికారులు ఏమి పట్టించుకోలేదని, పోలీసు అధికారుల సమక్షంలోనే ఆంధ్ర విద్యార్థుల మెస్‌ల దహనకాండ జరిగిపోయిందని చెప్పబడుతున్నది.

ఈదాడుల సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఒక విద్యార్థి కత్తిపోట్లకు గురయ్యాడని, అతడిని ఆస్పత్రిలో చేర్చుకోటానికి సైతం అధికారులు నిరాకరించారని తెలియవస్తున్నది.

ఈ గలాటాలను పురస్కరించుకొని ప్రభుత్వ స్థానిక ఆస్పత్రి, కళాశాలలకు వారం రోజులు సెలవులు ప్రకటించారని, కన్నడ విద్యార్థులు మరింతగా పెచ్చరిల్లి ఆంధ్ర విద్యార్థులను పట్టుకొని కొట్టటం ప్రారంభించారని వారు తెలియజేశారు.

స్థానిక కళాశాల అధికారులుగాని, పోలీసు అధికారులుగాని తమకు ఎట్టి రక్షణ కల్పించని పరిస్థితుల్లో, మరో మార్గంలేక తాము స్వగృహాలకు రావలసివచ్చిందని తుంకూరులోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఆంధ్ర విద్యార్థులు ఇక్కడకువచ్చి చెప్పారు.

శ్రీ ఆవుల గోపాల కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి సభ

తెనాలిలో సెప్టెంబరు 7 న

తెనాలి, ఆగస్టు 31

ప్రముఖ న్యాయవాది, నవ్య మానవతా వాది శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి సభ సెప్టెంబరు 7 వ తేదీ సాయంత్రం 6 గం॥ తెనాలిలో జరుగనున్నదని వర్ధంతి సంఘం కన్వీనరు శ్రీ గురిజాల సీతారామయ్య తెలియజేస్తున్నారు.

ఈ సభకు జస్టిస్ ఆవుల సాంబశివరావు అధ్యక్షత వహిస్తారు. శ్రీయుతులు గొట్టిపాటి బ్రహ్మయ్య, వెనిగళ్ళ సత్యనారాయణ, పొంగర జగ్గయ్య తదితర ప్రముఖులు సభలో పాల్గొనబోతున్నారు.

చిన్నతరహా పరిశ్రమలకు కేరళ ప్రభుత్వ ప్రోత్సాహం

తిరువేంద్రం ఆగస్టు 31

కేరళ ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమల వారికి వాయిదాల పద్ధతి మీద షెడ్‌లను అమ్మాలని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లకు ఆజ్ఞను జారీచేసింది.

ప్రస్తుతం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని షెడ్‌లు అద్దెపద్ధతిమీద ఇవ్వబడుతున్నాయి

ఈ క్రొత్తపద్ధతి ప్రభుత్వం ఆమోదించిన నూతన పారిశ్రామిక విధానానికి అనుగుణంగా వుంటుంది.

ఈ పద్ధతి ప్రకారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పరిశ్రమలు గలవారు, అన్ని ప్రక్కలా ఇరవయియేళ్ళ కాలవ్యవధిలో నవ ఫ్యాక్టరీషెడ్‌ను వాయిదాల పద్ధతిమీద కొనుక్కోవచ్చును.

ఈ క్రొత్త నిబంధనల ప్రకారం నూటికి ఇరవయి వంతుల ధరను చెల్లించి చిన్న పరిశ్రమల యజమానులు ఫ్యాక్టరీ స్థలాన్ని పొందవచ్చును. మిగతా ధరను నూటికి 6½ వంతుల వడ్డీతో పది సంవత్సరాలలో సమాన వాయిదాలమీద చెల్లించవచ్చును.

అమోనియా దిగుమతులకు కేంద్ర ప్రభుత్వం తిరస్కృతి

దేశీయ ఎరువుల పరిశ్రమపై అశోక్ మెహతా ఘాతుక పథకానికి చెంపపెట్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1

బొంబాయిలో నిర్మించ తలపెట్టిన ఒక ఎరువుల కంపెనీకి, విదేశాలనుంచి అమోనియా ద్రవాన్ని దిగుమతి చేసుకొనేందుకు అనుమతించాలన్న పెట్రోలియం రసాయనాల శాఖామంత్రి అశోక్ మెహతా ప్రతిపాదనను నిన్న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం త్రోసిపుచ్చింది.

దేశంలో పుష్కలంగా లభించే నాఫ్తా ముడిసరుకు ఆధారంగానే దేశంలో ఎరువుల పరిశ్రమను అభివృద్ధి చేయాలనేది యింతవరకూ వుంటూ వచ్చిన భారత ప్రభుత్వ విధానం, అయితే ప్రపంచ బ్యాంకి ప్రభావానికి లొంగిన అశోక్ మెహతా యీ విధానాన్ని తలక్రిందులు చేయటానికి ప్రయత్నించారు. బొంబాయికి చెందిన ధరమ్సీ మురార్జీ కెమికల్స్ అనే సంస్థను కువాయిట్‌నుంచి యీ పదార్థాన్ని దిగుమతి చేసుకొనేందుకు అనుమతించాలని ఆయన ప్రతిపాదించారు. కువాయిట్ నుండి అమోనియా దిగుమతి చేసుకుంటే ప్రపంచ మార్కెట్‌లో చాలా కొరతగావున్న గంధకం సాలుకు రెండు లక్షల టన్నుల చొప్పున పదేళ్ళపాటు కువాయిట్ నుంచి లభిస్తుందని కూడా ఆయన ఆశ చూపారు

దేశీయ ఎరువుల పరిశ్రమను స్థానిక వనరులను నష్టపరచే మెహతా ప్రతిపాదన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలోనూ, బైటకూడా గట్టివిమర్శలకు గురైంది.

ప్రపంచ మార్కెట్‌లో గంధకం మనం అనుకుంటున్నంత కొరతగా ఏమిలేదనీ, గంధకం కొనకుండా ఎరువుల విధానాన్ని మార్చుకోవలసిన అవసరమేమీలేదని మంత్రివర్గం నిర్ణయించింది.

శ్రీ మెహతా ఆ బొంబాయి ఎరువుల కంపెనీ తరపున చెప్పిన మరికొన్ని వాదనలను కూడా మంత్రివర్గం తిరస్కరించింది.

నాఫ్తా ఎరువుల ఫ్యాక్టరీ కంటే, యీ అమోనియా ఎరువుల పరిశ్రమను చాలా తొందరలో నిర్మించవచ్చు. ఈ బొంబాయి కంపెనీ ఒక్కటే మొత్తం మన దేశానికి అవసరమైనఫాస్ఫేట్ ఎరువుల్లోనాలుగోవంతు భాగాన్ని ఉత్పత్తి చేస్తుంది అని ఆయన చెప్పారు.

ఈ చర్చల సందర్భంలో మిగతా మంత్రివర్గసభ్యులు శ్రీ మెహతా ప్రతిపాదనకు మరో గట్టి అభ్యంతరం కూడా లేవదీశారు. ప్రపంచ మార్కెట్‌లో పెట్రోలియం పదార్థాల ధరలు తగ్గుతూ వుండగా, వచ్చే పదేళ్ళపాటు అమోనియా ద్రవం దిగుమతికి హెచ్చు ధరను నిర్ణయించటం దేశప్రయోజనాలను తాకట్టుపెట్టడం కాదా అని వారు మెహతాను నిగ్గదీశారు.

మద్రాసు-కేరళ రాష్ట్రాలమధ్య గల నదీజలాల సమస్యగురించి అక్టోబరులో సంభాషణలు ప్రారంభం అవుతాయి.

'లాభాలు-వేతనాల' స్తంభనకు బిర్లా విముఖత

మద్రాసు ఆగస్టు 31

ప్రభుత్వం తలపెట్టిన "వేతనాలు-లాభాలు-ధరల స్తంభన" పథకం జాతీయాదాయంలో 13.5 శాతానికే వర్తించనుందని ఇంత స్వల్పాన ధరలు కట్టుబాటు అవుతాయని భావించటం పొరపాటని భారత వాణిజ్య పారిశ్రామిక మండలి అధ్యక్షులు శ్రీ యల్. యన్. బిర్లా నేడిక్కడ అన్నారు.

మద్రాసు వాణిజ్యమండలి ప్రతినిధులతో శ్రీ బిర్లా మాట్లాడుతూ, పెద్దఎత్తున ప్రభుత్వం విధించుచున్న పరోక్షపు పన్నులే ధరల పెరుగుదలకు కారణమన్నారు.

పెట్రోల్ ధరలో 300 శాతం, పంచదార ధరలో 140 శాతం పన్ను లేవని ఆయన అన్నారు.

వేజ్‌బోర్డు సిఫారసుల అమలువల్ల బొగ్గు ధరలు పెరిగాయని చెప్పారు.

ఆర్థిక మాంద్యాన్ని సరియైన పద్ధతిలో పరిష్కరించాలని, రాజకీయ వివాదాలతో గొలుకుపోరాదని అన్నారు.

ఆర్థికమాంద్యం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలపట్ల యథార్థ వైఖరిని అవలంబించాలని అన్నారు.

ప్రభుత్వం తేదలచిన గుత్తపెట్టుబడుల నిరోధక కమిషన్ బిల్లు గురించి ప్రస్తావించి, ఈ బిల్లును ఆమోదించటం అంటే ప్రభుత్వం తనకుతానే వ్యతిరేకంగా వ్యవహరించటం కాగలదని అన్నారు. లైసెన్సులు యిచ్చేముందు ప్రభుత్వం అన్నివిషయాలను సాకల్యంగా పరిశీలించే యిస్తుందని అన్నారు.

ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు వాసవదా సూచన

త్రైపాక్షిక సమావేశం జరగాలని ప్రతిపాదన

అహమ్మదాబాద్, ఆగస్టు 31

ద్రవ్యోల్బణాన్ని అరికట్టి, ఆర్థికసంక్షోభాన్ని పరిష్కరించేప్పుడు, వ్యవసాయ, పారిశ్రామికోత్పత్తులను అధికాధికంగా పెంచే మార్గాలను అన్వేషించేందుకు, కార్మిక, యజమానుల, ప్రభుత్వ ప్రతినిధులతో త్రైపాక్షిక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఐ. ఎన్. టి. యు. సి. నాయకులు శ్రీ ఎస్. ఆర్. వాసవదా నేడిక్కడ సూచించారు.

యెమెన్ వివాద పరిష్కారానికి ఈజిప్టు, సౌదీ అరేబియాల ఒప్పందం ?

ఖార్టూమ్, ఆగస్టు 31

గత 5 సంవత్సరాలుగా ఈజిప్టు, సౌదీ అరేబియా దేశాల మధ్య సత్సంబంధాలను దుర్బలం చేసిన యెమెన్ వివాదాన్ని పరిష్కరించేందుకు అధ్యక్షులు నాజర్, సౌదీ అరేబియా రాజా ఫైజల్ ఒక పథకాన్ని ఆమోదించారు.

సూడాన్ ప్రధాని గృహంలో 3½ గంటలపాటు సుదీర్ఘమైన చర్చలు జరిపిన అనంతరం యెమెన్‌లో అంతర్యుద్ధాన్ని అంతం చేసేందుకు వారొక ఒప్పందానికి వచ్చారు.

శుక్రవారంతో ముగియనున్న అరబ్ శిఖరాగ్ర సభ తదుపరి తక్షణం ఈ ఒప్పందాన్ని అమలు పరిచేందుకు ఇరాక్, మొరాకో, సూడాన్ దేశాలను ఎన్నుకున్నారు.

ఈ ఒప్పందం ప్రకారం 40 వేల ఈజిప్టు బలగాలను యెమెన్ నుండిఉపసంహరించుకోవాలి. అదే సమయంలోసౌదీ అరేబియా యెమెన్ రాచరికవర్గానికిసైనికసహాయాన్ని నిలిపివేయాలి. ఇందుకుగాను పై మూడు అరబ్ దేశాలు ఒక పథకాన్ని తయారు చేస్తాయి.

ఈ త్రిరాజ్యకమిటీకి ఇరాక్ పేరును ఈజిప్టు, మొరాకో పేరును సౌదీ అరేబియా సూచించాయి. మూడవ దేశంగా సూడాన్‌ను ఉభయులు అంగీకరించారు. నాజర్, ఫైజల్‌ల సమావేశానికి సూడాన్ ప్రధానికూడా హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సూడాన్ ప్రధాని చొరవ తీసుకున్నారు.

యెమెన్‌లో గత 5 యేండ్లుగా జరుగుతున్న అంతర్యుద్ధంలో యెమెన్ రిపబ్లిక్‌ను ఈజిప్టు, రాచరిక వాదులను సౌదీ అరేబియా బలపరిచాయి.

అరబ్ నాయకులు [illegible] చర్చించిన ఒప్పందంలో ప్రధానంగా ఈ క్రింది నాలుగు అంశాలున్నాయి.

1. యెమెన్ సమస్య పరిష్కారానికి త్రిరాజ్య కమిషన్‌ను నియమించాలి. ఈజిప్టు, సౌదీ అరేబియాల అభీష్టానుసారం చేరి ఒక సభ్య దేశాన్ని. అరబ్ విదేశాంగ మంత్రులసభ లేదా ఈ రెండు దేశాలకు అంగీకృతమయిన దేశాన్ని మూడవ సభ్యునిగా ఎన్నుకోవాలి.
2. యెమెన్ నుండి ఈజిప్టు బలగాల ఉపసంహరణ గ్యారంటీ చేసేందుకు, యెమెన్ రాచరిక వాదులకు సౌదీ అరేబియా సైనిక సహాయాన్ని నిలుపు చేసేందుకు ఈ కమిషన్ పథకాన్ని రూపొందించాలి
3. యెమెన్ ప్రజలకు పూర్తి సార్వభౌమాధికారం, స్వాతంత్ర్యం కలిగించేందుకు, ఆ దేశ ప్రజల అభీష్టానుసారం యెమెన్‌లో స్థిరత్వాన్ని ఏర్పరిచేందుకు ఈ కమిషన్ తన శక్తిమేరకు కృషి చేయాలి.
4. వివాద పరిష్కార మార్గంలో ఎదురయ్యే ఆటంకాలను తొలగించేందుకు జరిపే కృషికి సంబంధించిన అన్ని విషయాలలోను ఈ కమిషన్ ఈజిప్టు, సౌదీ అరేబియాల అభిప్రాయాన్ని తీసుకోవాలి.

ఈ సమావేశం ఏర్పాటుకు గత కొంతకాలంగా కృషి చేసిన సూడాన్ ప్రధానికిది గొప్ప విజయం.

విందులపై కొన్ని ఆంక్షలు

ఆహార కొరత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఉత్తరువు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1

ఆహార పదార్థాల వినియోగాన్ని పొదుపు చేసే ఉద్దేశంతో జారీచేసిన, అతిథుల సంఖ్య పరిమితి ఉత్తరువు ఎక్కడా అమలు జరగటమేలేదని. ఆ ఉత్తరువు నామమాత్రమై కాగితాల మీదనే నిలిచిపోయిందని, కేంద్ర ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది.

నిన్న కేంద్ర మంత్రివర్గ సమావేశంలో యీ విషయం చర్చించబడింది. ఢిల్లీ యూనియన్ ప్రాంతానికి వర్తించే మరో ఉత్తరువును సవరించి రూపంలో ఆమోదించారు. ఈ నమూనా ఆధారంగానే రాష్ట్రాలన్నీకూడా తగు ఉత్తరువులు రూపొందించాలని సూచించారు.

ఉన్నతాధికారులు పెద్ద పెద్ద విందులకు హాజరయ్యే అలవాటును తగ్గించుకోవాలని ప్రధాని శ్రీమతి గాంధీ విజ్ఞప్తి చేశారు. తాముపెళ్ళిన విందుల్లో, ప్రభుత్వ ఉత్తరువు ఖచ్చితంగా పాటింపబడుతున్నదీలేనిదీ వారు మర్యాదగానే అడిగి తెలుసుకోవాలని ఆమె చెప్పారు. అది జరగనిచోట వారు ఆ విందుల్లో పాల్గొనడం మానివేయాలి అని ఆమె సూచించారు.

నేడు ఆమోదించబడిన కొత్త ఉత్తరువు ప్రకారం ఏ విందులోకూడా, దానిని ఏర్పాటు చేసిన వారినికూడా కలుపుకుని అతిథుల సంఖ్య వాతికకు మించరాదు. అదేవిధంగా భోజన పదార్థాల సంఖ్యమీదకూడా కొన్ని ఆంక్షలు వుంటాయి.

ఆంధ్రలో పరిశ్రమలు స్థాపించడానికి బొంబాయి పారిశ్రామిక వేత్తలు శ్రద్ధ చూపుతున్నారని బ్రహ్మానందరెడ్డి 30 వ తేదీన హైదరాబాద్‌లో అన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము,
ఫారెస్టు డిపార్టుమెంటు,
శ్రీకాకుళం డివిజన్.

టెండరు / వేలం నోటీసు

ఇందుమూలముగా అందరకూ తెలియజేయడమేమనగా, శ్రీకాకుళం ఫారెస్టు డివిజన్‌కు సంబంధించిన (i) 1967-68 సంవత్సరం బకాయి వెదురు కూపులకు టెండరులుమరియు (ii) 1967-68 సంవత్సరం బకాయిగుత్తలు అనగా: 1. గుగ్గిలం, 2. బోదు స్మాల్ టింబరు, 3. వంటచెరకు, 4. ఫాగట్ వుడ్, 5. ఉసు కన్వర్షన్ కూపులు, 6. చిల్లర వలసాయం క్వారీ యూనిట్లు వేలం వేయబడును. శ్రీకాకుళం. శ్రీకాకుళం డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసుకు 12—9—1967 వ తేదీ మధ్యాహ్నము 1 గంట లోపుగా పంపవలెను. సదరు టెండరులు డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసరువారు గాని, లేక వారిచే నియమింపబడినవారుగాని మధ్యాహ్నము 2 గంటలకు తెరచుదురు. వేలములు 12—9—1967 వ తేదీ మధ్యాహ్నము 4 గంటకు శ్రీకాకుళం డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసులో డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసరు. లేక వారిచే నియమింపబడినవారు బహిరంగముగా వేలం వేయుదురు.

ఇతర వివరములకు శ్రీకాకుళం డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసరుతో గాని, లేక వారి కార్యాలయంలో గాని స్వయముగా గాని. లేక పోస్టుద్వారా గాని సంప్రతించవలసినదిగా కోరడమైనది.

(సం.) పి. సుందరేశన్,
డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసరు
శ్రీకాకుళం

టెండరు నోటీసు

కృష్ణాజిల్లా, గన్నవరం తాలూకా, బుద్దవరంలోని ఫీడ్ మిక్సింగ్ ప్లాంటులో ఉపయోగించుటకు దిగువ తెలియపర్చబడిన వివరములు గల గన్నీ సంచులు సప్లయి చేయుటకు సీలువేసిన టెండరు (గన్నీసంచులు సప్లయి చేయుటకు టెండరు అని వ్రాయవలయును) ప్రాజెక్టు ఆఫీసరు, ఫీడ్ మిక్సింగ్ ప్లాంటు, బుద్దవరంవారిచే కోరబడుచున్నవి.

వివరములు : గన్నీసంచులు.

సైజు : 40" × 28" (60 కి. గ్రా. కపాసిటీ గలవి).

సుమారు కావలసినవి : 3,000 సంచులు.

ఎర్నెస్టు మనీ డిపాజిట్ చేయవలసినది : రు. 1,000 (ఒక వేయి రూపాయలు మాత్రం.)

టెండరు షెడ్యూల్సు మరియు యితర వివరములకు రు. 5 15 పై. (ఐదు రూపాయల పదిహేను పైసలు) చెల్లించి ఆఫీసు పనిచేయు రోజులలో ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రాజెక్టు ఆఫీసరు, ఫీడ్ మిక్సింగ్ ప్లాంటు, బుద్దవరంవారి ఆఫీసు నుండి పొందవచ్చును. టెండర్లు 29-9-67 తేదీ సాయంత్రం 3 గంటలవరకు తీసుకోబడును. తిరిగి అదే రోజు సాయంత్రం గం. 3-30 లకు ప్రాజెక్టు ఆఫీసరు, ఫీడ్ మిక్సింగ్ ప్లాంటు, బుద్దవరంవారి ఆఫీసులో టెండర్లు తెరవబడును.

ప్రాజెక్టు ఆఫీసరు,
ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్,
బుద్దవరం.

నూజివీడులో అ. భా. చెడుగుడు పోటీలు

దసరాఉత్సవాల సందర్భంగా అక్టోబరు 8 నుండి ప్రారంభం

విజయవాడ, సెప్టెంబరు 1

నూజివీడులో స్పోర్టింగ్ క్లబ్ ప్రతి ఏటా అఖిలభారత చెడుగుడు పోటీలు జరుపుతున్నది.

ఈ సంవత్సరంకూడా 16 వ అఖిలభారత చెడుగుడుపోటీలు దసరాఉత్సవాలసందర్భంగా నిర్వహించే విషయాన్ని గురించి చర్చించేనిమిత్తం సర్వసభ్యసమావేశం జరిపి కార్యకర్తలను ఎన్నుకోవటం జరిగింది. ఆగస్టు 30 న ఉమామహేశ్వర మహల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ క్రింది వారు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

శ్రీయుతులు సి.హెచ్. సీతారామారావు అధ్యక్షులు, యం. అప్పారావు ఉపాధ్యక్షులు, వి. బాలకృష్ణ కార్యదర్శి, కె. సత్యనారాయణరావు కోశాధికారి, కె. కలహంసరావు, సి.వి.యస్. చలపతిరావు సహాయ కార్యదర్శులు.

అక్టోబరు 8 వతేదీన నాక్ అవుట్ పద్ధతిలో జూనియర్స్ పోటీలు, 12 వతేదీన లీగ్ పద్ధతిలో అవుట్ సీనియర్స్ పోటీలు. జరుగుతాయి. స్టేట్ మీటులో క్రిందటి సంవత్సరం జూనియర్ విజేతలు ఈ సంవత్సరం సీనియర్సుగా పరిగణింపబడతారు.

ఫైనల్ పోటీలు అక్టోబరు 15 న జరుగుతాయి

ఈపోటీలలో పాల్గొనదలచిన జట్లువారి పేర్లను వి. బాలకృష్ణ కార్యదర్శి, స్పోర్టింగ్‌క్లబ్, నూజివీడు అనే చిరునామాకు పంపాలి. గడువు ఆఖరితేదీ సెప్టెంబరు 30

విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ఇవ్వబడతాయి. బహుమతి ప్రదాన సమయంలో సినీనటులు శ్రీయుతులు జగ్గయ్య, గుమ్మడి వెంకటేశ్వరరావులకు సన్మానం జరుపబడుతుంది.

జయప్రదమైన స్కూల్ బాయ్స్ క్రికెట్ జట్టు విదేశ పర్యటన

బొంబాయి, సెప్టెంబరు 1

విదేశ పర్యటనకు వెళ్ళిన మొట్టమొదటి భారతీయ స్కూలు విద్యార్థుల క్రికెట్ జట్టు తమ ఇంగ్లాండు పర్యటనను జయప్రదంగా ముగించుకొని ఈ ఉదయం తిరిగి వచ్చింది. వీరు ఆడిన 18 మాచీలలోనూ 9 మాచీలను గెల్చారు. ఈ టీమ్ మానేజర్ హేము అధికారి వీరిని గురించి చెబుతూ, వీరు మంచిఆరోగ్యంలోనూ, ఆట నేర్చుకోవాలనే ఆసక్తితోనూ, వివిధరకాల వాతావరణాలలో వికెట్ పరిస్థితులకు అనుగుణంగా మారగలవటంలోనూ, క్రమశిక్షణతోనూ, ఆడారన్నారు.

విశాఖలో ఎరువుల ఫ్యాక్టరీ

బేరియమ్ కెమికల్స్ ఆధ్వర్యాన

కొత్తగూడెం, సెప్టెంబరు 1

కొత్తగూడెంలోని బేరియం కెమికల్స్ లిమిటెడ్ విదేశీ సహకారంతో విశాఖపట్నం వద్ద ఏటా 4½ లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేయగల ఎరువుల ఫ్యాక్టరీని నిర్మించటానికి సంకల్పించినట్లు బేరియమ్ కెమికల్స్ సంస్థ విడుదలచేసిన ఒక ప్రకటనను బట్టి తెలుస్తోంది.

కాల్‌టెక్స్ చమురుశుద్ధి కర్మాగారంలో లభ్యమయ్యే నాఫ్తాను ఈ ఎరువుల ఫ్యాక్టరీ వినియోగించుకుంటుంది.

అమెరికా ఆయిల్ అండ్ కో సహకారం కోసం ప్రస్తుతం సంప్రదింపులు జరుగుతున్నాయి. అమెరికా కంపెనీ తన సంసిద్ధతను నాల్గయిదు వారాల్లో తెలియజేయవచ్చునని ఈ ప్రకటన తెలుపుతోంది. విశాఖవద్ద నిర్మించే ఎరువుల ఫ్యాక్టరీ నివేదిక పూర్తయ్యింది.

బేరియమ్ కెమికల్స్ లిమిటెడ్ విడుదల చేసిన ప్రకటనలో యింకా ఈ దిగువ అంశాలున్నాయి :

విశాఖ ఎరువులఫ్యాక్టరీ నిర్మాణానికయ్యే రు. 40 కోట్లు ఖర్చులో 20 కోట్లు ప్రపంచ బ్యాంక్ నుండి లభించుకుంటుందని అంచనా.

ఫ్యాక్టరీ పెట్టుబడిలో రు. 5 కోట్లు విదేశీ పెట్టుబడిదారులు. 13½ కోట్లు భారతదేశంలోని ఆర్థిక సంస్థలకు, 1.5 కోట్లు పబ్లిక్ వాటాల క్రింద కేటాయించుతోంది.

ఇదిలా వుండగా విదేశీ సహకారంతో నిర్మింపబడి ఉత్పత్తికి నోచుకోకపోయిన బేరియం కెమికల్స్ సంస్థ స్థితి ఇప్పుడు కొంత మెరుగు అయ్యింది.

కొత్తగూడెం ఫ్యాక్టరీ నిర్మాణంలో సహకరించిన అమెరికన్ కంపెనీ ఈ సంస్థకు రు. 3 10000 నష్టపరిహారంగా యిచ్చింది. ఫ్యాక్టరీ విస్తరణకు రు 450000 యంత్రాలు యిచ్చింది. మిడిస్ గ్రూపు కంపెనీల సహకారంతో బేరియమ్ కెమికల్స్ ఫ్యాక్టరీ నిర్మింపబడింది.

అమెరికా కంపెనీ చెల్లించిన నష్టపరిహారంవల్ల బేరియమ్ కెమికల్స్ ఆర్థిక స్థితి కొంత మెరుగయ్యింది.

విశాఖలో విద్యుత్ కార్మిక నాయకుని నిరాహార దీక్ష

విశాఖపట్నం ఆగస్టు 31

కొంత మంది ఉద్యోగులకు యిచ్చిన రిట్రెంచిమెంటు నోటీసులను ఉపసంహరించాలని, సప్లిమెంటరీ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రావిడెంట్ ఫండ్ లెక్కలను వెంటనే సరిచూడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్‌బేరర్ శ్రీ సి. హెచ్. సోమేశ్వరరావు, నిన్న మధ్యాహ్నం నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం ముందు నిరాహారదీక్ష ప్రారంభించారు.

ఈరోజుకూడా నిరాహారదీక్ష కొనసాగుతోంది.

ఈలోగా లేబర్ ఆఫీసరు శ్రీ యన్. వి. పట్టాభిరామయ్య వివాద పరిష్కారానికి జోక్యం కల్గించుకొని ప్రయత్నిస్తున్నారు. సంప్రదింపులు రేపుకూడా జరుగుతాయి.

వాల్తేర్ డివిజన్ రైల్వేమెన్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 31

ఆగ్నేయరైల్వేమెన్స్‌రైల్వేమండలి యూనియన్ వాల్తేర్‌బ్రాంచి జనరల్‌బాడీ సమావేశం ఈరోజు సాయంత్రం రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరిగింది. బ్రాంచి యూనియన్ అధ్యక్షులు శ్రీ యన్. ఏ. రాజు అధ్యక్షత వహించారు.

11 వ తేదీ నిరవధిక సమ్మె సన్నాహాల సందర్భంగా ఈ సమావేశం జరిగింది.

శ్రీయుతులు యమ్. వి. భద్రం (పార్లమెంటు సభ్యులు) వి. వెంకటప్పయ్య (మార్కిస్టు) యన్. సోమయాజులు (యమ్. యల్.సి) యమ్. భద్రమూర్తి శర్మ (హార్బర్ అండ్ కోస్టువర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి) శ్రీ ఆర్. శ్రీనివాసరావు (జిల్లా యన్. జి. ఓ. అసోసియేషన్ కార్యదర్శి) ఈ సమావేశంలో ప్రసంగించారు.

మొదట శ్రీ ఆర్. యమ్. రావు వక్తలకు స్వాగతం చెప్పారు.

రాజధానిలో ఉర్దూ ముషాయిరా

రాష్ట్రపతి రాక సందర్భంలో

హైదరాబాద్ సెప్టెంబర్ 1

రాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుసేన్ సమక్షంలో నిన్న రాత్రి రాజభవనులో అంజుమన్ తరక్కీ-ఉర్దూ భాష సంస్థ ఆధ్వర్యాన ఉర్దూ కవి సమ్మేళనం జరిగింది.

ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీ హబీబు రహ్మాన్ రాష్ట్రపతికి స్వాగతం చెప్పారు. రాష్ట్ర అధికారభాషా చట్టంలో ఉర్దూభాష ప్రతిపత్తికిరావలసిన స్థానం ఇవ్వబడలేదని ఆయన అన్నారు. తమ సంస్థ నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలను వివరించారు.

సంస్థ అధ్యక్షులు శ్రీ మీర్ అహ్మద్ అలీఖాన్ కవి సమ్మేళనానికి అధ్యక్ష వహించారు.

శ్రీయుతులు మఖ్దూమ్ మొహియుద్దీన్, అలామా ఖమాయూని, సులేమాన్ అరీబ్, లాక్ మజాజర్, ఖయాల్ మొదలైన ప్రముఖులు కవితాగానం గావించారు. (వి. వి.)

శ్రీనగర్‌లో ప్రశాంత పరిస్థితి

శ్రీనగర్ ఆగస్టు 31

శ్రీనగర్‌లో నేడు వరుసగా నాల్గవరోజుకూడా ఎట్టి దుర్ఘటనలు జరుగకుండా పరిస్థితి ప్రశాంతంగావుంది.

ఇటీవల చెలరేగిన ఆందోళనలు, ఘర్షణలు సందర్భంగా ముగ్గురు మరణించారని, 300 మంది గాయపడ్డారని తెలియవచ్చుచున్నది.

ఈ ఆందోళన సందర్భంగా దాదాపు 100 మంది కాశ్మీర్ బ్రాహ్మణులు స్వయంగా వచ్చి అరెస్టయ్యారని అధికారులు చెప్పారు.

ఈ ఘటనల సందర్భంగా మొత్తం 355 మంది అరెస్టయినట్లు అధికారులు చెప్తున్నారు.

మొత్తం గాయపడిన వారిలో మూడవ వంతు మంది పోలీసులని అధికారులుచెప్పారు.

కాశ్మీర్ బ్రాహ్మణ ప్రతినిధులు కొందరు తనను కలుసుకొని కొన్ని కోర్కెలను వివరించారని, వాటిని తప్పకుండా పరిశీలించవలసివుందని కాశ్మీర్ ముఖ్యమంత్రి శ్రీ జి. ఎం సాదిక్ నేడిక్కడ చెప్పారు. అయితే హిందూబాలిక అపహరణకు సంబంధించిన కేసుపై విచారణ జరపాలన్నా రాష్ట్రంలో మామూలుపరిస్థితులు నెలకొనటం అవసరమని ఆయన చెప్పారు.

గత రెండురోజులుగా ఇక్కడ వున్న కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ ఐ. కె. గుజ్రాల్ వివిధ మతస్థుల నాయకులలో చర్చలు జరిపారు.

మద్య నిషేధం రద్దువల్ల ఆహారకొరత వస్తుందట!

మద్య నిషేధమండలి వింతవాదన

న్యూఢిల్లీ, ఆగస్టు 31

మద్య నిషేధాన్ని రద్దుచేసే ధోరణి ఇటీవల పలు రాష్ట్ర ప్రభుత్వాల్లో కానరావటం ఆందోళనకరమని ప్రధాని ఇందిరాగాంధీకి, అఖిలభారత మద్యనిషేధ మండలి అందజేసిన మెమోరాండంలో పేర్కొన్నది.

ఆహార కొరత, కరువు పరిస్థితి దేశంలో వుండగా, మద్య నిషేధం రద్దుచేస్తే, ఆహార ధాన్యాలు, ఇతర ఆహార వస్తువులు సారా తయారీకి మళ్ళింపబడే ప్రమాదం, వున్నదని అన్నది. మద్య నిషేధం రద్దువల్ల ఆహార పరిస్థితి ఇంకా క్లిష్టం కాగలదని చెప్పింది

మద్య నిషేధం రద్దువల్లప్రభుత్వానికివచ్చే ఆదాయం కంటే, నిషేధం లేకపోవటం వల్ల పెరిగే నేరాల దర్యాప్తుకు, విచారణకు, అలాగే త్రాగుడువల్ల వచ్చే రోగాల నిర్మూలనకు అయ్యే వ్యయం అధికమని అన్నది.

మద్యనిషేధం వున్న రాష్ట్రాలకు ఆదాయం ఎక్కువగా వుంది, అభివృద్ధిరేటు అధికంగా వున్నదని ప్రభుత్వ లెక్కలే తెలుపుతున్నాయని అన్నది.

రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలకు తిలోదకాలు యివ్వటం మంచిదికాదని అన్నది.

దేశంలోని ప్రజాభిప్రాయం మద్యనిషేధానికి అనుకూలమని పేర్కొన్నది.

ఆంధ్ర యూనివర్శిటీ సెప్టెంబర్ పరీక్షలు

11 వ తేదీనుండి ప్రారంభం

వాల్తేర్, ఆగస్టు 31

మెట్రిక్యులేషన్, ప్రీ-యూనివర్శిటీ. బి. ఏ., బి. యస్. సి., బి. కాం., బి. ఎస్. సి. (హోంసైన్స్), న్యూరెగ్యులేషన్స్ రివైజ్డు రెగ్యులేషన్స్ ఒకటి-మూడు సంవత్సరాల పరీక్షలు సెప్టెంబర్ 11 వ తేదీ నుండి ప్రారంభమౌతాయి అని ఆంధ్ర విశ్వవిద్యాలయం నేడు ప్రకటించింది.

"రెండవ సంవత్సరం పరీక్షలు, పైపరీక్షల తరువాత వెను వెంటనే ప్రారంభమౌతాయి. పరీక్షార్థులు తమ గుర్తింపు పత్రాలతో సహా వెళ్ళి ఆయా పరీక్ష కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్లు వద్దనుంచి హాల్ టిక్కెట్లు తీసుకోవలసి వుంటుంది" అని యీ ప్రకటనలో తెలియజేశారు.

పత్రికా సంపాదక మహాసభ

(1 వ పేజీ తరువాయి)

సీయమైన పాత్రను నిర్వహించారని ఆయన చెప్పారు.

దేశంలోని పత్రికలు కవులను తత్వవేత్తలను చేశాయని. పత్రికలచే ప్రభావితులైన అఖ్తర్ షిరాని 'ప్రేమ, స్వాతంత్ర్యాలు రెండూ జీవితావసరాలు. ప్రేమ నా ఊపిరి. స్వాతంత్ర్యం నా విశ్వాసం. ప్రేమకోసం ప్రాణార్పిస్తాను అయితే స్వాతంత్ర్యంకోసం ప్రేమనుసైతం త్యజిస్తాను' అని చెప్పారని పేర్కొన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు : "దేశ ప్రజలు ఈ దృష్టితోనే స్వాతంత్ర్య సాధనకు ధైర్యసాహసాలతో పోరాడారు. మనం తీవ్రమైనవింతైన పరిస్థితిని చూస్తున్నాం. నేటి పరిస్థితి వైరుధ్యాలతో కూడి వున్నది. దేశం స్వాతంత్ర్యాన్ని పొందియున్నది, అయితే దేశంలో పెక్కుమంది స్వాతంత్ర్యంతో విహరిపోయినట్లు కన్పడుతున్నది. ప్రజల కోసం, ప్రజలచేత నిర్వహించబడే ప్రజాప్రభుత్వంకోసం మనం పోరాడాం. ఇదేనా మనం కన్నకలల సమాజం. అని లక్షలాది ప్రజలు రోదనాస్వరంతో ప్రశ్నిస్తున్నారు. 20 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం "ఎక్కడున్నది ఆ? ఎక్కడున్నదికాంతి పుంజాలు" అనే బృహత్ ప్రశ్నలు విన్పడుతున్నాయి

దేశాన్ని సక్రమ మార్గంలో పెట్టేందుకు పత్రికలు అన్వేషణ కృషి సాగించాలి, అని ఆయన అన్నారు.

దేశంలో మొత్తమీద సంపాదకులు, జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలను సాధించినప్పటికీ, అక్కడక్కడా కొంతమంది జర్నలిజంలోని కనీస నైతిక సూత్రాలను విస్మరిస్తున్నారని ఆయన అన్నారు. కుల, ప్రాంతీయ మత విద్వేషాలను ఇప్పటికైనా మనం జయప్రదంగా ఎదుర్కొనగలమనే ఆశాభావాన్ని ఆయన ప్రకటించారు.

అఖిలభారత పత్రికా సంపాదకుల సమావేశంలో చిన్న, పెద్ద పత్రికలన్నింటికీ, అవి దినపత్రికలైనా, వారపత్రికలైనా, స్థానం కల్పించగల ప్రత్యేక స్వభావాన్ని ఈ సమావేశం కల్గివుండాలని ఆయన అన్నారు. అలాంటప్పుడు పత్రికా పరిశ్రమ సమస్యల పరిష్కారాన్ని సక్రమ మార్గంలో సాధించగలమని ఆయన అన్నారు.

పత్రికా సంపాదకుల సంఘాన్ని విస్తృత ప్రాతిపదికపై నిర్మించాలని ఆయన అన్నారు. అప్పుడే పత్రికా స్వాతంత్ర్య సాధనకు ఈ సమస్య పటిష్టవంతమైన ఆయుధంగా వుండగలదన్నారు. సంపాదకులు ప్రాతికేయ వృత్తి సమస్యల పరిష్కారానికి పాటు పడటంతోపాటు, ప్రజా ప్రయోజనాల సాధనకు కృషి సాగించాలని ఆయన అన్నారు.

ఆహ్వాన సంఘాధ్యక్షుని ప్రసంగం

ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ కె. ఆర్. పట్టాభిరామన్ ప్రతినిధులకు స్వాగతం చెబుతూ, దేశంలో విద్యాభివృద్ధి, దానితో పాటు చిన్న పత్రికలు, మధ్యరకం పత్రికల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అయితే గిరాకీకి తగిన మోతాదులో పత్రికల సంఖ్య పెరగలేదని అన్నారు.

న్యూస్‌ప్రింటు, యంత్రపరికరాలు లభ్యం కానందునా, పత్రికలకు సంబంధించిన పరికరాల ధరల పెరుగుదల, మార్కెట్‌పోటీ, రవాణాసౌకర్యాలు తగినంతగా లేకపోవటం పత్రికల సంఖ్య పెరుగుదలకు ఆటంకంగా పరిణమించాయని ఆయన అన్నారు.

చిన్న పత్రికల విచారణ కమిటీ చేసిన ప్రధానమైన సిఫార్సులను పేజీలనుబట్టి ధరలు నిర్ణయించే పద్ధతికి సంబంధించిన సిఫార్సును అమలు పరిస్తే మన రాష్ట్రంలోని చిన్న మధ్యరకం పత్రికలన్నీ అభివృద్ధి చెందగలవనే ఆశాభావాన్ని ఆయన ప్రకటించారు.

భారతదేశంవంటి ప్రజాస్వామిక బడుగు దేశాలలో పత్రికలకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు.

పత్రికలకు అనవసరమైన న్యూస్‌ప్రింటు తదితరాల దిగుమతిపై ప్రభుత్వం అమలు జరుపుతున్న ఆంక్షలు పత్రికల భవితవ్యాన్ని దెబ్బతీస్తున్నాయి అని అన్నారు.

చిన్న, మధ్యరకం పత్రికలకు ఎక్కువ అడ్వర్‌టైజుమెంట్లు ఇవ్వటం ద్వారా వాటిని ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచించారు.

అమెరికా దాడులకు స్వస్తి జరిగినప్పుడే వియత్నాంలో శాంతి

ఉత్తరవియత్నాం ప్రధాని ఫామ్‌వాన్‌డాంగ్ స్పష్టీకరణ

హాంకాంగ్, ఆగస్టు 31

హనోయ్‌తో శాంతి సంభాషణలు ప్రారంభించాలనేది తథ్యమే అమెరికాకువుద్దేశమునుకుంటే ఉత్తర వియత్నాంపై విమాన దాడులను, యుద్ధ చర్యలను స్వస్తిచెప్పాలని, హనోయ్ ప్రభుత్వ ప్రధాని ఫామ్‌వాన్‌డాంగ్ ఈరోజు స్పష్టం చేశారు.

ఉత్తర వియత్నాం 22 వ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన పెద్ద సభలో ఆయన మాట్లాడుతూ "వియత్నాం సమస్య పరిష్కారానికి" తాము సూచించిన 4 అంశాల ప్రణాళికే ఉత్తమోత్తమమైనదని అన్నారు.

"వియత్నాం సమస్యాపరిష్కారానికి, అమెరికా ఒకమార్గం చూపించటంలో విఫలమయ్యిందని విమర్శించారు.

"నిజంగా వియత్నాంలో శాంతి నెలకొనాలన్న శాంతి సంభాషణలు ప్రారంభం కావాలని అమెరికా కోరుకుంటే షరతులు లేకుండా బాంబువర్షాన్ని నిలిపివేయాలి.

ఉత్తర వియత్నాంపై అమెరికా సామ్రాజ్యవాదులు దుర్మార్గంగా యుద్ధం ప్రారంభించారు. కాని బాంబువర్షాలు జరిపి ఉత్తర వియత్నాం ప్రజలు లొంగటం కల్ల" అన్నారు.

వియత్నాం సమస్యా పరిష్కారానికి హూవర్ సూచన

వాషింగ్టన్, ఆగస్టు 31

ఉత్తర వియత్నాంపై విమానదాడుల్ని కట్టిపెట్టి, వియత్నాం సమస్యను జాన్సన్ ప్రభుత్వం ఐరాసకు నివేదించాలని, దక్షిణ వియత్నాంలో ఎన్నికల అనంతరం ఈ ఎనిమిదేళ్ల ఢిల్లీలోని అమెరికా మాజీ రాయబారి జె. యస్. కూపర్ (రిపబ్లికన్) ఈ రోజు సూచించారు.

దీనివల్ల శాంతిపట్ల అమెరికాయొక్క ప్రగాఢ వాంఛ మరింతప్రస్ఫుటం కాగలదనిచెప్పారు.

వియత్నాంపై ఇంకా విమానదాడుల్ని తీవ్రం చేయాలని జాన్సన్ ప్రభుత్వం భావిస్తున్న సమయంలో కూపర్ ఈ సూచన చేశారు.

వియత్నాం సమస్యను ఐ. రా. సకు నివేదించి, ఉత్తర వియత్నాంపై బాంబుదాడుల్ని నిలిపివేయటంవల్ల సోవియట్ యూనియన్, భద్రతా సంఘం తమ బాధ్యతలను నిర్వహించటానికి వీలుంటుందని డెమోక్రటిక్ సెనేటర్ మాన్స్‌ఫీల్డ్ చేసిన సూచనను కూపర్ బలపర్చారు.

"బాంబులవానవల్ల వియత్నాం సమస్య వంటి క్లిష్టసమస్య పరిష్కారం అవుతుందని నేను భావించటంలేదు. శాంతి సంభాషణలు దోహదకారి అవుతుందనుకుంటే ఉత్తర, దక్షిణ వియత్నాంలు రెండింటిలోనూ అమెరికా యుద్ధవిరమణకు పూనుకోవాలని" అన్నారు.

జాన్సన్ ఉన్మాదం

శత్రువు ఎంత భయంకరంగా ప్రవర్తించినా, వియత్నాంతో అమెరికా వెనుకడుగు వేయదని. లక్ష్యం నెరవేరేవరకు అమెరికా సైన్యాలు పోరాట రంగంలో ఉండాల్సిందేనని జాన్సన్ అన్నారు.

వియత్నాం యుద్ధంలో వికలాంగులయిన సైనికులు, రెండవ ప్రపంచ యుద్ధంలో వికలాంగులయిన వారికి కల్పించిన సౌకర్యాలను కల్గిస్తూ చేసిన బిలుపై సంతకం చేస్తూ జాన్సన్ పైవిధంగా అన్నారు.

వియత్‌కాంగ్ దళాలచే అమెరికా సైనికుల వధ

సైగాన్, ఆగస్టు 31

అమెరికా 25 వ పదాతిదళ డివిజన్‌పై వియత్‌కాంగ్ గెరిల్లాలు ఈరోజు దాడిచేసి 8 మందిని హతమార్చారు 44గురిని గాయపర్చారు.

సైగాన్‌కు పశ్చిమోత్తరంగా 14 మైళ్ళలో జరిగిన ఈ పోరాటంలో అమెరికా సైనికులతో గెరిల్లాలు సుమారు 10 గంటలసేపు హోరాహోరీ పోరాడారు.

బిన్హ్ దిన్హ్ రాష్ట్రంలో అమెరికా సైనిక శిబిరంపై దాడిచేసి సైనిక శిక్షణ యివ్వటం కోసం సైగాన్ ప్రభుత్వం బలవంతంగా తీసుకొచ్చిన 33 మంది యువకుల్ని విడిపించుకు పోయారు.

మెకాంగ్‌డెల్టాలో ఒక వంతెనను పేల్చివేసి, రోడ్డును గండి కొట్టారు.

క్వాంగ్‌టిన్ రాష్ట్రంలోని ఒక పట్టణంపై మొన్న గెరిల్లాలు దాడిచేసి 150 మందిని చంపారని 50 మందిని గాయపర్చారని సైగాన్ ప్రభుత్వ ప్రతినిధి చెప్పారు.

గతరాత్రి ఉత్తర వియత్నాంపై అమెరికా విమానాలు 167 దాడులు చేశాయి.

ఈ దాడుల్లో రెండు విమానాలు కూలిపోయాయి.

బి. 52 విమానాలు యుద్ధ విరమణ శ్రేణిలోని ప్రాంతాలపై అగ్నివర్షం కురిపించాయి.

'నాల్గవ ప్రణాళికా లక్ష్యాలు, వ్యయంలో, కోత అనివార్యం!'

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవినుండి వైదొలగుతూ ప్రధాని ఇందిరాగాంధికి అశోక్ మెహతా నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1

నాల్గవ ప్రణాళిక భౌతిక లక్ష్యాలలోనూ, వ్యయంలోనూ కోత అనివార్యమని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి వైదొలగుతున్న శ్రీ అశోక్ మెహతా ప్రధాని ఇందిరాగాంధికి అందజేసిన నివేదికలో పేర్కొన్నారు.

శ్రీ మెహతా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష బాధ్యతలను ఈరోజు డాక్టర్ గాడ్గిల్‌కు అప్పగించారు.

నెహ్రూ ప్రధానిగా వుండగా 1963 లో శ్రీ మెహతా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవిని స్వీకరించారు. లాల్‌బహదూర్‌శాస్త్రి మృతి అనంతరం ఇందిరాగాంధీ ప్రధాని అయిన తర్వాత 1966లో శ్రీ మెహతా ప్రణాళికాశాఖ మంత్రిగాకూడా నియమితులయ్యారు.

ఉపాధ్యక్ష పదవీ విరమణ సందర్భంగా శ్రీ మెహతా రూపొందించిన నివేదికలో ప్రణాళికా సంఘం అత్యవసర కర్తవ్యాలుగా ఈ దిగువ అంశాలను పేర్కొన్నారు.

1. 1968-69 సంవత్సరానికి వార్షిక ప్రణాళికను రూపొందించటం.
2. చతుర్థ ప్రణాళికకు తుదిరూపం యివ్వటం.
3. ప్రణాళికా సంఘం పనిని పునర్వ్యవస్థీకరించటం,
4. 5 వ ప్రణాళికను రూపొందించే పనిని మొదలుపెట్టటం,

పునర్వ్యవస్థీకరించిన జాతీయాభివృద్ధి మండలి ప్రథమ సమావేశం గురించి పరిశీలన, ఎజెండాను రూపొందించటం జరగాలని అన్నారు.

నాల్గవ ప్రణాళిక ముసాయిదా ప్రకటన అనంతరం, ఆర్థిక పరిస్థితిలో మార్పులు. వనరుల పరిస్థితిని గురించి 1966 ఆగస్టులో ప్రకటించటం జరిగిందని. ఈ ప్రకటన దృష్ట్యా, ప్రణాళికా లక్ష్యాలు, వ్యయం విషయంలో పునరాలోచన అవసరమని అన్నారు.

మొదటి రెండేండ్లలో పెట్టిన వ్యయం చాలా అల్పంగా వున్నందున మిగిలిన మూడేండ్లలో 70 శాతం పనిని పూర్తి చేయాల్సి వుంటుందని వ్రాశారు.

వనరుల అస్తవ్యస్త పరిస్థితి. ఇతరఅవరోధాల దృష్ట్యా, ఈ పని సాధ్యమయ్యేదిగా లేదని తెలిపారు,

గత రెండేళ్ళలో సాధించిన అభివృద్ధి ఎదురున్న ఇక్కట్లను దృష్టిలో వుంచుకొని నాల్గవ ప్రణాళిక పథకాల గురించి పునరాలోచించుకోవాలని సూచించారు.

ఈ క్రిందివిధంగా మార్పులు, వుండాలని మెహతా సూచించారు.

1. కొన్ని లక్ష్యాలలో కోత పెట్టడం అవసరం.
2. మొదటి రెండేండ్లలో మందకొడిగా సాగిన అభివృద్ధిదృష్ట్యా అనుకున్న లక్ష్యాల సాధన నాల్గవ ప్రణాళికలో సాధ్యపడదు.
3. ప్రణాళిక పథకాల్లో కీలకమయిన రంగాలు కుంటుపడకుండా కొన్ని మార్పులు చేయాలి.

మార్పుల విషయమై ప్రణాళికా సంఘం ఇప్పటికే కొన్ని రాష్ట్రాలతో చర్చలు జరిపింది. వనరుల పరిస్థితి తేలితేగాని తుదిరూపం ఎలావుండేది తెలియదు.

ఆహారధాన్యాల దిగుమతులు పెరగటం. వనరుల హరింపుకు ఒక కారణంగా మెహతా పేర్కొన్నారు.

"నాల్గవప్రణాళిక ముసాయిదాను రూపొందించిన తర్వాత కేంద్ర ఉద్యోగులకు డి. ఏ. పెంపుదలవల్ల నాల్గవ ప్రణాళికా వనరులలో 200 కోట్ల మేరకు హరింపు అయ్యింది.

కొన్ని రాష్ట్రాలు భూమిశిస్తును రద్దు చేయటం. ఇంకా కొన్ని పన్నులను రద్దు చేయటం, సబ్సిడీలు ప్రకటించటం వల్ల రాష్ట్రాల వనరుల హరింపు. అయినాయి.

మాంద్య పరిస్థితి ఎదుర్కొంటున్న ఆర్థిక వ్యవస్థ తిరిగి ఎప్పుడు పునర్జీవం పొందుతుందనే అంశంపై వనరుల సేకరణ అవకాశాలు ఆధారపడి వుంటాయి.

లక్ష్యాలు, వ్యయంలో కోతపెట్టటమేగాక, ముసాయిదా ప్రణాళికపై పార్లమెంటు వెలుపల బయటా వచ్చిన విమర్శలదృష్ట్యా, వివిధ పథకాలకు ప్రాధాన్యత విషయంలో యిచ్చిన స్థానాల్లో మార్పులు అవసరమని మెహతా సూచించారు.

నాల్గవ ప్రణాళిక మొదటి రెండేండ్ల అనుభవందృష్ట్యా. ఐదవ ప్రణాళికలో ఇరిగేషన్, విద్యుత్, రవాణా, పరిశ్రమలకు తగు మొత్తాలు కేటాయించాలని సూచించారు.

పబ్లిక్ రంగం వనరుల గురించి మరోసారి సమీక్షించటం, అలాగే ప్రయివేటు రంగం వనరుల పరిశీలన అవసరం.

ఏ పథకాలకు ప్రాముఖ్యత యివ్వాలి? వ్యవసాయ రంగంలో ఏ మేరకు అభివృద్ధిని వచ్చే మూడేండ్లలో సాధించగలం? వివిధ రంగాలలో గల ఉత్పత్తి శక్తుల్ని పూర్తిగా ఏలావినియోగం చేసుకోవాలి? ఎగుమతుల అభివృద్ధికి, దిగుమతుల తగ్గింపుకు. ఏమి చర్యలు యింకా అవసరం? వగైరా విషయాలను పరిశీలించవలసివుందని మెహతా అన్నారు,

గుర్తుంచుకోండి. మంచి వస్తువుల ధర ఎక్కువ,


Edison
ఎలక్ట్రికల్ సప్లయిన్స్
జీవితకాలం నమ్మకంగా
పని చేయునవి
Edison
Mfg: SOLAR ELECTRIC TRADING CO.
11 KHORSHED BUILDING, SIR P M ROAD, BOMBAY-1.

సోల్ రిప్రజెంటేటివ్లు : ఆనంద్ ఏజెన్సీస్
బి. 1/21 పట్టాభిపురం. గుంటూరు-1

అత్యధికంగా ధాన్యమును పండించుకునేందుకు నాలుగు విధానములు

అస్పీ సీడ్-డ్రెస్సింగ్ డ్రమ్‌తో గింజలకు పూత పూయుట.

2. అశ్పీ ప్యాడీ వీడర్‌తో కలుపులు తీయుట. ధాన్యపు పంటల మధ్య పెరిగే కలుపులను తీయుటకు అత్యంత సమర్థత గలిగి సరిగ్గా పనిచేసే మెషిన్. ఇది కలుపులను తీసి ధాన్యపు మొక్కల వేళ్లకు గాలిని తగలనిచ్చి అత్యధికంగా పంటను పండేటట్లు చేయును.

3. పంటల రక్షణకు: క్రొత్త పంటల మీద శీకర్ పోలి సాప్‌సాక్ స్ప్రేయర్‌తో స్ప్రే చెయ్యండి. పూర్తిగా పెరిగిన పంటల మీద ఓరియంట్ హ్యాండ్ రోటరీ డస్టర్‌తో జల్లండి లేక అస్పీ బోలో జూనియర్ లేక మిస్ట్ బ్లోయర్‌తో స్ప్రే చెయ్యండి.

4. నూర్పుట : అశ్పీ ప్యాడీ థ్రెషర్ సాధారణ రోజున, సరాసరి 800 నుంచి 900 కి. గ్రా. వరకు రోజుకు ధాన్యమును నూర్చును.

అమెరికన్ స్ప్రింగ్ & ప్రెస్సింగ్
వర్క్స్ ప్రై. లి. మార్వే రోడ్,
మలాడ్, బొంబాయి-64 ఎన్ బి
టెలిఫోన్ : 692331 (5 లైన్లు)
టెలిగ్రామ్ : కిల్లోశాప్.మలాడ్

ఆంధ్రప్రదేశ్‌కు పంపిణీదారులు ;
గంటి అండ్ కం. ప్రై. లి., పోస్టు బాక్సు నం. 39, 128, మహాత్మగాంధి రోడ్, సికందరాబాద్. టెలిగ్రామ్: గంటికొ. టెలిఫోన్, నం. 74400. శ్రీరామ కార్పొరేషన్, పోస్టు బాక్సు నం. 31, పోర్టు గేట్, రాజమండ్రి. టెలిగ్రామ్: రాంకోర్. టెలిఫోన్ నం. 9. శ్రీరామ కార్పొరేషన్, పోస్టుబాక్సు నం. 303, ఏలూరు రోడ, విజయవాడ. టెలిగ్రామ్: రాంకోర్, టె. నం. 598.

ASPEE/67/TL-1

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కొల్లిగడ్డ రాజగోపాలరావు, ప్రధాన సంపాదకులు : ఏటుకూరు బలరామమూర్తి, ముద్రణ : స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్, విజయవాడ-4.